శనివారం
5•08•2017

కరీంనగర్

• వెల.5 రూ.

• సంపుటి 7 • సంచిక 39
• పేజీలు : 12 + 4 + 20

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


రాష్ట్రపతికి శుభాకాంక్షలు..

నూతన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను శుక్రవారం ఢిల్లీలో ఎంపీ కవిత, నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు . గత నెల 4వ తేదీన హైదరాబాద్‌కు వచ్చినపుడు సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆతిథ్యాన్ని మరిచిపోలేనని రామ్‌నాథ్‌కోవింద్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



మంత్రి తుమ్మలకు స్వల్ప అస్వస్థత

ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని చెప్పిన వైద్యులు ■ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పరామర్శ



హైదరాబాద్/సిటీబ్యూరో/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వాంతులు కావడంతో వెంటనే కుటుంబసభ్యులు సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. వైద్యులు పలురకాల పరీక్షలు చేసి, ఆహారం అరుగకపోవడంతోనే వాంతులు అయ్యాయని చెప్పారు. అల్సర్ ఉండడం వల్ల వాంతుల్లో రక్తం పడిందని, భయపడాల్సిన అవసరం లేదని ఫిజీషియన్ ఎంవీ రావు తెలిపారు. రక్తపోటు కూడా తగ్గిందని, చికిత్స అందించి రక్తస్రావాన్ని నిలిపివేశామని వెల్లడించారు. మళ్లీ రక్తస్రావం అయ్యే అవకాశం ఉన్నందున రెండురోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స కొనసాగిస్తామని వివరించారు. ఆరోగ్యం కుదుటపడితే శనివారం డిశ్చార్జి చేస్తామని వెల్లడించారు. రెండేండ్ల కిందట మంత్రి తుమ్మల గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. అప్పటి నుంచి మందులు వాడుతున్నారు. ఈ క్రమంలో వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మంత్రి తుమ్మలను వైద్యారోగ్యశాఖ మంత్రులు డాక్టర్ సీ లక్ష్మారెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, 'నమస్తే తెలంగాణ' సీఎండీ దీవకొండ దామోదర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి రిపోర్టులను పరిశీలించి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మలకు సూచించారు.

దవాఖానకు తరలింపునకు గ్రీన్ చానల్

శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మంత్రి తుమ్మల అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అంబులెన్స్ ద్వారా బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసం నుంచి కేవలం పది నిమిషాల్లోనే సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. అత్యవసరంగా దవాఖానకు తరలించాల్సిన పరిస్థితిని కుటుంబ సభ్యులు నగర ట్రాఫిక్ విభాగానికి తెలిపారు. సిబ్బంది అప్రమత్తమై దారి పొడువునా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా అన్ని చౌరస్తాల్లో గ్రీన్ చానల్ విధానాన్ని అమలు చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సాధారణ ట్రాఫిక్‌ను కొద్దిసేపు ఆపి అంబులెన్స్‌కు దారి ఇచ్చారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన టీఆర్‌ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత

జగిత్యాలకు బైపాస్ రోడ్లు వేయండి..

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: జిల్లా కేంద్రంగా ఇటీవలే మారిన జగిత్యాల పట్టణానికి బైపాస్ రోడ్లు వేయాలని ఎంపీ కవిత కేంద్ర రోడ్డురవాణా మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. చల్‌గల్-పొలాస మధ్య, చల్‌గల్, అంతర్గాం మీదుగా దరూర్ లేదా రాజారం వరకు నిజామాబాద్-కరీంనగర్‌లను కలుపుతూ బైపాస్ రోడ్డును, రెండు జాతీయ రహదారుల (నెం. 563-63)ను కలుపుతూ దరూర్, నర్సింగ్‌పూర్ మీదుగా పొలాస వరకు బైపాస్‌రోడ్లను నిర్మించాలని కోరారు.



కేంద్ర మంత్రి దత్తాత్రేయకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి తదితరులు

ఈఎస్‌ఐ దవాఖానను ఆధునీకరించండి

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయతో శుక్రవారం సమావేశమైన కవిత నిజామాబాద్ పట్టణంలోని ఈఎస్‌ఐ దవాఖానను ఆధునీకరించి 50 పడకల స్థాయికి పెంచాలని కోరారు. కోరుట్ల, జగిత్యాలల్లో కొత్తగా ఈఎస్‌ఐ దవాఖానాలను నెలకొల్పాలని కోరారు. కేంద్ర మంత్రి దీనికి సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని ఇచ్చినట్లయితే కొత్తగా ఏర్పడిన 21 జిల్లా కేంద్రాల్లోనూ ఈఎస్‌ఐ దవాఖానలు ప్రారంభిస్తామని చెప్పారు. నిజామాబాద్ ఈఎస్‌ఐ దవాఖానలో డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

శరవేగంగా యాదాద్రి అభివృద్ధి

■ వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదగిరిగుట్ట దేవాలయం అభివృద్ధి పనులను 2018 మార్చినాటికి పూర్తి చేస్తామని, యాదాద్రి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) వైస్‌చైర్మన్ జీ కిషన్‌రావు తెలిపారు. దేశానికి తలమానికంగా ఈ క్షేత్రాన్ని రూపుదిద్దుతున్నామని శుక్రవారం ఆయన నమస్తే తెలంగాణ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. గతేడాది ఏప్రిల్‌లో బాలాలయం ప్రతిష్ఠాపన జరిగినప్పటి నుంచి దేవాలయంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సివిల్‌వర్క్స్ 70శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం పనులను వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేసి మహోన్నతంగా తీర్చిదిద్దిన ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రాజెక్టు తొలిదశ కింద 14 ఎకరాల్లో విస్తరించి ఉన్న యాదాద్రి క్షేత్రం చుట్టూ మహాప్రాకారం నిర్మించామని, లోపల నాలుగు ఎకరాల్లో గర్భగుడి సహా ప్రధాన అలయాలతో కూడిన మూడుప్రాకారాలుంటాయన్నారు. మహాప్రాకారం లోపల భక్తుల కోసం విశాలమైన ప్రాంగణాలు నిర్మిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ సంకల్పం, త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామీజీ సూచనల మేరకు గొప్ప ఆధ్యాత్మిక శోభవెల్లివిరిసేలా ఆలయాన్ని తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకునే విధంగా 3500 మందికి సరిపడా క్యూకాంప్లెక్స్, ఇతర వసతులను కల్పిస్తున్నామన్నారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని కాంస్యంతో లేదా రాతితో నిర్మించే విషయమై చర్చిస్తున్నామన్నారు. గుట్టపై విమానగోపురం సహా ఏడు గోపురాల నిర్మాణం జరుగుతున్నది. యాదగిరిగుట్ట, కాహెడ, ఆళ్లగడ్డ, కమ్మవారిపాలెం, మార్టూరు, కోటప్పకొండకు చెందిన దాదాపు 500 మంది శిల్పులు ఈ ఆలయ నిర్మాణం కోసం అహోరాత్రులు పనిచేస్తున్నారని వివరించారు.

మరో వివాదంలో టీటీడీ

■ ఆగమశాస్త్రానికి విరుద్ధంగా శ్రీవారి ఆలయంలో నిర్మాణాలు

తిరుమల, నమస్తే తెలంగాణ: టీటీడీ మరో వివాదంలో చిక్కుకున్నది. వైఖానస ఆగమశాస్త్రానికి విరుద్ధంగా వెండివాకిలి వద్ద ఇనుప నిచ్చెనలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై నుంచి భక్తులు వెలుపలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని, బయటకెళ్లడానికి వెండివాకిలి ఒక్కటే మార్గం. ఇరుకైన ఈ మార్గంతో భక్తుల మధ్య తోపులాటలు జరుగుతున్నాయి. వీటి నివారణకు.. శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వచ్చే భక్తులను ఈ ఇనుప నిచ్చెనల ద్వారా బయటికి తరలించాలని నిర్ణయించిన టీటీడీ ఆ మేరకు పనులను ప్రారంభించింది. ఈ నిర్మాణం పూర్తయితే భక్తులు నిచ్చెన మార్గంలో 30 అడుగులు పైకెక్కి, తిరిగి మరో 30 అడుగులు దిగాలి. వైఖానస ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం మూలమూర్తి కంటే ఎత్తులో ఎవరూ నడవటానికి వీల్లేదు. దీనిపై ఆలయ జీయర్లు కూడా స్పందించడం లేదు. అయితే రద్దీ సమయాల్లో భక్తుల ఇబ్బందులు తొలిగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అన్నారు. ఆగమ పండితులను సంప్రదించాకే ఈ నిర్ణయం తీసుకున్నాని ఈవో చెప్పారు.

15 వరకు మైనారిటీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నాటికి 100 శాతం సీట్లు భర్తీచేసి అడ్మిషన్ల ప్రక్రియ ముగించాలని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (టెమ్రీస్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 203 మైనారిటీ గురుకులాల్లో సీట్లను పూర్తిగా భర్తీచేయాలని ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. మైనారిటీ బాలికల స్కూళ్లలో సీట్లు ఎక్కువ సంఖ్యలో మిగిలి ఉండడంతో వీటిపై టెమ్రీస్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు.మైనారిటీ గురుకులాల్లో 50 వేలకు పైగా సీట్లు ఉంటే మూడు వేల సీట్లు భర్తీకాలేదని అధికారులు చెప్తున్నారు.రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందిలో ప్రతిభ సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఈ నెల 5న ఉపాధ్యాయుల ఇంటర్నల్ టెస్ట్ నిర్వహిస్తున్నారు.

సిస్టర్స్ ఫర్ చేంజ్‌కు చేయూత

■ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పిలుపు

■ ఎంపీ కవితకు అభినందనలు

■ 'సిస్టర్స్ ఫర్ చేంజ్' వెబ్‌సైట్ ప్రారంభం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:



'సిస్టర్స్ ఫర్ చేంజ్' వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, షకీల్ , జీవన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, టీఆర్‌ఎస్ జగిత్యాల ఇన్‌చార్జి సంజయ్ కుమార్

'చెల్లెలికి అన్న రక్ష - అన్నకు హెల్మెట్ రక్ష' నినాదంతో ఈ సంవత్సరం రాఖీ పండుగకు పిలుపు ఇచ్చిన నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఈ నినాదానికి మరింత ప్రచారం కల్పించడం కోసం 'సిస్టర్స్ ఫర్ చేంజ్' వెబ్‌సైట్‌ను రూపొందించారు. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం తన కార్యాలయంలో ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎంపీ కవిత ఉన్నతమైన ఆశయంతో తలపెట్టిన ప్రచారోద్యమానికి అందరూ చేయూతనివ్వాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ వెబ్‌సైట్‌ను ప్రారంభించడంతోపాటు స్పీకర్ స్పందించిన తీరుపై సంతోషం వ్యక్తం చేశారు. మన దేశంలో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాల్లో సుమారు 400మంది బైక్‌రైడర్లు హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారని కవిత చెప్పారు. దీన్ని నివారించేందుకు 'అన్నదమ్ములకు రాఖీ కట్టండి, ఒక హెల్మెట్‌ను గిఫ్ట్‌గా ఇవ్వండి' అని తాను ఇచ్చిన పిలుపునకు మంచి స్పందన వచ్చిందని, సోషల్ మీడియా ద్వారా చాలామందికి చేరుకున్నదని తెలిపారు. ప్రతి అక్క, చెల్లెమ్మ వెబ్‌సైట్‌లో వారి పేర్లను నమోదు చేసుకుని అన్నలకు, తమ్ముళ్ళకు హెల్మెట్ రూపంలో రక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, జీవన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, జగిత్యాల టీఆర్‌ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో మునుకుంట్ల రమేశ్

తెలుగు మహాసభలకు మద్దతు

తెలంగాణ కెనడా అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునుకుంట్ల రమేశ్

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని తెలంగాణ కెనడా అసోసియేషన్ ఆశాభావం వ్యక్తంచేసింది. అందుకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నది. సైఫాబాద్‌లోని కళాభవన్ (రవీంద్రభారతి ప్రాంగణం)లో భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణను శుక్రవారం తెలంగాణ కెనడా అసోసియేషన్ వ్యవస్థాపకుడు, జాగృతి కెనడాశాఖ అధ్యక్షుడు మునుకుంట్ల రమేశ్ కలిసి మద్దతు తెలిపారు. కెనడాలో తెలంగాణ వాసుల్ని జాగృతం చేస్తూ , 17 ఏండ్లుగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ఆ సంఘం ప్రతినిధులను మామిడి హరికృష్ణ అభినందించారు.

లోక్‌సభలో టీఆర్‌ఎస్ వాయిదా తీర్మానం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

■ ప్రభుత్వ పథకాలపై జీఎస్టీ భారం వద్దు

■ నీళ్లు, డబుల్ బెడ్‌రూం ప్రాజెక్టులకు పన్ను మినహాయించాలి

■ లోక్‌సభలో జితేందర్‌రెడ్డి సహా టీఆర్‌ఎస్ ఎంపీల డిమాండ్

■ జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ హామీ

ప్రభుత్వ పథకాలపై జీఎస్టీ భారం విషయమై చర్చించడానికి టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి లోక్‌సభలో శుక్రవారం వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నరేండ్లుగా అమలుచేస్తూ ఉన్న వివిధ పథకాలకు ఇప్పుడు జీఎస్టీ వల్ల అదనపు భారం పడుతున్నదని, పాత పథకాలే కనుక వాటిని ప్రభుత్వం జీఎస్టీ నుంచి మినహాయించాలని అన్నారు. దీనిపై సభలో చర్చకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను నోటీసు అందజేశారు.అయితే ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి ఈ అంశంపై చర్చించలేమంటూ స్పీకర్ నిరాకరిస్తూనే, జీరో అవర్ ప్రారంభానికి ముందు మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజోపయోగం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల వ్యయం అంచనాతో చేపట్టిన సాగు, తాగునీటి పథకాలు, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వంటి పథకాలకు జీఎస్టీని వర్తింపజేయరాదని అన్నారు. ఈ పథకాలపై 18శాతం జీఎస్టీ వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.19,200 కోట్ల మేరకు అదనపు భారం పడుతుందని తెలిపారు. ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటిని అందించడం కోసం తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో తాగునీటి పథకాన్ని, ప్రతి పొలానికి సాగునీటిని అందించేందుకు మిషన్ కాకతీయ పేరుతో చెరువులను పునరుద్ధరణ పథకాన్ని అమలుచేస్తున్నదని జితేందర్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల పూర్తిస్థాయి వినియోగానికి అనేక సాగునీటి ప్రాజెక్టులను చేపట్టిందని, పేదల కోసం ఉచితంగా ఇవ్వడానికి డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. ఇవన్నీ పాత పథకాలు, 5శాతం వ్యాట్ పన్ను రేట్లు ఉన్నప్పుడు వేసిన బడ్జెట్‌తో చేపట్టినవని చెప్పారు. వీటిలో ఎలాంటి వ్యాపార దృక్పథం లేదని తెలిపారు. కాబట్టి ఇటువంటి ప్రభుత్వ పథకాలను జీఎస్టీ నుంచి మినహాయించాలి లేదా 5 శాతం మించకుండా పన్ను వేయాలని కోరారు. సభలో ఉన్న మిగతా టీఆర్‌ఎస్ ఎంపీలు కూడా కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ లేచి ఈ అంశాన్ని శనివారం జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జితేందర్‌రెడ్డి తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, జీఎస్టీ కౌన్సిల్‌లో సానుకూల నిర్ణయం జరిగితే ఒక్క తెలంగాణకు మాత్రమేగాక మిగతా రాష్ట్రాలకు కూడా మేలు కలుగుతుందని చెప్పారు.




శుక్రవారం లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి

మైక్ కమింగ.. హైదరాబాద్ అల్లుడు!

■ పాతబస్తీ యువతితో ప్రేమ వివాహం

■ నానక్‌రాంగూడలో సొంత ఫ్లాట్‌లో నివాసం

■ సిట్ విచారణలో ఆసక్తికర విషయాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేరు మోసిన డ్రగ్స్ మాఫియా డాన్ మైక్ కమింగ.. హైదరాబాద్ అల్లుడని సిట్ విచారణలో తెలిసింది. నెదర్లాండ్స్ పౌరుడు మైక్ కమింగను శుక్రవారం కోర్టు అనుమతితో సిట్ అధికారులు మూడు రోజల కస్టడీకి తీసుకున్నారు. తొలిరోజు విచారణలో కమింగ గురించి ఆసక్తికర విషయాలు బయటికొచ్చాయి. ఏడేండ్లుగా హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న కమింగ, పాతబస్తీ యువతిని ప్రేమవివాహం చేసుకొని నానక్‌రాంగూడలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకుని కాపురం చేస్తున్నట్టు తెలిసింది. వీరికి మూడేండ్ల కుమారుడు కూడా ఉన్నాడు. నెదర్లాండ్స్ నుంచి ఖరీదైన డీఎంటీ డ్రగ్(డీమీథైల్ ట్రైప్టమైన్)ను కాలేజీ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ నిపుణులకు విక్రయించేవాడని వెలుగులోకి వచ్చింది. డ్రగ్స్ విక్రయాలతో వచ్చిన డబ్బుతో ఖరీదైన జీవితం గడుపుతూ జల్సాలు చేస్తున్నట్టు గుర్తించారు. ఇటీవల కమింగ ఎక్సైజ్ అధికారులకు పట్టుపడినప్పుడు 2.6 గ్రాముల డీఎంటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ అత్యంత ఖరీదైనదని, ఒక్కో యూనిట్ రూ.4 వేల నుంచి 5 వేల వరకు ఉంటుందని తెలిసింది.



రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న సీఐఎస్‌ఎఫ్‌డీజీ ఓపీ సింగ్, జీహెచ్‌ఐఎల్ సీఈవో ఎస్‌జీకే కిశోర్

దేశీయ ప్రయాణికులకు ఇక నేరుగా సెక్యూరిటీ చెకింగ్

■ 'ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఫెసిలిటీ' ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తరచుగా దేశీయ విమాన ప్రయాణాలు చేసేవారు బోర్డింగ్‌పాస్‌ల కోసం ఇక గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేదు. నేరుగా సెక్యూరిటీ చెక్‌కు వెళ్లే వెసులుబాటును కల్పించారు. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 'ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఫెసిలిటీ'ని (సీఐఎస్‌ఎఫ్) డీజీ ఓపీ సింగ్, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) సీఈవో ఎస్‌జీకే కిశోర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఫెసిలిటీ విధానంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మిషన్లలో డొమెస్టిక్ ప్రయాణికులు వారి పీఎన్‌ఆర్ నంబర్‌ను రాస్తే వారికి బోర్డింగ్‌పాస్ వస్తుందని సీఐఎస్‌ఎఫ్ డీజీ ఓపీ సింగ్ తెలిపారు. దీన్ని తీసుకున్న ప్రయాణికులు నేరుగా సెక్యూరిటీ చెకింగ్‌కు వెళ్లవచ్చన్నారు. ఈ వసతి దేశీయ ప్రయాణికుల్లో కేవలం తక్కువ లగేజీ (ఒకే హ్యాండ్ బ్యాగ్) ఉండేవారికే వర్తిస్తుందన్నారు. ఇక్కడే దేశంలో తొలిసారిగా ఈ వసతిని ప్రారంభించినట్టు జీహెచ్‌ఐఏఎల్ సీఈవో కిశోర్ పేర్కొన్నారు.

రెండేండ్లలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు విస్తరణ!

రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రెండు నుంచి మూడేండ్లలో విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) సీఈవో ఎస్‌జీకే కిశోర్ తెలిపారు. రెండేండ్లలో ఎయిర్‌పోర్టు సామర్థ్యం ఏడాదికి 25 నుంచి 30 మిలియన్లకు పెంచేలా ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన పర్యావరణ అనుమతులు రెండువారాల క్రితం వచ్చినట్టు ఆయన తెలిపారు.

'అతిథి' ఎడిటర్‌కు తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ తెలుగు మాసపత్రిక 'అతిథి' ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు ఎం వెంకటేశ్వరరావుకు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. 2016 సంవత్సరానికి ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఏటా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కీర్తి పురస్కారాలను ప్రదానం చేస్తుంది. అందులో భాగంగా వెంకటేశ్వరరావు ఈ పురస్కారానికి ఎంపికైనట్లు తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సత్తిరెడ్డి తెలిపారు.

కాళేశ్వరంపైనే అందరి దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

■ నేడు మరో బ్యాచ్ ఐఏఎస్‌ల బృందం పరిశీలన

■ ప్యాకేజీ-6, 8 సొరంగాల సందర్శన

■ రికార్డు సమయంలో పూర్తికి ప్రభుత్వం కసరత్తు

■ ఏకకాలంలో వివిధ పనులు

■ ఇప్పటికే 30శాతం నిధుల వినియోగం

తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే కాళేశ్వరం ప్రాజెక్టు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని శరవేగంగా పనులు జరిపిస్తున్నది. ఈ సంవత్సరం ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో ఇప్పటికే 30శాతానికి పైగా ఖర్చు చేయడం నిర్మాణ వేగానికి అద్దం పడుతున్నది. వచ్చే జూన్‌కల్లా గోదావరి జలాలను ఎత్తిపోయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలకనుగుణంగా పనులు జరుగుతుండటం అందరినీ ఆకర్షిస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్‌లు ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో బృందాలుగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే ఒక బ్యాచ్ ఐఏఎస్‌ల బృందం పర్యటన పూర్తి చేసుకోగా, శనివారం 19 మందితో కూడిన మరో బృందం పర్యటన జరుపుతున్నది.

36 లక్షల ఎకరాలకు నీళ్లు...

కాళేశ్వరం ప్రాజెక్టు దాదాపు 36 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించనుంది. అందుకే ప్రభుత్వం దీనికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నది. గోదావరి జలాల వాడకంలో తెలంగాణ వెనుకబడి ఉంది. దశాబ్దాల నుంచి ఏటేటా వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నా హక్కుగా ఉన్న దాంట్లో 30-40 శాతం నీటిని కూడా వాడుకోలేదు. సమైక్య రాష్ట్రంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించినా నిర్దేశించిన ఆయకట్టులో సగం కూడా సాధించలేదు. దీనికితోడు ఎగువ నుంచి ఆ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు ఉనికి ప్రశ్నార్థకమైన నేపథ్యంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా 225 టీఎంసీల గోదావరిజలాలను తరలించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.

అన్నీ ప్రత్యేకమే..

కాళేశ్వరానికి అనేక ప్రత్యేకతలున్నాయి. సాధారణంగా సాగునీటి ప్రాజెకుల నిర్మాణానికి దశాబ్దాల కాలం పట్టడం ఆనవాయితీ. దానికి భిన్నంగా రెండు సంవత్సరాల్లో గోదావరి నుంచి నీటిని లిఫ్టు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇక నిర్మాణపరంగా చూస్తే సుమారు 28 లక్షల క్యూసెక్కుల గరిష్ఠ వరద ప్రవాహం ఉన్న మేడిగడ్డ వద్ద నదికి అడ్డంగా బ్యారేజీ నిర్మాణం, భారీ సొరంగ మార్గాలు, దేశంలోనే అతి పెద్ద సర్జ్‌పూల్... ఇలా ప్రాజెక్టులోని పలు నిర్మాణాలతో కాళేశ్వరం ప్రత్యేకంగా నిలిచింది. దీనితో ఐఏఎస్ అధికారుల్లో కూడా ఈ పనులను చూడాలని ఆసక్తి పెరిగింది. తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే అతి పెద్ద ప్రాజెక్టు కావడంతో క్షేత్రస్థాయిలో పనులను చూడాలని వారు ఉవ్విళ్లూరారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఈనెల 3వ తేదీన 21 మంది సభ్యులున్న బృందం పనులను పరిశీలించింది. తాజాగా శనివారం ఇంకో బృందం ఎల్లంపల్లి జలాశయం నుంచి మేడారం రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు చేపడుతున్న పనులు (ప్యాకేజీ-6), మేడారం నుంచి శ్రీరాంసాగర్ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలించే పనుల్లో భాగంగా చేపట్టిన సొరంగం (ప్యాకేజీ-8)ను పరిశీలించనుంది.

ఒకే సమయంలో అన్ని పనులు...

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో సివిల్ పనులు పూర్తయిన తర్వాత పంపులు, మోటార్ల బిగింపునకు ఏర్పాట్లు చేసుకుంటారు. ఆ తర్వాత విద్యుత్ సరఫరా పనులపై దృష్టి పెడుతారు. కానీ తెలంగాణలో ఆ పద్ధతికి స్వస్తి చెప్పారు. ఏకకాలంలో పనులన్నీ ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. వచ్చే జూన్‌లో గోదావరి జలాలను ఎత్తిపోయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీనితో పంపులు, మోటార్ల బిగింపు, విద్యుత్ సరఫరా పనులనుకూడా ఒకేసారి చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కొన్నిరోజుల కిందట మోటార్ల తయారీ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ఆయన, ఆ వెంటనే ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతోనూ భేటీ అయ్యారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించి.. ఆయా పనులకు నిర్ణీత గడువును నిర్దేశించారు. డిసెంబరు నాటికి ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు జలాలను తరలించేందుకు నిర్ణయించిన నీటిపారుదల శాఖ, వచ్చే ఏడాది మార్చి నాటికి పంపు హౌజ్‌లను పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నది.

నిధుల్లో సగం కాళేశ్వరానికే..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన నిధుల్లో ఇప్పటికే 30 శాతం ఖర్చు చేశారు. 2017-18 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ. 6838.76 కోట్లు కేటాయించగా జులై 31నాటికే 2002.56 కోట్లు ఖర్చు చేశారు. నీటిపారుదలశాఖ ఈ సంవత్సరం రాష్ట్రంలోని వివిధ సాగునీటి పనులకు ఇంతవరకూ రూ.4466.25 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ. 2848.66 కోట్ల బిల్లులు పెండింగులో ఉండగా.. రూ.2295.06 కోట్ల బిల్లులు చెల్లింపునకు సిద్ధంగా ఉన్నాయి. అంటే ఇప్పటిదాకా నీటిపారుదల శాఖ ఖర్చు చేసిన దానిలో దాదాపు సగం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే వెచ్చించిందన్న మాట. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది తార్కాణం.

శనివారం
5•08•2017
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

జీఎస్టీపై తాడోపేడో!

అవసరమైతే కోర్టుకు వెళ్లే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం!

- కొత్త వ్యవస్థతో రాష్ట్రంపై 19వేల కోట్ల భారం
- మూడు ప్రధాన కార్యక్రమాలకు విఘాతం
- మినహాయింపు కోరుతున్న రాష్ట్రం
- పలు సందర్భాల్లో కేంద్రం దృష్టికి
- స్వయంగా మోదీకి లేఖ రాసిన సీఎం కేసీఆర్
- కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తిన మంత్రులు
- అయినా కేంద్రం నుంచి కనిపించని సానుకూలత

ఢిల్లీలో ఆర్థికమంత్రి జైట్లీతో కేటీఆర్ భేటీ

- జీఎస్టీతో 19వేల కోట్ల భారం పడుతుందని వెల్లడి
- ఐదు శాతం పన్నును కొనసాగించాలని విజ్ఞప్తి
- నేటి భేటీలో చర్చిద్దామంటూ దాటవేసిన జైట్లీ

లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీల వాయిదా తీర్మానం

- తదుపరి సమావేశాల్లో నిలదీయనున్న ఎంపీలు
- నేడు ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం
- మినహాయింపుపై పట్టుబట్టనున్న మంత్రి కేటీఆర్



శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమైన మంత్రి కే తారకరామారావు, ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్

న్యూఢిల్లీ, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం తదితర పథకాలను జీఎస్టీ నుంచి మినహాయించాలన్న డిమాండ్‌పై కేంద్రంతో తాడోపేడో తేల్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అవసరమైతే ఈ విషయంలో కోర్టుకు వెళ్లాలని యోచిస్తున్నట్టు సమాచారం. ప్రజలకోసం ప్రభుత్వంచేసే ఖర్చుపైన అడ్డగోలుగా పన్ను విధించడం సరికాదని తెలంగాణ ప్రభుత్వం పదే పదే కేంద్రాన్ని కోరుతూ వస్తున్నది. ఇప్పటికే మొదలైన ప్రాజెక్టులపై ఒకేసారిగా అదనపు భారం వేస్తే అటు కాంట్రాక్టర్లు, ఇటు ప్రభుత్వం పనులు ముందుకు నడిపించలేని పరిస్థితి వస్తుందని ఉన్నతాధికారవర్గాలు చెప్తున్నాయి. అందుకే జీఎస్టీ నుంచి ఈ ప్రాజెక్టులు, పథకాలను మినహాయించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. టీఆర్ఎస్ ఎంపీలు, రాష్ట్ర మంత్రులు కూడా అనేకసార్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కలిసి, జీఎస్టీని మినహాయించాలని విజ్ఞప్తిచేశారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, పరిశ్రమల మంత్రి కే తారకరామారావు వివిధ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న సందర్భంగా కూడా ఈ విషయాన్ని లేవనెత్తారు. అయినా కేంద్రం నుంచి కనీస సానుకూల సంకేతాలు రాలేదు. దీంతో శనివారం జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో మంత్రి కే తారకరామారావును సీఎం కేసీఆర్ హుటాహుటిన ఢిల్లీకి పంపారు. ఆయన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో సమావేశమై, జీఎస్టీతో రాష్ట్రంపై పడుతున్న భారంపై చర్చించారు. జీఎస్టీని తగ్గించేందుకు గతంలో ఇచ్చిన హామీని గుర్తుచేశారు. దాటవేత ధోరణిలోనే మాట్లాడిన జైట్లీ.. కౌన్సిల్ సమావేశంలో చర్చించి, సమిష్టిగా నిర్ణయం తీసుకుందామని చెప్పారే తప్ప.. స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో శనివారంనాటి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై గట్టిగా పట్టుబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాలపై జీఎస్టీని మినహాయించాలన్న డిమాండ్‌తో టీఆర్ఎస్

మిగతా 9వ పేజీలో



మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం గ్రామంలో శుక్రవారం గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు రాఖీ కడుతున్న సర్పంచ్ మంజులా రెడ్డి

గ్రామీణాభివృద్ధికి పిడికిలి బిగిద్దాం

- గ్రామాలు బాగుచేసుకుందాం.. కలిసికట్టుగా బంగారు తెలంగాణను నిర్మించుకుందాం
- కేశవరం, లక్ష్మాపూర్ గ్రామసభల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- తెలంగాణలో ఇక రైతే పంట ధర నిర్ణయిస్తాడు
- వచ్చే ఏడాదికి గోదావరి నీళ్లు.. బంగారు తెలంగాణను కండ్లారా చూస్తాను
- రైతు సంఘాల ఏర్పాటుకు సహకరించండి.. ప్రతి ఇంట్లో మొక్కలు నాటండి
- ఆరు మొక్కలు సంరక్షిస్తే రెండు పాడిపశువులు.. లక్ష్మాపూర్ గ్రామస్థులకు సీఎం హామీ

(శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్, కేశవరం నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి)

గ్రామాల అభివృద్ధికి ప్రజలు కలిసికట్టుగా పిడికిలి బిగించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. తలరాతను మార్చుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని అన్నారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత నీళ్లు, నిధులు, కరెంటుకు ఇబ్బందేమీ లేదని, అయితే వాటి ఫలితంగా ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు సమిష్టిగా కృషిచేయాలని అన్నారు. పార్టీలు, రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలని, గ్రామాభివృద్ధిలో అంతా ఒకే తాటిమీదికి రావాలని అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ

> రానున్న రెండున్నరేండ్ల కాలంలో అందరూ సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో తులతూగే బంగారు తెలంగాణ తప్పకుండా సాధ్యపడుతుంది. ప్రజలు సంతోషంగా ఉండటాన్ని నేను కండ్లారా చూస్తాను.

ప్రజల బాగుకోసం ప్రభుత్వం పాటుపడుతున్నదని, ప్రజలు ముందుకు వచ్చి పథకాలను సద్వినియోగపరుచుకొని బంగారు తెలంగాణ కోసం సహకరించాలని అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజలు తమ తమ

మిగతా 4వ పేజీలో

200 కోట్లతో వ్యవసాయ ప్రాసెసింగ్ యూనిట్

సంగారెడ్డి పరిసరాల్లో ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది. గుజరాత్‌కు చెందిన రిద్ధిసిద్ధి కంపెనీ మక్కజొన్న ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కంపెనీ ప్రతినిధులు.. సంగారెడ్డి పరిసరాల్లో రూ.200 కోట్లతో, రోజుకు 800 టన్నుల సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో మంత్రి పోచారం మాట్లాడుతూ రాష్ట్రంలో కంపెనీల ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని చెప్పారు. 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు ప్రయోజనం కలిగించే ఏ ప్రాజెక్టు అయినా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో మక్కజొన్న సాగు ఏటా పెరుగుతున్నదని, రైతులు నాణ్యమైన దిగుబడులను సాధిస్తున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, రిద్ధిసిద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ చౌదరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మరో ఎలక్ట్రానిక్ క్లస్టర్

మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం.. 437 కోట్లతో మహేశ్వరంలో ఏర్పాటు

- గ్రాంట్‌గా కేంద్రం నుంచి 138.60 కోట్లు
- ప్రత్యక్షంగా 14 వేల మందికి ఉపాధి
- పరోక్షంగా మరో 84వేల మందికి..
- కేంద్రానికి మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రానికి మరో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ మంజూరైంది. ఇటీవలే రావిర్యాల ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు మంజూరు ఇచ్చిన కేంద్రం.. శుక్రవారం మరో క్లస్టర్‌కు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నగర శివారు మహేశ్వరంలో ఏర్పాటుచేసే ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ)కు అవసరమైన నిధులను ఇవ్వడానికి కేంద్ర ఉన్నతాధికారులతో ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీ అనుమతించింది. ఈ విషయాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అదనపు కార్యదర్శి అజయ్‌కుమార్ ట్విట్టర్‌లో వెల్లడించారు. క్లస్టర్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.437 కోట్లు కాగా ఇందులో కేంద్రం గ్రాంటుగా రూ.138.60 కోట్లు ఇవ్వనుంది. మిగిలిన రూ.298.40 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ప్రాజెక్టును 310 ఎకరాల్లో చేపడుతారు. దీనిద్వారా ప్రత్యక్షంగా 14వేల మందికి, పరోక్షంగా 84వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఇప్పటికే సిద్ధంచేసి ఉంచారు. రాబోయే మూడేండ్లలో ఈ నిధులు

మిగతా 9వ పేజీలో

మళ్లీ మగ్గాల సందడి

తెలంగాణ రాష్ట్రంలో దశ తిరిగిన కమలాపురం చేనేత సహకార సంఘం



వరంగల్ అర్బన్ జిల్లా కమలాపురం చేనేత పారిశ్రామిక సహకార సంఘం కింద నేత పనుల్లో బిజీగా ఉన్న కార్మికులు. (ఇన్‌సెట్) సహకార సంఘం భవనం

9

టెట్ ఫలితాలు విడుదల

- అర్హత సాధించిన 1,01,763 మంది అభ్యర్థులు
- పేపర్-1లో 57.37%.. పేపర్-2లో 19.51% ఉత్తీర్ణత
- టాప్‌లో రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు

9

ఏఈఈ, అసిస్టెంట్ సర్జన్ల పరీక్షలు 27, 28కి వాయిదా

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఎగ్జామ్స్ దృష్ట్యా టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

9

మరణ ధ్రువీకరణకు ఆధార్ తప్పనిసరి

- అక్టోబర్ 1 నుంచి అమలుకు కేంద్రం నిర్ణయం
- రైల్వే టికెట్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరికాదు

5

నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- సాయంత్రానికే ఫలితాల వెల్లడి
- ఎన్డీయే అభ్యర్థి వెంకయ్యకే పూర్తి విజయావకాశాలు




శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి... సభకు పెద్ద ఎత్తున హాజరైన గ్రామస్థులు

గ్రామీణాభివృద్ధికి పిడికిలి బిగిద్దాం





శుక్రవారం మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి గ్రామంలో తెలంగాణ ఉద్యమ యోధుడు వీరారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీఎం కేసీఆర్



మేడ్చల్ జిల్లా కేశవరం గ్రామసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కృష్ణారావు, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు

మూడోపేజీ తరువాయి...

సమస్యలను ప్రస్తావిస్తూ నిధుల మంజూరు కోరగా.. వారు అడిగిన వాటితో పాటు అదనంగా మరిన్ని సంక్షేమ అవసరాలకు సైతం సీఎం అక్కడికక్కడే నిధులు మంజూరు చేశారు. లక్ష్మాపూర్ ప్రజలతో మాట్లాడుతూ ఇంటిలో కనీసం ఆరు మొక్కలను నాటి జనవరిలో అధికారులు పర్యటించే వరకూ పరిరక్షించిన కుటుంబాలకు ఇంటికి రెండు పాడి పశువులను ఇస్తానని వాగ్దానం చేశారు.

పంటధరను రైతే నిర్ణయిస్తాడు..

పండించిన పంటకు రైతే ధరను నిర్ణయించే వ్యవస్థకు రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు తెలిపారు. ప్రపంచమంతా రైతు దీనస్థితిలోనే మగ్గుతున్నాడని, అభివృద్ధి చెందినవని చెప్పుకొనే పారిస్, లండన్‌లో కూడా రైతుల ఆలుగడ్డలకు ధరలేక రోడ్లపై పారబోసే పరిస్థితి ఉందని ఆయన చెప్పారు. దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తరఫున పటిష్టమైన రైతుసంఘాలను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నామని, ఆ ప్రక్రియ పూర్తయితే రైతులు నిర్ణయించిన ధరనే వ్యాపారులు చెల్లించే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. రైతుకు రైతే శత్రువు కాకుండా ఉండేందుకు రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పంటల సాగును చేపట్టేందుకు క్రాప్‌కాలనీలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లాకు కూడా గోదావరి జలాలు తరలివస్తున్నాయని అన్నారు. వచ్చే సంవత్సరంనుంచి రైతులకు ఎకరానికి రూ.8వేలు పెట్టుబడి ఇస్తున్నామని, త్వరలో గ్రామానికి వచ్చే అధికారులకు రైతులు వాస్తవ వివరాలు ఇచ్చి సహకరించాలని కోరారు.

సీఎం కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

బంగారు తెలంగాణను చూస్తాను

రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ ప్రజల బాగుకోసం పాటుపడుతున్నాం. పేద, మధ్యతరగతి స్త్రీలు గర్భిణులుగా ఉన్న సమయంలో పనిచేయకుండా రూ.12వేల ఆర్థిక సాయం, తల్లీబిడ్డ ఆరోగ్యానికి 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ అందిస్తున్నాం. రూ.1000 పింఛన్ ఇస్తుండటంతో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే కొడుకులు, కోడళ్లు తిరిగి ఇంటికి తెచ్చుకుంటున్నరు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, హాస్టళ్లలో సన్నబియ్యం, తెల్లకార్డు అర్హులకు ఒక్కొక్కరికి 6 కేజీల బియ్యంతో ప్రజలకు మేలు జరుగుతున్నది. ఇట్ల ఇంకెన్నో చేసుకోబోతున్నాం. రానున్న రెండున్నరేండ్ల కాలంలో అందరూ సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో తులతూగే బంగారు తెలంగాణ తప్పకుండా సాధ్యపడుతుంది. ప్రజలు సంతోషంగా ఉండటాన్ని రాబోయే కాలంలో నేను కండ్లారా చూస్తాను.

సమైక్య సమస్యలను పారదోలినం..

'సమైక్య రాష్ట్రంలో ఏర్పడిన సమస్యలను తొలిగించుకుంటూ ముందుకు పోతున్నాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇస్తున్నాం. హరితహారంతో పచ్చదనాన్ని పెంపొందిస్తున్నాం. విద్యావ్యవస్థలో గురుకులాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. తెలంగాణలో ఉన్న కరెంట్ దరిద్రాన్ని పారదోలాం. ఇప్పటికే మూడు జిల్లాల్లో విజయవంతంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. త్వరలో అన్ని జిల్లాలకు వస్తుంది. రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలిగించాల్సిన అవసరం ఉంది.

లెక్కలు బరాబర్ కావాలి


'వచ్చే మే నాటికి ఎకరానికి రూ.8వేలు ఇచ్చి తీరుతాం. డబ్బులు ఇవ్వడానికి కొదువ లేదు. రైతుల ఖాతాల వివరాలు సమగ్రంగా లేకపోవడమే ఇబ్బంది. కేశవరం గ్రామం తీసుకుంటే వ్యవసాయ అధికారుల సర్వేలో 318 ఖాతాలు ఉంటే, రెవెన్యూ అధికారులు చేసిన సర్వేలో 976 ఖాతాలు ఉన్నాయని లెక్క తేలింది. ఇప్పుడు పైసలు 318 ఖాతాలకు వేయాల్నా? 976 ఖాతాలకు వేయాల్నా? ఇట్ల తప్పుడు లెక్కలతో రైతులకే నష్టం. రైతులు ఇమాన్‌దార్లు. అన్నదాత తప్పుడు లెక్క చెప్పడు. కొన్ని కారణాల వల్ల తప్పుడు లెక్కలు వస్తున్నయి. అధికారులు మళ్లీ సర్వే చేసి, రెవెన్యూ రికార్డు సరి చేస్తరు. నిజమైన రైతులను గుర్తించి ఎరువుల కొనుగోలు కోసం డబ్బులు ఇచ్చేందుకు గ్రామ రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందులో సభ్యులుగా సాగు చేస్తున్న రైతులే ఉంటారు. రైతులు అధికారులతో కలిసి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలి.

రైతు సంఘాలే భవిష్యత్ నిర్దేశకులు

సాధారణంగా ఒక రైతు పండించిన పంటకు ధర వస్తే మిగతా రైతులు అదే వేస్తున్నారు. తద్వారా అందరూ నష్టపోతున్నరు. రైతుకు రైతే శత్రువు అయితున్నడు. ఇది మనదగ్గరే కాదు. ప్రపంచం అంతటా ఉంది. బీబీసీ లండన్ వాళ్లు చూపించిన ఒక డాక్యుమెంటరీలో పారిస్, లండన్‌లో రైతుల ఆలుగడ్డలకు ధరలేక రోడ్లపై పారబోస్తున్న పరిస్థితిని చూపించారు. భారతదేశంలో కూడా ఇలాంటి పరిస్థితి ఉంది. ఎందుకంటే మన దగ్గర సమగ్రమైన విధానం లేదు. మన రాష్ట్రంలో కూడా మన ప్రజలకు ఏం కావాలి? మన రైతులు ఏం పండిస్తరు? అనే స్పష్టత లేదు. గత పాలకులు పాలన గురించి ఎన్నో మాటలు చెప్పింద్రు కానీ సమగ్ర సమాచారం ఎందులోనూ లేదు. ఈ ప్రపంచంలో అందరూ తమ ఉత్పత్తికి ధర నిర్ణయించుకుంటున్నారు. కానీ ఒక్క రైతుకే ఆ అవకాశం లేదు. ధర దక్కుతలేదు. దళారులు మోసం చేస్తున్నరు. మన ధరను మనం నిర్ణయించుకోవాలంటే రైతు సంఘాలు ఏర్పడాలి. క్రాప్ కాలనీలు కావాలి. ప్రపంచంలోనే మొట్టమొదట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంఘాలకు శ్రీకారం చుట్టింది. గ్రామం-మండలం-జిల్లా- రాష్ట్ర స్థాయి సంఘాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర సమాఖ్యకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు ఇస్తం. బ్యాంకులకు గ్యారెంటీ ఇస్తం. మండల సమాఖ్య పంట ధర చెప్తుంది. వ్యాపారులు ఇస్తే రైతు అమ్ముతడు. లేకుంటే రాష్ట్ర రైతు సమాఖ్యనే కొంటుంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాల్లో అమ్మేందుకు అవకాశం ఇస్తాం. రైతులు ఏకం అయితరు కాబట్టి కొద్దోగొప్పో ధరకు కొనడం కాదు.. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు కొంటామని దళారులు ముందుకు వస్తరు. రైతులకు మేలు జరుగుతుంది. ఒకవేళ ధర లేకపోతే రాష్ట్ర సంఘాలు కొంటాయి. ఉత్పత్తికి అపుడు ధర లేకపోతే గోదాంలలో ఉంచి ధర వచ్చినప్పుడు అమ్ముతారు.

ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు నాటాలి

ఒకప్పుడు హైదరాబాద్‌లో ఫ్యాన్లు లేకుండే. ఇప్పుడు 48 డిగ్రీల ఉష్ణోగ్రత అయింది. వర్షాలు పడుతలేవు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీఎం నిధులు ఇస్తరు. కానీ అన్నీ వాళ్లే చేయరు. మన ఇల్లు మనమే ఊడ్చుకోవాలి. పక్కింటి వాళ్లు చేయరు. అలాగే మన గ్రామాన్ని మనమే బాగు చేసుకోవాలి. చెట్లు ఉన్న గ్రామం మీదుగా వెళ్లే మేఘం తప్పకుండా వర్షిస్తుంది. ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం నిదర్శనం. రాష్ట్రమంతా వర్షాలు లేకున్నా ప్రతిరోజు అక్కడ వర్షాలు పడుతున్నాయి. గుజరాత్‌లోని సూరత్‌లో రూ.500 కోట్ల నుంచి రూ.1000 కోట్ల ఆస్తులు ఉన్న వజ్రాల వ్యాపారులు ఉన్నారు. ఒకసారి అక్కడ ప్లేగు వ్యాధి ప్రబలి 2వేల మంది చనిపోయారు. ఆస్తులన్నింటినీ వదిలి ప్రత్యేక విమానాల్లో వ్యాపారులంతా పారిపోయారు. అంటే ఎంత ఆస్తి ఉంటే ఏమి అక్కరకు వచ్చింది? మన తాత, ముత్తాతలు చేసినట్టు మొక్కలు పెంచి, భవిష్యత్ తరాలకు బతుకునివ్వాలి. మన బిడ్డలకు ఎంత సంపాదించి పెట్టినా ఇక్కడే అనుభవించే పరిస్థితి లేకపోతే వృథానే కదా! వర్షం కోసం మొగులు మొకం చూడవద్దంటే.. మొక్కలు పెంచడం ఒక్కటే మార్గం.



లక్ష్మాపూర్ గ్రామసభలో సీఎం ప్రసంగానికి ఈలవేస్తున్న స్థానికుడు

కుటుంబ సభ్యుల పేర్లతో మొక్కలు

ఇంటికి ఆరు మొక్కలు నాటాలి. పెద్దగా పెరిగే మొక్కలు వేప లాంటివి రెండు, మూడు, మిగతావి మీరు కోరుకున్నవి అధికారులు ఇస్తారు. కుటుంబ యజమాని, యజమానురాలు, కొడుకు, కూతురు, ఒకవేళ ఇంట్లో ఎవరైనా చనిపోయి ఉంటే వారి పేరు మీద మొక్కలు నాటి సంరక్షించాలి. ప్రతిరోజూ నీటిని మొక్కలకు అందించాలి. రానున్న రెండేండ్ల కాలంలో ఈ గ్రామంలో ఇండ్లు కాకుండా అన్నీ చెట్లే కనిపించాలి. లక్ష్మాపూర్‌లో ఆరు మొక్కలను నాటి వాటిని పరిరక్షించిన వారి గురించి జనవరిలో అధికారులు వచ్చి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తరు. అలా మొక్కలను కాపాడిన వాళ్లకు ఇంటికి రెండు పాడి పశువులు కొనిస్తాను. బర్రె అంటే బర్రె... ఆవు అంటే ఆవు ఇప్పిస్తాను లక్ష్మాపూర్‌లో లక్ష్మీదేవి తాండవించాలి.

మీరే రావాలంటే వచ్చా..

'గురువారం కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఆగి ప్రజల మంచి చెడుల గురించి అడిగి వెళ్తుంటే ఒకాయన వచ్చి 'సారూ ప్రతి సంవత్సరం శామీర్‌పేట చెరువు నింపాలి' అని అడిగాడు. 'రేపే మీ ఎమ్మెల్యే, ఎంపీని పంపిస్తా' అంటే 'సారూ మీరే రావాలి.. మీ అంత ప్రేమగా ఎవరూ మాట్లాడరు' అన్నరు. అందుకే షెడ్యూల్‌లో లేకపోయినా తెల్లవారంగనే వచ్చిన. ఒక్క శామీర్‌పేట చెరువే కాదు మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ మండలాల్లో ఉన్న 374 చెరువులు, కుంటలను నింపి, సాగునీటిని అందిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 60-70 వేల ఎకరాల సాగుకు నీరు వస్తది. 620 మీటర్ల ఎత్తులో ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలోని పాములపర్తి నుంచి 530 నుంచి 550 మీటర్ల ఎత్తులో ఉన్న నియోజకవర్గానికి నీళ్లు ఇబ్బంది లేకుండా వస్తాయి.

ప్రజలు పెట్టిన కిరీటాలవి..

ప్రజల వద్దకు వెళ్లి మాట్లాడితే మీలాగా ఏ ప్రజాప్రతినిధి ప్రేమగా, అప్యాయంగా మాట్లాడటం లేదని చెప్తున్నరు. సీఎం, పీఎం, ఎంపీ, ఎమ్మెల్యే ఏదైనా అన్నీ ప్రజలు పెట్టిన కిరీటాలని గుర్తించాలి. ప్రజలతో అప్యాయంగా మాట్లాడి, వారు చెప్పింది విని, ఉన్న వనరులు, నిధులతో సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి. పనులు చేయలేని పరిస్థితి ఉంటే అర్థమయ్యే విధంగా చెప్పాలి.

మూడుచింతలపల్లి మీద ప్రేమ ఎక్కువ

నాకు మూడు చింతలపల్లి అంటే ప్రేమ ఎక్కువ. ఎందుకంటే అక్కడ తెలంగాణ ఉద్యమ యోధులు ఉన్నారు. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి వెంకట్రాంరెడ్డి, వీరారెడ్డిలను కన్న గొప్ప గడ్డ. వారు చూపిన బాటలో తెలంగాణను సాధించుకున్నాం.

సీఎం రాకతో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు

ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించడం పట్ల రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన అంశాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడమే కాకుండా పలు అంశాలను ప్రత్యేకంగా సీఎం ప్రస్తావించి మరీ నిధులు మంజూరు చేయడం సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు. తనంత తానుగా ఆగి తమతో ముచ్చటించడమే కాకుండా తెల్లవారే తమ గ్రామానికి రాష్ట్ర స్థాయి అధికారులను వెంటబెట్టుకొని వచ్చి మరీ సమస్యలు పరిష్కరించడం వారిని ఆనందంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా కేశవరం గ్రామ సర్పంచ్ సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు మంజులారెడ్డి, శ్యామల, ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు, సీఎం కార్యదర్శి స్మిత సబర్వాల్, హరితహారం రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రియాంకవర్గీస్, జేసీ ధర్మారెడ్డి, డీఈవో ఉషారాణి, డీఆర్వో సురేందర్‌రావు, ఇరిగేషన్ ఈఎన్‌సీ సురేందర్, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు బాలేశ్, టీఆర్‌ఎస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, కమలాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, సర్పంచ్‌లు శ్రీనివాస్, రవీందర్, మల్లేశ్, సుశీల, ఎంపీటీసీ సభ్యులు వీరప్ప, సక్రి, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.27 కోట్లు మంజూరు

ఈ పర్యటనలో కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ రూ.27 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కేశవరానికి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.12 కోట్లు, లక్ష్మాపూర్‌కు రూ.15 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. కేశవరంలో సీసీ రోడ్లకు రూ.1.40 కోట్లు, డ్రైనేజీకి రూ.1.65 కోట్లు, పంచాయతీ రోడ్లు నిర్మాణానికి రూ.1.80 లక్షలు, శ్మశాన వాటికకు రూ.38 లక్షలు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు రూ.50 లక్షలు, గ్రంథాలయం, ఎల్‌ఈడీ దీపాలు, స్మృతి వనం, ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, ప్రహరీగోడ, అంగన్‌వాడీ భవనం, డంపింగ్‌యార్డు, చెత్త సరఫరా వాహనాలు తదితర వాటి కోసం రూ.12 కోట్లు మంజూరు చేశారు. లక్ష్మాపూర్‌లో మల్టీపర్పస్ హాల్‌కు రూ.50 లక్షలు, మహిళా భవనానికి రూ.10లక్షలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, లక్ష్మాపూర్-మూడుచింతపల్లి, లక్ష్మాపూర్-కొట్యాల్ రోడ్ల నిర్మాణం, విద్యుత్ దీపాలు తదితర అభివృద్ధి పనులు కోసం రూ.15 కోట్లను ప్రకటించారు. వీటితో పాటు రెండు గ్రామాలకు 100 చొప్పున డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేశారు. రెండు రోజుల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు విడుదలవుతాయని, వెంటనే పనులు ప్రారంభించాలని సీఎం అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

లోకం పోకడ



ముహూర్తం



సూర్యోదయం: 6.00 గంటలకు




సూర్యాస్తమయం: 6.44 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం, త్రయోదశి రాత్రి 8.54 వరకు. తదుపరి చతుర్దశి నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 11.36 వరకు. అమృత ఘడియలు: సాయంత్రం 6.18 నుంచి 7.54 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.47 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.00 నుంచి 7.42 వరకు, వర్జ్యం: తె. 5.54 నుంచి 7.30 వరకు.

రాష్ట్రంలో రైతు రుణమాఫీ బాగుంది

- పంజాబ్ బృందం ప్రశంస
- వ్యవసాయశాఖ కార్యదర్శితో భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ పథకం అమలు తీరు బాగుందని పంజాబ్ రాష్ట్ర ప్రతినిధుల బృందం ప్రశంసించింది. మంత్రుల సబ్ కమిటీ పర్యవేక్షణలో పథకం విజయవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడింది. అవకతవకలకు అవకాశం లేకుండా ముందుకుసాగడం అభినందనీయమని పేర్కొంది. రాష్ట్రంలో రైతు రుణమాఫీ అమలుతీరును తెలుసుకునేందుకు పంజాబ్‌కు చెందిన వ్యవసాయ సహకార విభాగం అదనపు ముఖ్యకార్యదర్శి డీపీ రెడ్డి, వ్యవసాయశాఖ కమిషనర్ బల్విందర్‌సింగ్ సింధూజీ, సహకార బ్యాంకుల ఎండీ ఎస్ కే బతీశ్ తదితరులు హైదరాబాద్‌కు వచ్చారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సీ పార్థసారథితో సచివాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర అనుభవాలు పంజాబ్ రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతాయని, ఇక్కడి ప్రభుత్వం పథకాన్ని శాస్త్రీయంగా అమలుచేస్తున్నదని బృందం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి రైతు రుణమాఫీ అమలు గురించి వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి వివరించారు. 2014-15లో రూ. 4039.98 కోట్ల రుణమాఫీతో 36లక్షల మంది రైతులు, 2015-16లో రూ. 4039.98 కోట్ల రుణమాఫీతో 35.3 లక్షల మంది రైతులు, 2016-17లో రూ. 4025.20 కోట్ల రుణమాఫీతో 35.3 లక్షల మంది రైతులు, 2017-18కి గాను రూ. 3999.905 కోట్ల రుణమాఫీతో 35.3 లక్షల మంది రైతులు లబ్ధిపొందారని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సహకార బ్యాంకు ప్రతినిధులు, బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు, నాబార్డు ప్రతినిధులు, వ్యవసాయశాఖ ఏడీ-1 జీ నారీమణి, ఏడీ-2 కే విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం సచివాలయంలో రైతు రుణమాఫీపై వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథితో చర్చిస్తున్న పంజాబ్ బృందం

బాలనేరస్థుల కోర్టులకు మూడు పోస్టులు మంజూరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైకోర్టు పరిధిలో బాలనేరస్థుల న్యాయస్థానాలకు (జువైనల్ కోర్టులు) రాష్ట్రప్రభుత్వం మూడు కొత్త పోస్టులను మంజూరు చేసింది. డిప్యూటీ రిజిస్ట్రార్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్, టైపిస్ట్ (కంప్యూటర్ ఆపరేటర్) నియామకానికి ఆర్థికశాఖ అనుమతినిచ్చింది. ఈ మేరకు ఆర్థికశాఖ కార్యదర్శి శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.


ఎంసెట్ స్పాట్ ప్రవేశాలకు 9 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో తుది విడుత ఎంసెట్ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న స్పాట్ ప్రవేశాల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 9 వరకు స్పాట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెల 16 వరకు సీట్ల భర్తీకి సంబంధించిన వివరాలను తమ కార్యాలయానికి పంపాలని ఎంసెట్ కౌన్సెలింగ్ క్యాంపు అధికారి బీ శ్రీనివాస్ తెలిపారు.

పోచంపాడు సభ సన్నాహాలపై సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పోచంపాడు సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఆర్థికమంత్రి, సభ ఇన్‌చార్జి ఈటల రాజేందర్ సన్నాహాలు మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయం కరీంనగర్‌లో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ఎమ్మెల్యేలు, నేతలతో సమావేశమయ్యారు. సాయంత్రం సచివాలయంలో మంత్రులు పోచారం, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డితో భేటీ అయ్యారు. విదేశీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం పోచంపాడుకు వెళ్లి సభ ఏర్పాట్లను పరిశీలించి, అనంతరం సీఎం కేసీఆర్‌కు వివరించనున్నారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న దిలీప్‌కుమార్



ముంబై, ఆగస్టు 4: బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్‌కుమార్(94) తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. డీహైడ్రేషన్, మూత్రనాళ సమస్యతో సతమతమవుతున్న ఆయనను బుధవారం ముంబైలోని లీలావతి దవాఖానలో చేర్చారు. వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించారు. దిలీప్‌కుమార్ కిడ్నీలు సరిగా పనిచేయడం లేదని, ప్రస్తుతం ఓ డాక్టర్ల బృందం చికిత్స అందిస్తున్నదని లీలావతి దవాఖాన ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ పాండే చెప్పారు. ప్రస్తుతం ఆయనను వైద్యుల పరిశీలనలో ఉంచామని, వెంటిలేటర్, డయాలసిస్ వంటి చికిత్సలను అందించడం లేదని పేర్కొన్నారు. అందరి ప్రార్థనలతో ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందని దిలీప్ భార్య సైరాబాను చెప్పారు.

రాహుల్ వాహనంపై రాళ్ల దాడి

- పగిలిన కారు అద్దాలు
- క్షేమంగా బయటపడ్డ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు
- ఉద్రిక్తంగా మారిన గుజరాత్ పర్యటన



రాళ్లదాడిలో పగిలిన కారు అద్దాలు



నిరసనల మధ్య లాల్‌చౌక్ చేరుకున్న రాహుల్‌గాంధీ

ధనేరా(గుజరాత్), ఆగస్టు 4: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ గుజరాత్ పర్యటన ఉద్రిక్తంగా మారింది. అల్లరిమూకలు ఆయన వాహనంపై రాళ్లురువ్వాయి. దీంతో ఆయన కారు వెనుక అద్దం పగిలిపోయింది. ఈ దాడి నుంచి రాహుల్ క్షేమంగా బయటపడ్డారు. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించడానికి శుక్రవారం రాహుల్ గుజరాత్‌కు చేరుకున్నారు. బనస్కాంత జిల్లా ధనేరా పట్టణంలోని లాల్‌చౌక్‌ను సందర్శించడానికి వెళ్లారు. అడుగడుగునా ఆయనకు అవాంతరాలు, చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కొందరు వ్యక్తులు నల్లజెండాలతో రాహుల్‌కు స్వాగతం పలికారు. అయినప్పటికీ ఆయన లాల్‌చౌక్ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా కొందరు మళ్లీ నల్లజెండాలను ప్రదర్శించారు. మోదీ అనుకూల నినాదాలు చేశారు. దీంతో అసహనానికి గురైన రాహుల్ తన ప్రసంగాన్ని ఆపివేసి అక్కడి నుంచి బయల్దేరారు. కాన్వాయ్ ముందుకు సాగుతుండగా కొందరు వ్యక్తులు రాహుల్ ఉన్న వాహనంపై రాళ్లతో దాడి చేశారు. దీంతో కారు వెనుక అద్దం పగిలిపోయింది. ఈ ఘటనలో రాహుల్‌కు గాయాలేమీ కాలేదు. ఆయన క్షేమంగా బయటపడ్డారు. అనంతరం, బనస్కాంత జిల్లా ఎస్పీ నీరజ్ బాద్‌గుజార్ మీడియాతో మాట్లాడుతూ.. రాళ్ల దాడికి సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రాజస్థాన్‌లోని వరద ప్రభావిత జిల్లా జాలోర్‌నూ రాహుల్ సందర్శించారు.

దాడి బీజేపీ పనే : కాంగ్రెస్

రాహుల్‌పై రాళ్లదాడిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ ఈ దాడి వెనుక బీజేపీ హస్తమున్నదని, ఆ పార్టీ గూండాలే ఈ దాడికి పాల్పడ్డారని చెప్పారు. రాహుల్ వెంట ఉన్న భద్రతా సిబ్బందిలో కొందరికి గాయాలయ్యాయని తెలిపారు. మరో అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా మాట్లాడుతూ హింసకు పాల్పడటం, దాడులు చేయడం బీజేపీ సంప్రదాయమని విమర్శించారు. ఇలాంటి దాడులను కాంగ్రెస్ లెక్కచేయదని, ఎన్ని దాడులు జరిగినా ప్రజల తరపున పోరాడుతూనే ఉంటామని అన్నారు.

ప్రచారం కోసం రాహుల్ పాకులాట: బీజేపీ

ప్రచారం కోసం రాహుల్ పాకులాడుతున్నారని బీజేపీ ఆరోపించింది. గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కర్ణాటకలో జల్సా చేస్తుంటే రాహుల్‌గాంధీ పరామర్శల పేరుతో నాటకాలాడుతున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్‌పాత్రా విమర్శించారు. ప్రజల భావోద్వేగాలను కాంగ్రెస్ గౌరవించాలని, వారిని గూండాలుగా పిలువడం మానుకోవాలని సూచించారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయి విమర్శలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.


నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

- ఎన్డీయే మద్దతుతో వెంకయ్యనాయుడు
- ప్రతిపక్షాల తరపున గోపాల్‌కృష్ణగాంధీ పోటీ
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- సాయంత్రానికే ఫలితాల వెల్లడి
- వెంకయ్యకే పూర్తి విజయావకాశాలు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

ప్రస్తుత ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10వ తేదీతో ముగుస్తున్నందువల్ల కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోడానికి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఓటర్లుగా ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్‌లోని 62వ రూమ్‌లో పోలింగ్ జరుగనున్నది. సాయంత్రం ఏడు గంటలకల్లా ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అధికార ఎన్డీయే మద్దతుతో బీజేపీ సీనియర్ నేత వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాల మద్దతుతో మహాత్మాగాంధీ మనుమడు గోపాల్‌గాంధీ ఈ పదవికోసం పోటీపడుతున్నారు. పార్లమెంట్ ఉభయసభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. ఎలక్టోరల్ కాలేజీలోని సభ్యుల సంఖ్య నామినేటెడ్ సభ్యులతో కలిపి 790. అయితే వీటిలో రెండు లోక్‌సభ సీట్లు, ఒక రాజ్యసభ స్థానం ఖాళీగా ఉన్నాయి. ఉన్న సభ్యుల్లో బీజేపీ లోకసభ సభ్యుడు చెడీ పాశ్వాన్ కోర్టు తీర్పు దరిమిలా ఈ ఎన్నికలో ఓటు వేసే అర్హత కోల్పోయారు.

పార్లమెంట్ ఉభయసభల్లో కలిపి ఎన్డీయేకు తగినంత బలం ఉన్నది. 545 సీట్లున్న లోక్‌సభలో 281 మంది బీజేపీ సభ్యులతో కలిపి ఎన్డీయేకు 338 మంది సభ్యులున్నారు. రాజ్యసభలో 243 మంది సభ్యుల్లో ప్రస్తుతం బీజేపీకి 58 మంది ఎంపీలు ఉండగా ఎన్డీఏ కూటమి పార్టీల సభ్యులతో కలిపితే దాదాపు 100 వరకు ఉంటుంది. కాంగ్రెస్‌కు 57 మంది ఉండగా కూటమి పార్టీలతో పాటు ఎన్సీపీ, జేడీయూ, బిజూ జనతాదళ్ తదితర పార్టీల మద్దతు కూడా ఉంది. కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలకు ఉభయసభల్లో ఉన్న సభ్యులను కలిపినా మెజారిటీ లేదు కాబట్టి ఈ పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న గోపాల్‌కృష్ణగాంధీ ఏదైనా అద్భుతం జరిగితే తప్ప గెలిచే అవకాశాలు లేవు. ఉభయసభల్లోని బలాబలాలను కలుపుకుంటే మొత్తం 788 మంది ఎంపీల్లో మెజారిటీ సభ్యుల బలం ఎన్డీఏ అభ్యర్థికే ఉన్నందువల్ల వెంకయ్యనాయుడి గెలుపు దాదాపుగా ఖరారైనట్లే. పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థి గెలుపొందినట్లవుతుంది. అంటే, 395 ఓట్లు లభించిన అభ్యర్థి గెలుపొందుతారు. కానీ బీజేపీకి ఒక్క లోక్‌సభలోనే 338, రాజ్యసభలో 100 ఓట్లు పడే అవకాశం ఉంటుందని గణాంకాల ద్వారా తెలుస్తున్నందువల్ల దాదాపుగా వెంకయ్యనాయుడి గెలుపు కేవలం లాంఛనమే. ఏ కూటమిలోని లేకపోయినప్పటికీ టీఆర్ఎస్, వైసీపీ తదితర పార్టీలు ఎన్డీయే అభ్యర్థి వెంకయ్యనాయుడికి మద్దతు తెలిపాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయేకు మద్దతుగా నిలిచిన బీజేడీ, జేడీ(యూ) ప్రస్తుతం ప్రతిపక్ష కూటమి అభ్యర్థి గోపాల్‌గాంధీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నాయి.



రానున్న రోజుల్లో అద్భుతాలు: మోదీ

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడు అభ్యర్థిత్వానికి మద్దతు పలుకుతున్న పార్టీల ఎంపీలతో శుక్రవారం ఢిల్లీలో ఒక సమావేశం ఏర్పాటయ్యింది. ఎంపీలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఒకే భావజాలానికి (బీజేపీకి) చెందిన వ్యక్తులు.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ వంటి దేశ అత్యున్నత పదవుల్లో ఉండే పరిస్థితి సాకారమవుతున్నదని ప్రధాని చెప్పారు. దీనివల్ల రానున్న ఐదేండ్లలో అద్భుతమైన మార్పులు జరుగుతాయని, 1942-47 మధ్య ఎటువంటి మార్పులు దేశంలో సంభవించాయో.. 2017-22 మధ్య కూడా అటువంటి మార్పులు కనిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, వెంకయ్యనాయుడు ఉపన్యాసాల సంకలనం రెండు సంపుటాలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైట్లీ, అమిత్‌షా తదితరులు పాల్గొన్నారు. జైట్లీ మాట్లాడుతూ పార్టీపై, ప్రభుత్వంపై వచ్చిన విమర్శలను వెంకయ్యనాయుడు దీటుగా తిప్పికొట్టేవారని గుర్తుచేశారు.

అభ్యర్థుల విశేషాలు



వెంకయ్యనాయుడు: రాజకీయాల్లో సీనియర్ నేత. బీజేపీ తరపున రెండుసార్లు కేంద్రమంత్రిగా పనిచేశారు. 2002 నుంచి 2004 వరకు బీజేపీ జాతీయాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి ముందు వరకు నరేంద్రమోదీ ప్రభుత్వంలో గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్నారు.



గోపాలకృష్ణ గాంధీ : ఏ రాజకీయ పార్టీకి చెందినవారు కాదు. మహాత్మాగాంధీ మనుమడైన ఆయన మాజీ ఐఏఎస్ అధికారిగా పరిపాలన దౌత్యపరమైన పోస్టుల్లో పనిచేశారు. లోగడ రాష్ట్రపతి కార్యదర్శిగా, దక్షిణాఫ్రికా, శ్రీలంకలలో భారత హైకమిషనర్‌గా, పశ్చిమబెంగాల్‌లో గవర్నర్‌గా కూడా సేవలందించారు.

మరణ ధ్రువీకరణకు ఆధార్ తప్పనిసరి

- అక్టోబర్ 1 నుంచి అమలుకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: మరణించిన వ్యక్తి గుర్తింపును నిర్ధారించేందుకు అక్టోబర్ 1 నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం.. చనిపోయిన వ్యక్తి తాలూకు మరణ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలంటే సదరు వ్యక్తి ఆధార్ నంబర్‌ను లేదా ఆధార్ దరఖాస్తు నమోదు సంఖ్య (ఈఐడీ)ను అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. చనిపోయిన వ్యక్తికి ఆధార్ నంబర్ లేకపోతే.. ఆ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఒక పత్రాన్ని సమర్పించాలి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ) కార్యాలయం శుక్రవారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. చనిపోయిన వ్యక్తుల వివరాల నమోదుకు, గుర్తింపునకు సంబంధించిన మోసాలను అరికట్టేందుకు ఇది మేలైన పద్ధతని అధికారులు పేర్కొన్నారు. ఆధార్ ఉంటే.. గుర్తింపును నిర్ధారించేందుకు ఇతర ఏ పత్రాలూ అవసరం లేదని వివరించారు. జమ్ముకశ్మీర్, అసోం, మేఘాలయ మూడు రాష్ట్రాలకు తర్వాత నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.


రైల్వే టికెట్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరికాదు

రైల్వే టికెట్లు బుక్ చేసేందుకు ఆధార్ నంబర్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టంచేసింది. రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేన్ గోహైన్ ఈ విషయం తెలిపారు. సీనియర్ సిటిజన్‌ల టికెట్ బుకింగ్‌కు సంబంధించి మాత్రం ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆధార్ వివరాల్ని అడుగుతున్నామని మంత్రి వెల్లడించారు.

విజిట్ వీసాపై యూఏఈ రావద్దు

చెన్నై, ఆగస్టు 4: భారతీయులు ఉద్యోగం కోసం విజిట్ వీసా ద్వారా యూఏఈకి రావద్దని దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. పలువురు భారతీయులు తెలిసీ తెలియక ఉద్యోగాల కోసం విజిట్ వీసా ద్వారా యూఏఈకి వచ్చి మోసపోతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో ఉద్యోగం కోసం విజిట్ వీసా ద్వారా రాకపోవడమే మంచిదని పేర్కొంది. కొందరు ఏజెంట్లు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, మాయమాటలతో అమాయకులను మోసం చేస్తున్నారని చెప్పింది. పలువురు ఏజెంట్ల మాటలు నమ్మి విజిట్ వీసా ద్వారా యూఏఈకి వచ్చి పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించింది. ఇలాంటి బాధితులకు భారత రాయబార కార్యాలయం తరపున పలు ఏర్పాట్లు చేసి తిరిగి భారత్‌కు పంపుతున్నామని పేర్కొన్నది. ఉద్యోగం కోసం యూఏఈకి రావడానికి ముందు కచ్చితమైన ఆధారాలు, ధ్రువపత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించింది.

పాక్ విపక్ష నేత ఇమ్రాన్‌ఖాన్‌పై విచారణ



ఇస్లామాబాద్, ఆగస్టు 4: పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ పార్టీ చైర్మన్ ఇమ్రాన్‌ఖాన్‌పై పార్లమెంటరీ కమిటీ విచారణ జరుపనున్నది. ఆయన తనతోపాటు ఇతర మహిళా నేతలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని అదే పార్టీకి చెందిన మహిళా ఎంపీ ఆయేషా గులాలీ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌ఖాన్‌పై వచ్చిన అభియోగాలపై ప్రత్యేక కమిటీతో విచారణ జరుపాలని నిర్ణయించినట్లు పాక్ నూతన ప్రధాని షాహీద్ ఖాఖాన్ అబ్బాసీ చెప్పారు. కాగా ప్రధాని అబ్బాసీ తన క్యాబినెట్‌లో 46 మందికి చోటు కల్పించారు. 2013 తర్వాత తొలిసారి విదేశాంగశాఖకు పూర్తిస్థాయి మంత్రిగా ఖ్వాజా అసిఫ్ నియమితులయ్యారు. ఇస్లామాబాద్‌లోని అధ్యక్ష భవనంలో దేశాధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ 28 మందితో సమాఖ్య మంత్రులుగా, 18 మందితో సహాయ మంత్రులుగా ప్రమాణం చేయించారని డాన్ దిన పత్రిక పేర్కొన్నది.

బాలలను తల్లిదండ్రుల వద్దకు చేర్చుతున్న 'ఆధార్'

బెంగళూరు, ఆగస్టు 4: ఇటీవల హర్యానాలో ఓ వికలాంగ బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చడంలో తోడ్పడిన 'ఆధార్'.. తాజాగా మరో ముగ్గురు మానసిక వికలాంగులను అమ్మానాన్నల చెంతకు చేరవేయనుంది. బెంగళూరులోని ఆధార్ ప్రాంతీయ కార్యాలయం ఓ అనాథాశ్రమంలో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ముగ్గురు పిల్లల వేలిముద్రలను, కంటిలోని ఐరిస్ నమోదును ఆధార్ యంత్రం తిరస్కరించింది. ఈ ముగ్గురు పిల్లల్లో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా కొడ్చిర గ్రామవాసి బీ మాధవ్ రాజన్న, ఏపీకి చెందిన బీ కల్యాణ్, టీ ఆహితీశం ఉన్నారు. దీంతో సంబంధిత ఉద్యోగులు వారి వివరాలను ఆధార్ డాటాతో పోల్చిచూశారు. వారు అప్పటికే ఆధార్‌ను నమోదు చేసుకున్నట్లు తేలింది. దీంతో ఉద్యోగులు వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శనివారం(నేడు) ఆ ముగ్గురు పిల్లలు వారి తల్లిదండ్రుల చెంతకు చేరనున్నారు.



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన నివాస భవనంగా పేరున్న దుబాయ్‌లోని టార్చ్ టవర్‌లో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 86 అంతస్తుల ఈ భవనంలో 2015లోనూ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు.

మా సహనం తుది దశకు చేరుకున్నది

- డోక్లాంపై చైనా రక్షణశాఖ

బీజింగ్/ న్యూఢిల్లీ, ఆగస్టు 4: తమ సహనం తుదిదశకు చేరుకున్నదని చైనా రక్షణశాఖ పేర్కొన్నది. ద్వైపాక్షిక చర్చలతో డోక్లాం వివాదం పరిష్కరించుకుంటామని విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో చేసిన ప్రకటనపై గురువారం రాత్రి చైనా రక్షణశాఖ అధికార ప్రతినిధి రెన్‌గ్యొజియాంగ్ స్పందిస్తూ తమ సహనం నశించిందన్నారు. భారత్ సరైన దిశలో స్పందించి సమస్య పరిష్కరించుకుని ఉద్రిక్తతలను నివారించి శాంతి పునరుద్ధరణకు ముందుకు రావాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో భూభాగమేనని చైనా చేస్తున్న వాదన అర్థరహితమని ఆ దేశానికి చెందిన రాజకీయ విశ్లేషకుడు వాంగ్ తావో తావో వ్యాఖ్యానించారు. చైనాకు అరుణాచల్ ఒక 'కోడి పక్కటెముక' వంటిదని పేర్కొన్నారు. ఇటువంటి కోడి పక్కటెముకల కోసం భారత్‌తో యుద్ధం చేయడం చైనాకు కష్ట సాధ్యమని తెలిపారు.

లుక్ ఔట్ నోటీసు కొట్టేయండి

- మద్రాస్ హైకోర్టులో కార్తి చిదంబరం పిటిషన్

చెన్నై, ఆగస్టు 4: ఒక అవినీతి కేసులో పాస్‌పోర్టు చట్టం కింద తనకు వ్యతిరేకంగా సీబీఐ జారీ చేసిన 'లుక్‌ఔట్' నోటీసును కొట్టివేయాలని కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తి.. శుక్రవారం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనపై లుక్‌ఔట్ నోటీసు జారీచేశారని ఆయన ఆరోపించారు. ప్రధాన విపక్ష పార్టీ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తన తండ్రి గొంతు నొక్కివేసేందుకే గత నెల 18న సీబీఐ తనకు లుక్ ఔట్ నోటీసు జారీ చేసిందని ఆరోపించారు. కార్తి పిటిషన్‌ను జస్టిస్ డీ దురైస్వామి బెంచ్ విచారణకు స్వీకరించింది.

సిజేరియన్లపై లోక్‌సభ ఆందోళన

- దేశవ్యాప్తంగా 55.75శాతానికి చేరిన సీ-సెక్షన్ ఆపరేషన్లు
- కాంగ్రెస్‌పై బీజేపీ ఎంపీ అవినీతి ఆరోపణలు

పార్లమెంట్ కి బాత్

న్యూఢిల్లీ, ఆగస్టు 4: దేశంలో సిజేరియన్ ఆపరేషన్లు పెరుగుతుండడంపై లోక్‌సభ ఆందోళన వ్యక్తంచేసింది. సీ-సెక్షన్ ఆపరేషన్లు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నదని, ప్రైవేటు రంగంలో ఇవి మరీ ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా సిజేరియన్లపై చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా ప్రైవేటు దవాఖానల్లో.. 31,296 ప్రసవాలకుగాను 17,450 సిజేరియన్లు (55.75) జరిగాయని సీజీహెచ్ఎస్ జరిపిన సర్వే తేల్చిందని నడ్డా చెప్పారు. మరోవైపు సవరించిన 2017-ప్రసూతి ప్రయోజన చట్టం ద్వారా 26వారాల ప్రసూతి సెలవులు వర్తిస్తుందని, దీనివల్ల కార్పొరేట్ రంగంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని కార్పొరేట్ వ్యవహారాల మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇంకోవైపు ఓలావాదేవీలో కాంగ్రెస్‌కు నాలుగు కోట్ల రూపాయల హవాలా సొమ్ము అందిందని బీజేపీ సభ్యుడు కిరీట్ సోమయ్య ఆరోపించడం కలకలం రేపడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. అంతకు ముందు రూ.650 కోట్లతో విశాఖపట్నంలో పెట్రోలియం ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లుకు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది.

చొరబాటుదారులను ప్రోత్సహిస్తున్న పాక్

కశ్మీర్‌లో చొరబాటుదారులను పాకిస్థాన్ ప్రభుత్వం మరింతగా ప్రోత్సహిస్తున్నదని రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ లోక్‌సభలో వెల్లడించారు. 2016లో మొత్తం 228 కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరుగగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 285సార్లు ఒప్పందాన్ని ఉల్లంఘించారని పేర్కొన్నారు. జీఎస్టీ సునాయాసంగా అమల్లోకి వచ్చిందని, దాని ప్రభావాలను అధ్యయనం చేసేందుకు 209మంది అధికారులను నియమించామని ఆర్థికశాఖ సహాయ మంత్రి సంతోశ్‌కుమార్ గాంగ్వర్ లోక్‌సభకు తెలిపారు. ఎల్పీజీ సిలిండర్లపై ప్రతి నెలా రూ.4 పెంచాలన్న నిర్ణయాన్ని కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని శుక్రవారం కూడా విపక్షాలు డిమాండ్‌చేశాయి. 2014 నుంచి ఇప్పటివరకు 221 ప్రభుత్వ విభాగాల వెబ్‌సైట్లను దుండగులు హ్యాక్‌చేశారని కేంద్రం వెల్లడించింది. ముగ్గురు పాకిస్థానీలకు ఆధార్ మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి పీపీ చౌదరి సభకు తెలిపారు.

సెలక్ట్ కమిటీకి మోటారు వాహనాల బిల్లు

మోటారు వాహనాలు బిల్లు-2017ను సెలక్ట్‌కమిటీకి పంపాలని అఖిలపక్ష పార్టీలు రాజ్యసభలో నిర్ణయించాయి. కాగా, ఆగస్టు 3న ఓ సమాధానం ద్వారా సభను విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తప్పుదోవ పట్టించారంటూ కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీసు ఇచ్చింది. మరోవైపు టికెట్ రిజర్వేషన్ల రద్దుతో రైల్వేశాఖకు గడిచిన ఏడాది రూ.1400 కోట్లు సమకూరాయని కేంద్ర ఓ సమాధానంలో తెలిపింది.

కనుమరుగవుతున్న మాతృ భాషలు

- భారత్‌లో సగం భాషల మనుగడకు ముప్పు
- మరో 50 ఏండ్లలో 400 భాషలు అంతరించిపోయే ప్రమాదముందని సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 4: పరాయి భాషలపై మోజు.. కార్పొరేటీకరణ మాతృభాషల మనుగడకు ముప్పు తెచ్చిపెట్టాయని 'పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ)' నివేదిక స్పష్టం చేస్తున్నది. ప్రముఖ భాషావేత్త గణేశ్ ఎన్ దేవై నేతృత్వంలో ఈ సర్వే జరిగింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6,000 భాషలు ఉండగా, అందులో దాదాపు 4,000 భాషలు మనుగడ ముప్పును ఎదుర్కొంటున్నాయని సర్వే తేల్చి చెప్పింది. మరో 50 ఏండ్లలో దాదాపు 66 శాతం భాషలు కనుమరుగు అవుతాయని వెల్లడైంది. సర్వే ప్రకారం భారత్‌లో పరిస్థితి చాలా అధ్వానంగా ఉన్నది. దేశంలో మొత్తం 780 భాషలు ఉండగా అందులో 400 భాషలు అంటే సగానికిపైగా భాషలు కనుమరుగయ్యే దశకు చేరుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముప్పు ఎదుర్కొంటున్న భాషల్లో 10 శాతం మనవే కావడం గమనార్హం. ప్రజల్లో ఇంగ్లిష్‌పై పెరుగుతున్న మోజు స్థానిక భాషల మనుగడకు ముప్పు తెచ్చిపెడుతున్నదని నిపుణులు చెప్తున్నారు. అయితే హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, కన్నడ, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ వంటి భాషలకు ఇంగ్లిష్‌తో వచ్చిన ముప్పేమీ లేదని పేర్కొంటున్నారు. ఇవి ప్రపంచంలో అత్యధిక మంది మాట్లాడే టాప్ 30 భాషల్లో ఉన్నాయన్నారు. మరోవైపు సంతాలి, గోండి, మిజో, గరో, ఖాసి కోట్బారక్ వంటి భాషలు అభివృద్ధి చెందుతుండడం ఆశ్చర్యపరిచే అంశం.



పాఠశాల విద్యలో జవాబుదారీతనం ఉండాలంటే డిటెన్షన్ విధానం ఉండాలి. దానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఆలోచించాలి. ఒక తరగతి నుంచి పై తరగతికి వెళ్లాలంటే విద్యార్థికి ఆ తరగతికి సంబంధించిన కనీస విద్యా నైపుణ్యాలుండాలి. డిటెన్షన్ బిల్లుపై త్వరలోనే ప్రకటన చేస్తాం.

ప్రకాశ్ జవదేకర్, కేంద్ర మంత్రి

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల వెంట పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశాం. ఎలాంటి చొరబాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. కాల్పుల ఉల్లంఘనలు జరిగినప్పుడు మన సైన్యం తిరిగి సరైన సమాధానం ఇస్తున్నది. భద్రత విషయంలో భారత సైన్యం సర్వసన్నాహంగా ఉన్నది.



అరుణ్ జైట్లీ, కేంద్ర మంత్రి

చరిత్రలో నేడు



1305

స్కాటిష్ తిరుగుబాటు నేత విలియం వాలెస్‌ను నిర్బంధించి విచారణ చేపట్టి ఉరితీసిన బ్రిటిష్ ప్రభుత్వం.

1884

'స్వేచ్ఛా విగ్రహ' ఏర్పాటుకు పునాదిరాయి.





1970

అమెరికా బ్లాక్ పాంథర్స్ నేత హ్యూ న్యూటన్ జైలు నుంచి విడుదల.

కర్ణాటకలో మంత్రి డీకే శివకుమార్ ఇంట్లపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడి చేయడం దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేపుతున్నది. ఎన్నడూ లేనిది ఇప్పుడే, అతన్నే లక్ష్యంగా చేసుకొని చేస్తున్న దాడుల వెనుక రాజకీయ ప్రేరేపితమున్నదని ఆరోపణలున్నాయి. గుజరాత్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత శంకర్‌సింగ్ వాఘేలా రాజీనామా, ఐదుగురు బీజేపీలో చేరటం తర్వాత మిగిలిన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు వారిని కర్ణాటకకు తరలించారు. వారి బాగోగులన్నీ శివకుమార్ చూస్తున్నారు. ఏదేమైనా ఐటీ అధికారానికి తలొగ్గి పనిచేసే స్థితి క్షేమకరం కాదు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కేంద్రం వంటగ్యాస్ సిలిండర్లపై ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేయడానికి సమాయత్తమవుతున్నది. ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో వెల్లడించింది. దీంతో ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేయటంతో సిలిండర్ ధరలపై ఇస్తున్న సబ్సిడీని క్రమంగా ఎత్తివేస్తూ ప్రతినెలా కొంత ధరను పెంచేందుకు సిద్ధమవుతున్నది. దేశంలో 18 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. వీరంతా సబ్సిడీ సిలిండర్లపైనే ఆధారపడుతున్నారు. వీరి రోజువారీ వినియోగానికి ఇది పెనుభారం. అంతర్జాతీయ మార్కెట్లో చమురుధరలు తగ్గుతున్న తరుణంలో వంటగ్యాస్ ధర కూడా తగ్గించే చర్యలు తీసుకుంటే మంచిది.

ది హిందూ

స్థిరాస్తిరంగ నియంత్రణ

స్థిరాస్తి రంగ నియంత్రణకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కొత్త నిబంధనలు స్థిరాస్తి కొనుగోలుదారులకు మోసాలు జరుగకుండా భరోసా కల్పిస్తున్నయి. ఈ రంగంలో మోసాలను అరికట్టడానికి నిబంధనలను కట్టుదిట్టం చేస్తూనే, వ్యాపారాభివృద్ధికి దోహదపడటం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే స్థిరాస్తి నియంత్రణ చట్టాన్ని (రెరా) తెచ్చిన కేంద్రం వీటిని రాష్ట్రాలు అమలు చేయడానికి మూడు నెలల వ్యవధి ఇచ్చింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం స్పష్టంగా లేకపోవడంతోపాటు ఇతరత్రా విమర్శలు ఉన్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలు మాత్రం స్పష్టంగా మోసాలకు తావివ్వకుండా ఉన్నాయి. కేంద్ర చట్టంలో కనీస మార్పులు మాత్రమే చేసి వీలైనంత వరకు యథాతథంగా అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం సఫలమైంది. కొత్త నిబంధనల వల్ల స్థిరాస్తి వ్యాపారంలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొంటుంది. స్థిరాస్తి రంగమంటేనే అనేక చిక్కులతో కూడుకున్నదనీ, మోసాలు ఉంటాయని కొనుగోలు దారులు భయపడుతూ ఉంటారు. ఇంతకాలం ఇంటి స్థలం లేదా ఇల్లు కొనుగోలుదారులు మోసపోతే వెంటనే వారిని ఆదుకునే దిక్కులేదు. జీవితకాలమంతా కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో ఎక్కడైనా ఇంటి స్థలం కొని, ఇల్లు కట్టుకొని ప్రశాంతంగా గడుపాలని వృద్ధులు కోరుకుంటారు. తీరా స్థలం కొన్న తరువాత మరొకరు వచ్చి తమదని అనవచ్చు. లేదా అధికారులు వచ్చి అది పార్క్ స్థలమని లేదా మరొకటని అభ్యంతరం చెప్పవచ్చు. ఇట్లా వ్యాపారుల చేతిలో మోసపోయిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. కష్టార్జితం కోల్పోయిన బాధ జీవితాంతం మనసును తొలుస్తూ ఉంటే, వృద్ధాప్యంలో నీడలేని బతుకవుతుంది. ఇటువంటి మోసాలు జరుగకుండా తాజా నిబంధనలను రూపొందించారు.

ఇంతకాలం స్థిరాస్తి రంగంలో మోసాలు ఉంటాయని జడుసుకొని దూరం ఉన్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కొనుగోలుదార్లు ఇప్పు డు ధైర్యంగా ముందుకు వస్తారు. పట్టణ ప్రాంతంలో ఉండే నిర్మాణ ప్రాజెక్టులను తనిఖీ చేసుకొని ధైర్యంగా కొనుక్కోవచ్చు. స్థిరాస్తి రంగంలో ఉండే మోసాల వల్ల ఇతర రంగాలలో మదుపు చేసిన వారు, ఇప్పుడు ఈ వైపు దృష్టి సారిస్తారు. దీనివల్ల క్రమంగా రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడుతుంది. స్థిరాస్తి వ్యాపార రంగం పద్ధతి ప్రకారం జరుగడం అన్ని పక్షాలకూ శ్రేయోదాయకం.

ఇంతకాలం స్థిరాస్తి వ్యాపారులు మోసం చేస్తే శిక్షించడానికి చట్టాలు ఉన్నాయి. అయితే కొనుగోలుదారులు న్యాయం పొందడం దీర్ఘకాల ప్రయాస. ఇప్పుడు మోసాలను ముందుగానే అరికట్టే విధంగా కొత్త నిబంధనలున్నాయి. ఇప్పుడు స్థిరాస్తి వ్యాపారి ముందుగా తమ ప్రాజెక్టును నమోదు చేయించుకొని అన్ని అనుమతులు పొందేవరకు ఒక్క అమ్మకం కూడా జరుపడానికి వీలులేదు. కనీసం ప్రకటనలు చేయడానికి కూడా వీలులేదు. స్థిరాస్తి వ్యాపార సంస్థ తమ వివరాలన్నిటినీ 'రెరా' వెబ్‌సైట్‌లో పొందుపరుచవలసి ఉంటుంది. ప్లాటు, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనుక్కోవాలనుకునే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ చూసి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. నిర్మాణ ప్రాజెక్టు చేపడుతున్న స్థిరాస్తి సంస్థ 'జాతకం' అంతా వెబ్‌సైట్‌లో ఉంటుంది. నిర్మాణ ప్రాజెక్టు ప్రణాళిక, అనుమతులు, భూమి రికార్డులు, ప్రాజెక్టు ప్రమోటరు ఫోటోలతో సహా వివరాలన్నీ అందులో ఉంటాయి. నిర్మాణ సంస్థ మూడేండ్ల బ్యాలెన్స్‌షీట్లు, వార్షిక నివేదికలు కూడా ఉంటాయి. దీనివల్ల ఆయా సంస్థలను నమ్మవచ్చా లేదా అనేది కొనుక్కునేవ్యక్తి నిర్ధారించుకుంటా డు. అనుమతి లేకుండా ప్రకటనలు ఇచ్చినా, అమ్మినా నిర్మాణ ప్రాజెక్టులో పది శాతం అపరా ధ రుసుము చెల్లించవలసి ఉంటుంది. అదే నేరం మళ్ళా చేస్తే మూడేండ్లు ఖైదు అనుభవించవలసి వస్తుంది. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు (లేదా కన్సల్టెన్సీ సంస్థలు) కూడా రిజిస్టరు చేయించుకోవలసి ఉంటుంది. మోసాలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. దీనివల్ల దళారులు తాము అమ్ముతున్న ప్లాట్లు, ఇండ్లు అనుమతులు గలవేనా అనేది నిర్ధారించుకుంటారు. దళారుల మాటలు నమ్మి కొనుక్కునే వారు మోసపోవడం ఉండదు.

కొత్త నిబంధనలు అమలులోకి రావడం వల్ల స్థిరాస్తి వ్యాపార రంగం మార్పులకు లోనవుతుంది. ఇందుకు కొంత సమయం పడుతుంది. అంతే తప్ప దీనివల్ల వ్యాపారం దెబ్బతినడమంటూ ఉండదు. రాతోరాత్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అవతారం ఎత్తి, నియమ నిబంధనలు పాటించకుండా, అడ్డగోలుగా ప్లాట్లు చేసి బోర్డు తిప్పేసి మాయమయ్యే వారు కొత్త విధానం వల్ల తోకముడువక తప్పదు. అటువంటి మోసగాళ్ళు ఈ రంగంలో నిలువలేరు. ఇంతకాలం కొనుగోలుదారులకు ఎవరి నిర్మాణ ప్రాజెక్టు నమ్మదగినదో తెలువకపోయేది. దళారుల మాటలు నమ్మి అక్రమవ్యాపారుల పాలిట పడేవారు. అక్రమవ్యాపారులు అనుమతులు లేని ప్రాజెక్టులు అంటగడుతూ లాభాలు దండుకుంటూ ఉంటే, నిజాయితీగా వ్యాపారం చేసేవారికి నష్టం వాటిల్లేది. ఇప్పుడు వృత్తిపరమైన విలువలతో ఉత్తమ పద్ధతిలో వ్యాపారం చేసుకునే వారికి అదనంగా వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. అక్రమ వ్యాపారులు రంగం నుంచి నిష్క్రమించడం వల్ల వీరి వ్యాపారం పెరుగుతుందే తప్ప తగ్గదు. ఇంతకాలం స్థిరాస్తి రంగంలో మోసాలు ఉంటాయని జడుసుకొని దూరం ఉన్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కొనుగోలుదార్లు ఇప్పుడు ధైర్యంగా ముందుకు వస్తారు. పట్టణ ప్రాంతంలో ఉండే నిర్మాణ ప్రాజెక్టులను తనిఖీ చేసుకొని ధైర్యంగా కొనుక్కోవచ్చు. స్థిరాస్తి రంగంలో ఉండే మోసాల వల్ల ఇతర రంగాలలో మదుపు చేసిన వారు, ఇప్పుడు ఈ వైపు దృష్టి సారిస్తారు. దీనివల్ల క్రమంగా రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడుతుంది. స్థిరాస్తి వ్యాపార రంగం పద్ధతి ప్రకారం జరుగడం అన్ని పక్షాలకూ శ్రేయోదాయకం.

జనగళం

ఆరోగ్యశ్రీలో చేర్చాలె

ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో వేలాదిమంది పేద రోగులు ఉచితంగా వైద్యం పొందుతున్నారు అయితే ఆరోగ్యశ్రీలో కొన్ని వ్యాధులకు మాత్రమే చికిత్స చేస్తున్నారు. కొన్ని వ్యాధులకు చికిత్స చేయించుకోవాలంటే తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. దీంతో పేద రోగులు డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దీన్ని పరిగణనలోకి తీసుకొని అన్నివ్యాధులకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందించాలి. అప్పుడే పేదలకు మేలు జరుగుతుంది.

- నందగిరి కిరణ్, మానకొండూర్, కరీంనగర్

అర్హులకే అందాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తవుతుండటం హర్షణీయం. అయితే ఈ ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలి. అర్హులకు మాత్రమే ఇండ్ల పంపిణీ జరిగేలా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలి. పైరవీలకు తావులేకుండా చేసినప్పుడే అర్హులకు న్యాయం జరుగుతుంది.

- ఎన్.కమలాకర్, బీబీనగర్, యాదాద్రి భువనగిరి జిల్లా

ఆరోపణలు సరికాదు

నేరేళ్ల ఘటనపై ప్రతిపక్షాలు స్పందిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తున్నది. ఈ ఘటనకు సీఎం కేసీఆర్ కుటుంబాన్ని బాధ్యులను చేస్తూ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుంటే ఇది ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటు.

- పులిపాక సంతోష్, సిరిసిల్ల

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

చదువగ వలయును జనులకు

ఐదు వందల ఏండ్ల కిందటనే చదువు అవసరం, అనివార్యత, ప్రాధాన్యం గురించి సూటిగా, సరళంగా, స్పష్టంగా నొక్కిచెప్పింది తెలంగాణ భక్త కవి, మహాకవి బమ్మెర పోతన. 'చదువని వాడజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత గలుగున్, చదువగ వలయును జనులకు...' అని తనదైన లలిత మాధుర్య శైలిలో పోతన కావించిన ప్రబోధం తరతరాలకు మార్గదర్శకమైన జ్ఞాన మార్గం.

పోతన 'చదువగ వలయును' అన్నాడు, 'చూడగ వలయును' లేక 'వినగ వలయును' అనో అని అనలేదు. 'పుస్తకాలు చదువాలె', 'చదువులు చదువాలె' అని ఆయన భావించి ఉంటారు. 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతంబూనితిన్' అని కూడా అన్నారు. 'విద్యనిగూఢ గుప్తమగు విత్తము' అని హితవు పలికారు భర్తృహరి వంటి పెద్దలు. 'పుస్తకం హస్త భూషణం' అన్నారు. ఈ రోజు పుస్తకం స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమిస్తున్నది. ఏమైనా, చదువు-పుస్తకం విలువ ఎన్నటికీ తరుగవు, చెదరవు అని చెప్పాలె. పుస్తకం కేవలం హస్తభూషణం కాదు, అది మనిషికి సక్రమ మార్గాన్ని తెరిచిచూపే జ్ఞానదీపం. ఐదు వందల ఏండ్ల కిందట పోతన 'చదువగ వలయును' అని చేసిన ప్రబోధానికి నేడు రాష్ట్ర ప్రభుత్వం కార్యరూపం కల్పించడానికి పలు మార్గాల్లో అవిరళ కృషి జరుపుతున్నది. పాఠశాలల్లో, కళాశాలల్లో, ఇతర విద్యా వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థల్లో ప్రతిభా కుసుమాలు వికసించడానికి, సామాజిక వికాస ఫలాలు ఇంటింట ఆనందం పంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక తపస్సుగా కొనసాగిస్తున్న మహత్తర యత్నాన్ని కండ్లున్న అంధులు, చెవులున్న బధిరులు కొందరు గుర్తించలేకపోయినా అది భవిష్యత్ తరాలకు నిశ్చయంగా గ్రంథస్థమవుతుందనడంలో సందేహం లేదు. మానవ నాగరికత పరిణామ, వికాసాల్లో భాగంగా అనాది నుంచి వాఙ్మయ వ్యాప్తి జరిగింది. ఇప్పటి రీతిలో పుస్తకరూపం ధరించకపోయినా వేదా లు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు కాలం రాపిడిని తట్టుకొని నిలిచాయి. ముద్రణ సదుపాయాల విస్తరణ తో ప్రాచీన వాఙ్మయం సైతం పుస్తక రూపం ధరించి అందరి చేతుల్లోకి రాగల అవకాశం లభించింది. పదిహేనవ శతాబ్దంలో తెలంగాణ ప్రాం తం బమ్మెరలో పోతన 'పలికించెడు వాడు రామభద్రుండట' అని అం టూ శ్రీమద్భాగవతం రచిస్తున్న సమయాన అక్కడ జర్మనీలో క్రీ.శ. 1448లో జర్మనీ దేశస్థుడు జాన్స్ గుటెన్ బర్గ్ ముద్రణ యంత్రాన్ని రూపొందించి మొదట కొన్ని గ్రంథాల ముద్రణతో ప్రయోగాలు జరిపి క్రీ.శ. 1455లో, తర్వాత 1458-60 బైబిల్‌ను అందంగా ముద్రించాడు. తర్వాత శతాబ్దాల్లో ముద్రణ ఒక సాంకేతిక ప్రక్రియగా, ఆధునిక కళగా వికసించి విస్తరించింది. 2010 నాటికి ప్రపంచమంతటా వివిధ దేశాల్లో, విభిన్న భాషల్లో 13 కోట్ల పుస్తకాలు (టైటిల్స్) అనేక విషయాలపై ముద్రితమైనాయని ఐరాస వర్గాల అంచనా. మానవ నాగరికత పరిణామక్రమంలో మొదట శిలలకు, పశు-జంతు చర్మాలకు, రాగి రేకులకు, తాళపత్రాలకు పరిమితమైన బహుముఖ వాఙ్మయం గుటెన్‌బర్గ్ అచ్చు యంత్రంతో మొదలై, ముద్రణ సదుపాయాలు విస్తరించి కోట్లాది పుస్తకాలు ముద్రితమయ్యాయి. మానవ మేధస్సు వికాసానికి, విప్లవకర ఆలోచనల, భావాల స్ఫూర్తికి, ప్రజ్వలనకు ఈ పుస్తక కోటి కొండంతగా దోహదపడింది.


క్రమంగా పుస్తక పఠనం విజ్ఞానదాయకమవుతూ కొందరికి ఒక వ్యసనంగా మారింది. మానవ మాత్రులు సైతం మహనీయులు, మహాత్ములు కావడానికి, వీధిలోకి వెళ్లడానికి సైతం వెరసిన వారు విప్లవకారులు కావడానికి, సందేహ, సంశయ జీవులు సైతం సంస్కర్తలుగా మారడా ని కి, ఉద్వేగానికి దూరంగా మసలిన వారు సైతం ఉద్యమకారులై విజృంభించడానికి పుస్తకాలే నిరంతర స్ఫూర్తి కలిగించిన ఉజ్వల సందర్భాలున్నాయి. దాదాపు 170 ఏండ్ల కిందట ప్రచురితమైన కార్ల్‌మార్క్స్- ఫ్రెడరిక్ ఎంగిల్స్ పుస్తకాలు ఆధునిక ప్రపంచంలో ఒక కొత్త మలుపు రావడానికి కారణం కాగా, అనంతరం కొన్నేండ్లకు పుస్తక రూపం ధరించిన గాంధీజీ ఆలోచనలు మనిషి మనిషిగా జీవించడానికి స్ఫూర్తినిచ్చాయి. గాంధీజీ వ్యక్తిత్వంపై, ఆయన ఆలోచనా సరళిపై తొలినాళ్లలో అమిత ప్రభావం కలిగించిన గ్రంథం జాన్ రస్కిన్ రచించిన "Unto this Last" గ్రంథం. బారిస్టర్ చదువు కోసం 1888 సెప్టెంబర్‌లో లండన్ వెళ్లిన గాంధీజీని 1890లో ఇద్దరు ఆంగ్లేయ ఎథియాలజిస్టులు భగవద్గీత గురించి అడిగారు. వారు అడిగేవరకు భగవద్గీత గురించి ఆలోచించనందుకు గాంధీజీ సిగ్గుపడ్డారు. అప్పుడు ఆయన అన్నగారికి ఉత్తరం రాసి బొంబాయి నుంచి భగవద్గీత గ్రంథాన్ని తెప్పించుకున్నాడు. ''The Song Celestial' పేరుతో సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ గీతకు చేసిన అద్భుత అనువాదాన్ని, ఆర్నాల్డ్ మరో అనువాదం 'Light of Asia' (బుద్ధ చరిత్రం) గ్రంథాన్ని, మాడమ్ బ్లావట్‌స్కీ రచించిన 'Key to Theosophy' గ్రంథాన్ని, కార్లిల్ రచన 'Heroes And Hero Worship' గ్రంథాన్ని, బైబిల్, న్యూటెస్టామెంట్ గ్రంథాలను గాంధీజీ లండన్‌లో చదివారు. అన్ని చదివిన తర్వాత ఆయన భగవద్గీతపై వ్యక్తపరచిన అభిప్రాయం.. "This book GITA struck me, as one of priceless worth... I reg-ard it today as the book par excellence for the knowledge of truth.." అనంతర జీవితంలో గాంధీజీ నిత్య పారాయణ గ్రంథం భగవద్గీత. 13వ శతాబ్దంలో యూరపు దేశాల్లో విశ్వ విద్యాలయాల స్థాపన, విస్తరణ వేగాన్ని పుంజుకోవడంతో పుస్తకాల డిమాండ్ పెరిగింది. 19వ శత్దాంలో ముద్రణ రంగంలో సంభవించిన అపూర్వమైన మార్పులతో పుస్తకాల డిమాండ్ బాగా పెరిగింది. పాఠకుల, పుస్తక ప్రియుల, రచయితల, కవుల సంఖ్య ఎవరూ ఊహించలేనంతగా హెచ్చింది. ప్రపంచ వైజ్ఞానిక రంగంలో మహత్తర పరిణామాలు సంభవించాయి. పుస్తక ప్రియుల్లో, పుస్తక రచయితల్లో స్వతంత్ర భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అగ్రగణ్యుడు (ప్రగతిశీలి, పుస్తకప్రియుడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కావడం విశేషం). ప్రధాని పదవీ బాధ్యతల నిర్వహణలో పుస్తక పఠనానికి తీరిక దొరుకడం లేదని, పుస్తకాలు చదువడానికి ప్రధాని పదవిని వదులుకుంటానని జవహర్‌లాల్ నెహ్రూ అప్పుడప్పుడు చేసే ప్రకటనలు ఆయన అనుచరులకు, అభిమానులకు, పదవులను, అధికారాన్ని వదులుకోవడం ఇష్టంలేని కాంగ్రెస్ నేతలకు ఆందోళన కల్గించేవి. నెహ్రూకు పుస్తకాలను చదువడంతో పాటు పుస్తకాలు రచించడంలో ఆసక్తి మెండు. స్వాతంత్ర్యోద్యమం రోజుల్లో, పదకొండేండ్లు కారాగార వాస శిక్ష అనుభవించినప్పుడు ఆయన పుస్తక పఠనంలో, అమూల్య గ్రంథర చనలో తలమునకలైనారు. "My father's three books - Glimpses of World History, An Auto biography and the Discovery of India - have been my companions throuh life" అని ఇందిరాగాంధీ అన్నారు.

దేశమంతటా పుస్తక ప్రదర్శనలను, ప్రదర్శనల సందర్భాన కవులు, రచయితలు, మేధావుల సమావేశాలను ఏర్పాటుచేయడం ఎన్‌బీటీ ప్రత్యేకత. గత అరువై ఏండ్లలో వివిధ భారతీయ భాషల్లో ఇంగ్లీష్‌తో పాటు ఎన్‌బీటీ 21 వేల పుస్తకాలను ప్రచురించడం అసాధారణ కార్యం.

పుస్తకప్రియుడు, గ్రంథకర్త, విజ్ఞాన పిపాసి నెహ్రూ ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి విధానాలతో పాటు వైజ్ఞానిక వ్యాప్తికి, సాంస్కృతిక, సారస్వత వికాసానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్వాతంత్ర్య లబ్ధి తర్వాత తొలినాళ్లలోనే నెహ్రూ పలు వైజ్ఞానిక సంస్థల, పరిశోధనాగారాల స్థాపన మీద దృష్టిని ప్రసరించారు. 1954లో స్థాపితమైన కేంద్ర సాహిత్య అకాడమీకి ఆయనే అధ్యక్షులు. ఆయన చొరవతో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేతృత్వంలో 1957 ఆగస్టు 1న నేషనల్ బుక్ ట్రస్ట్ స్థాపితమైంది. వివిధ భారతీయ భాషల పుస్తక రచన, పుస్తక ప్రచురణ, సారస్వత వికాస కృషిలో ఆరు దశాబ్దాల నుంచి గణనీయ, చరిత్రాత్మక పాత్ర నిర్వహిస్తున్న నేషనల్ బుక్ ట్రస్ట్ ఈ రోజు 60 ఏండ్ల పండుగ జరుపుకోవడం కవులు, రచయితలు, పుస్తకప్రియులు, విజ్ఞాన పిపాసువులందరికీ ప్రమోద కారణం. ఎన్‌బీటీ స్థాపితమయ్యే నాటికి భారతదేశంలో అక్షరాస్యుల సంఖ్య 20 శాతం కూడా కాదు. ఆ పరిస్థితిలో ఎన్‌బీటీ దేశంలో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడం సులభం కాదు. అదొక సాహస కార్యమే. అయిప్పటికీ తన ఆశయాలు, లక్ష్యాల సాధనలో ఎన్‌బీటీ గణనీయ విజయం సాధించింది. పఠనాసక్తిని ప్రచలితం చేయడంతో పాటు పుస్తకరచనను, ప్రచురణను, కవులు, రచయితలు, అనువాదకులను ప్రోత్సహించడం ఎన్‌బీటీ ప్రధాన విధులు. సమాజంలోని అన్ని వర్గాలు, అన్ని వయసుల వారికి, విశేషించి కొత్తగా అక్షరాస్యులైన వయోజనులకు, బాలలకు ఉపయుక్తమైన సామాజిక, వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల, సారస్వత విషయాల విలువైన గ్రంథాలను వివిధ భారతీయ భాషల్లో ఎన్‌బీటీ ప్రచురిస్తున్నది. ఇంగ్లీష్‌తో సహా వివిధ భాషల్లో, ఈశాన్య రాష్ట్రాల వివిధ భాషల్లో ఎన్‌బీటీ పుస్తకాలు ప్రచురితమయ్యాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమం, సమరయోధులు, భారత రాజ్యాంగం, భారత పార్లమెంట్, ప్రజాస్వామ్యం, పంచాయతీరాజ్ వ్యవస్థ, నైరుతీ రుతుపవనాలు (మాన్‌సూన్), దేశ జనాభా, ప్రకృతి సంపదలు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, సామాజిక, సారస్వత రంగాల ప్రముఖులు ఎన్‌బీటీ ప్రచురణలలో ప్రాధాన్యం పొందడం ప్రశంసనీయం. ఒక భారతీయ భాషా సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురించే కర్తవ్యంతో ఎన్‌బీటీ వివిధ రాష్ట్రాల, ప్రాంతాల మధ్య సదవగాహనకు, భావ సమైక్యతకు, జాతీయ సమైక్యతకు కృషి కొనసాగిస్తున్నది. దేశమంతటా పుస్తక ప్రదర్శనలను, ప్రదర్శనల సందర్భాన కవులు, రచయితలు, మేధావుల సమావేశాలను ఏర్పాటుచేయడం ఎన్‌బీటీ ప్రత్యేకత. గత అరువై ఏండ్లలో వివిధ భారతీయ భాషల్లో ఇంగ్లీష్‌తో పాటు ఎన్‌బీటీ 21 వేల పుస్తకాలను ప్రచురించడం అసాధారణ కార్యం. ప్రతిపక్షంలో అతిరథ మహారథులు సకారాత్మక పాత్ర నిర్వహించడం వల్ల నెహ్రూ సర్వతోముఖాభ్యుదయానికి సారథ్యం వహించగలిగారు. పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ అన్నది పొలిటికల్ ఇంటరెస్ట్ లిటిగేషన్ అయి ప్రగతికి అడ్డుపడని రోజులు అవి!

పెద్దల సభ గౌరవాన్ని పెంచాలె

విశ్లేషణ




డాక్టర్ చాగంటి బుచ్చయ్య

రాజ్యసభ ఎన్నికలు కూడా మునుపెన్నడూ లేనంత ఉత్కంఠభరితంగా మారాయి. ఆగస్టు 8న గుజరాత్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుల ఎన్నిక జరుగనున్నది. పెద్దల సభగా పేర్కొనబడుతున్న రాజ్యసభలో తగిన మెజారిటీ లేనందువల్ల అధికార పార్టీ బిల్లులను ఆమోదింపజేసుకొనే విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్నది. నిన్న, మొన్న ఓబీసీ కమిషన్ ఏర్పాటుకు రాజ్యాంగబద్ధతను కల్పించడానికి ఉద్దేశించిన కొన్ని ప్రకరణలకు సవరణలను కల్పించడంలో అధికారపక్షం విఫలమైంది. ప్రతిపక్షాల కూటమి అత్యంత ప్రాముఖ్యమైన ఆ బిల్లు భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చడంలో విజయం సాధించింది. దీనికి కారణం ప్రతిపక్షపార్టీలు వ్యవహరించిన వ్యూహాత్మకమైన తీరు. అధికారపార్టీ కూటమికి చెందిన అనేకమంది రాజ్యసభ సభ్యులు హాజరుకాకపోవడం వంటి స్వయంకృతాపరాధం కూడా తోడయిందనవచ్చు. అధికార పార్టీ ప్రస్తుతం రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలతో తన బలాన్ని పెంచుకునే యత్నంలో నిమగ్నమైంది. ప్రస్తుతం రాజ్యసభలో అధికార పార్టీ సభ్యుల సంఖ్య 80, కాగా మధ్యప్రదేశ్, గుజరాత్ ఒక్కొక్క స్థానం కైవసం చేసుకునే వీలున్నది. నాటకీయ పరిణామాల అనంతరం బీహార్‌లో భాజపా, జేడీయూలు జత కట్టడంతో రాజ్యసభలో జేడీయూకు చెందిన 10 మంది సభ్యుల మద్దతు ఎన్డీయే కూటమికి లభించనున్నది. దీంతో ఎన్డీయే బలం 90కి పై చిలుకు కానున్నది. కాగా ప్రాంతీయ పార్టీల మద్దతు కూడా తోడైతే మరో 26 సభ్యుల బలం పెరుగుతుంది. అయితే సభలో ఉన్న 8మంది నామినేట్ సభ్యు ల్లో కనీసం నలుగురు ప్రభుత్వానికి మద్దతుగా ఉండే వీలున్నది. వీటితో రాజ్యసభలో ఎన్డీయే బలం 121 చేరుతుంది. 245 మంది సభ్యులున్న సభలో సాధారణ మెజార్టీకి అవసరమైన సభ్యుల సంఖ్య 123 అయినందువల్ల అధికార కూటమి సాధారణ మెజార్టీ సాధనకు అతి సమీపంలో ఉందనవచ్చు. అయితే ఈ లక్ష్యాన్ని సాధించి, సభలో కాంగ్రెస్ నాయకత్వంలోని పార్టీలు సభలో బిల్లులను అడ్డుకొనే గండం నుంచి బయటపడాలంటే 8న జరిగే ఎన్నికల్లో ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రం నుంచి ఎన్నికలు జరిగే స్థానాలను కైవసం చేసుకోవాలి.

ప్రథమంగా ఈసారి రాజ్యసభకు జరిగే ఎన్నికల్లో 'నోటా'ను ప్రవేశపెట్టనున్నట్లు, ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రజాప్రాతినిధ్య చట్టానికి, 324 ప్రకరణలకు సవరణలు చేయకుండా 'నోటా'ను ప్రవేశపెట్టడమేమిటని కాంగ్రెస్ అభ్యంతరాన్ని వ్యక్తపరుస్తున్నది. ఈ నేపథ్యంలోనే గుజరాత్ నుంచి జరిగే స్థానాల ఎన్నికను ఇరు కూటములు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు సభ్యులు అందునా సీనియర్ సభ్యుడైన వాఘేలా వంటివారు కాంగ్రెస్ పార్టీని వీడారు. దీనితో మిగతా సభ్యులను కాపాడుకొనేటందుకు బెంగళూర్‌లో క్యాంప్ నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ 'రిసార్ట్' రాజకీయాలకు తెర లేపింది.

రాజ్యసభ నియామకాల విషయంలో నెహ్రూ రాజ్యాంగస్ఫూర్తి మేరకే వ్యవహరించారు. గౌరవనీయులైన ప్రముఖులనే రాజ్యసభకు నామినేట్ చేశారు. కానీ ఇటీవలి కాలంలో చేస్తున్న నామినేషన్లు రాసి, వన్నె తగ్గాయనే విమర్శలున్నాయి. దీంతో రాజ్యసభ అనుభవజ్ఞులకు రాజనీతిజ్ఞులకు నిలయమైన సభగా రూపొందాలనే రాజ్యాంగ నిర్మాతల కల కల్లగానే మిగిలిపోతున్నది.

అన్నిటికంటే ముఖ్యంగా పెద్దల సభ నిర్వహణ అనేది గందరగోళంగా మారుతున్నది. వాగ్వివాదాలు, వాకౌట్లు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడం వంటివి పెద్దల సభలో కూడా నిత్యకృత్యమైనాయి. సభను శాంతియుతంగా నిర్వహించడమనేది సభాధ్యక్షులకు కత్తిమీద సాములా తయారైంది. ఫలితంగా పార్లమెంట్ పనితనంపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిది. నేడు రాజ్యసభలో నెలకొన్న పార్టీల బలాబలాలు మారాయి. పార్టీల వైఖరి సక్రమ సభానిర్వహణకు అవరోధంగా మారుతున్నది. సభలో సముచితమైన చర్చలో పాల్గొనాలనే సభ్యుల కుతూహలం కొర వడుతున్నది. ఇదే ఆందోళన కరమైన విషయం.



రాజ్యాంగ నిర్మాతల దృష్టిలో రాజ్యసభకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. అనుభవజ్ఞుల అర్థవంతమైన చర్చ పెద్దల సభకు వన్నె వస్తుంది. ఇది శాశ్వత సభ. సాధారణ చట్టాల రూపకల్ప న, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నిక, తొలిగింపులో పాల్గొనడం, రాజ్యాంగ సవరణ, ప్రభుత్వం సమర్పించిన నివేదికల పరిశీలన మొదలైన విషయాలలో లోక్‌సభతో సమానమైన అధికారాలు రాజ్యసభ కలిగి ఉన్నది. రాజ్యాంగంలోని 249 ప్రకరణ ప్రకారం దేశ ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని ఫలానా అంశంపై పార్లమెంటు చట్టం చేయడానికి అవసరమైన తీర్మానాన్ని ఆమోదిస్తుంది. అదే విధంగా 312 ప్రకరణను అనుసరించి అదనపు అఖిల భారతీయ సర్వీసులు ఏర్పాటు చేయడానికి కావల్సిన తీర్మానం చేసే అధికారం కూడా ప్రత్యేకంగా రాజ్యసభకు ఉన్నది.

ప్రజా సంక్షేమ విషయాల చర్చలు మాత్రమే పార్లమెంటరీ సంస్థల ప్రాముఖ్యాన్ని పెంచుతాయి. ఇకనైనా సభ్యులు అత్యంత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ప్రజల దృష్టిలో చట్టసభల గౌరవ మర్యాదలు ఇనుమడింపజేయాలి.

ప్రజా సంక్షేమ విషయాల చర్చలు మాత్రమే పార్లమెంటరీ సంస్థల ప్రాముఖ్యాన్ని పెంచుతాయి. ఇకనైనా సభ్యులు అత్యం త బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ప్రజల దృష్టిలో చట్టసభల గౌరవ మర్యాదలు ఇనుమడింపజేయాలి.

(వ్యాసకర్త: ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల విశ్రాంత ఆచార్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

సెన్సెక్స్	నిఫ్టీ
32,325	10,066
↘ 87	↘ 53

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	28,690
22 క్యారెట్లు	28,540
వెండి (కిలో)	37,950

ముడి చమురు (బ్రెంట్)

↗ 52.29

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.92	67.16
ఆస్ట్రేలియా డాలర్	46.12	53.38
బహ్రెయిన్ దినార్	156.93	179.74
యూరో	68.78	79.78
జపాన్ యెన్/100	52.61	61.01
కువైట్ దినార్	174.04	217.59
ఒమన్ రియాల్	153.56	175.73
సౌదీ రియాల్	15.40	18.26
సింగపూర్ డాలర్	42.64	50.52
స్టెర్లింగ్ పౌండ్	76.09	88.24
యూఏఈ దిర్హామ్	15.76	18.43

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్ఎల్ఎఫ్ఏ
హైదరాబాద్	313-00	313-00
రంగారెడ్డి	313-00	313-00
మెదక్	313-00	313-00
కరీంనగర్	315-00	---
వరంగల్	315-00	---
రిటైల్ ప్రైస్	3-75	3-75

చికెన్ ధరలు

ఫారం ధర	71.00
రిటైల్ లైవ్	85.00
డ్రెస్డ్	119.00
స్కిన్‌లెస్	140.00

నేడు జీఎస్టీ మండలి భేటీ

ఈ-వే బిల్లు, యాంటీ ప్రాఫిటీరింగ్ వ్యవస్థల అమలును ఖరారు చేసే అవకాశం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జీఎస్టీ మండలి శనివారం మరోసారి భేటీకానుంది. గతనెల 1 నుంచి జీఎస్టీ అమలవుతున్న తీరును సమీక్షించడంతోపాటు ఈసారి సమావేశంలో మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ-వే బిల్లుతోపాటు యాంటీ ప్రాఫిటీరింగ్ వ్యవస్థల అమలును ఖరారు చేయడం తోపాటు కొన్ని పన్నులను సవరించవచ్చు. దుస్తుల తయారీ జాబ్‌వర్క్స్‌పై పన్నురేటును ప్రస్తుతమున్న 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఇప్పటికే 25 రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టులను ఎత్తివేశాయని, దాంతో వస్తు రవాణా బాగా మెరుగుపడిందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) చైర్‌పర్సన్ వనజ సర్నా తెలిపారు. ఈ-వే బిల్లు విధానం అమలులోకి వచ్చాక వస్తు రవాణా మరింత మెరుగుపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.50 వేల కంటే అధిక విలువ చేసే వస్తువుల రవాణాకు ఆన్‌లైన్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఈ-వే బిల్లు పొందడం తప్పనిసరి. అయితే, రూ.50 వేల పరిమితిని పెంచాలని వ్యాపార వర్గాల నుంచి డిమాండ్ వస్తున్నది. ఈ నేపథ్యంలో పరిమితి పెంచుతారా అన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సీబీఈసీ చైర్‌పర్సన్ నిరాకరించారు. కొత్త పరోక్ష పన్నుల విధానం అమలులోకి వచ్చాక జీఎస్టీ మండలికిది రెండో సమావేశం కానుంది. ఇంతకుముందు జూలై 17న జైట్లీ అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఆ భేటీలో సిగరెట్లపై స్థిర సెస్సును పెంచడం జరిగింది.

ఎస్‌బీఐ బాటలో బీవోబీ

పొదుపు ఖాతా డిపాజిట్లపై వడ్డీ 0.5% తగ్గింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: మరో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సేవల సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) కూడా పొదుపు ఖాతాలపై చెల్లించే వడ్డీరేటును అరశాతం తగ్గించింది. రూ.50 లక్షల లోపు డిపాజిట్లపై చెల్లించే వార్షిక వడ్డీరేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గిస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. తగ్గింపు శనివారం నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. అర కోటికిపైగా డిపాజిట్లపైన మాత్రం వడ్డీరేటును 4 శాతంగా కొనసాగించనున్నట్లు బీవోబీ స్పష్టం చేసింది. గతనెల 31న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ. కోటి లోపు సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా బీవోబీ కూడా అదే బాటలో పయనించింది. ముమ్మందు మరిన్ని బ్యాంకులు పొదుపు ఖాతాల వడ్డీరేట్లలో కోతపెట్టే అవకాశం ఉంది.

నెలకు 100 కోట్ల లావాదేవీలు

ఎన్‌పీసీఐ అద్భుత రికార్డు

ముంబై, ఆగస్టు 4: గతనెలలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) ద్వారా లావాదేవీలు 100 కోట్ల స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఎన్‌పీసీఐ 12 చెల్లింపుల వ్యవస్థలను నిర్వహిస్తున్నది. అందులో చెక్కులు, ఏటీఎం లావాదేవీల క్లియరెన్సుల దగ్గరి నుంచి తక్షణ చెల్లింపుల సేవలు (ఐఎంపీఎస్), యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), భీమ్, రూపే, పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్), ఈ-కామర్స్, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థలున్నాయి. ప్రతినెలా వందల కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసే అంతర్జాతీయ సంస్థల సరసన తామూ చేరడం గొప్ప విజయమని ఎన్‌పీసీఐ ఎండీ, సీఈవో ఏపీ హోతా అన్నారు. మొత్తం లావాదేవీల్లో మొబైల్ పేమెంట్స్, ఆధార్ ఆధారిత చెల్లింపుల్లో భారీ వృద్ధి కన్పించిందన్నారు. వచ్చే మూడేండ్లలో రోజుకు వంద కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేయగలిగే స్థాయికి ఎదుగడమే సంస్థ లక్ష్యమన్నారు. ఎన్‌పీసీఐ జనవరి 2010లో సేవలను ప్రారంభించింది. ప్రారంభంలో నెలవారీ లావాదేవీలు 5 కోట్ల స్థాయిలో ఉండేవి. గడిచిన ఏడేండ్లలో ఎన్‌పీసీఐ ద్వారా లావాదేవీలు 20 రెట్లు పెరిగాయి.

ఎయిర్ ఇండియా సిబ్బంది గతనెల వేతన చెల్లింపుల్లో జాప్యం



ముంబై, ఆగస్టు 4: రుణభారంతో సతమతమవుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగులకు గడిచిన నెలకుగాను జీతాలను శుక్రవారం చెల్లించినట్లు కంపెనీ వర్గాలు స్పష్టంచేశాయి. సంస్థలో వాటాల విక్రయ ప్రతిపాదనకు సంబంధించి చర్చలు జరుగుతుండటంతో జీతాల చెల్లింపు ఆలస్యమైందని, జూలై నెల వేతనాలను శనివారం చెల్లించనున్నట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి ధనంజయ్ కుమార్ అంతకుముందు తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 21 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జూలై నెల వేతనాలు ఆలస్యమవడానికి గల కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. నష్టాల్లో కొనసాగుతున్న ఎయిర్ ఇండియాలో వాటాను విక్రయించడానికి ఇటీవల క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సంస్థకు రూ.50 వేల కోట్ల స్థాయిలో రుణం ఉంది.

హ్యుందాయ్ నుంచి సరికొత్త 'వెర్నా'

ఈ నెల చివరి నుంచి అందుబాటులోకి..



చెన్నై, ఆగస్టు 4: దేశంలో రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్..మార్కెట్లోకి మధ్యస్థాయి సెడాన్ విభాగానికి చెందిన వెర్నాలో నూతన వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ నెల చివర్లో విడుదల చేయనున్న ఈ కారు కోసం సంస్థ రూ.1,040 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ నెల 22న అందుబాటులోకి రానున్న ఐదో వెర్షన్ వెర్నాకోసం ఇప్పటికే ముందుస్తు బుకింగ్‌లు ప్రారంభించింది. 1.6 లీటర్ల పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ కారు మాన్యువల్, ఆటోమేటిక్ వెర్షన్లలో లభించనున్నది.

హైబ్రిడ్ వాహనాలకు రాం..రాం

దేశీయ మార్కెట్‌లోకి హైబ్రిడ్ కార్లను విడుదల చేయాలనే ప్రణాళికను విరమించుకున్నట్లు హ్యుందాయ్ ప్రకటించింది. హైబ్రిడ్ కార్లపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, అధిక పన్ను విధించడంతో ఈ ప్రణాళికను వెంటనే విరమించుకున్నట్లు హ్యుందాయ్ ఎండీ, సీఈవో వైకే కూ తెలిపారు. వచ్చే ఏడాది జరుగనున్న ఆటో ఎక్స్‌పోలో హైబ్రిడ్ మోడల్ అయోనిక్‌ను ప్రదర్శించనున్నట్లు గతంలో సంస్థ ప్రకటించింది. హైబ్రిడ్ కార్ల స్థానంలో ఎలక్ట్రిక్ కారుపై దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భారత్-22



శుక్రవారం నార్త్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, దీపం కార్యదర్శి నీరజ్ కుమార్ గుప్తా

సంస్థల్లో ప్రభుత్వ వాటాల విక్రయానికి మరో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్

6 రంగాలకు చెందిన ఇరువై రెండు కంపెనీల షేర్లతో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 4:

ఆరు రంగాలకు చెందిన ఇరువై రెండు సంస్థల్లో ప్రభుత్వ వాటాలను విక్రయించేందుకోసం 'భారత్-22' పేరుతో మరో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ను (ఈటీఎఫ్) ప్రవేశపెడుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రభుత్వానికిది రెండో ఈటీఎఫ్. గతంలో ఏర్పాటు చేసిన సీపీఎస్ఈ ఈటీఎఫ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం మూడు దఫాల్లో రూ.8,509 కోట్లు సేకరించింది. తాజాగా ప్రవేశపెట్టిన భారత్-22లో ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్స్, బేసిక్ మెటీరియల్, ఇండస్ట్రియల్, యుటిలిటీ రంగాలకు చెందిన పలు సంస్థలున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఈ ఇరువై రెండు కంపెనీల్లో ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈ), ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, ఎల్ అండ్ టీ సంస్థల్లో స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూటీఐ(ఎస్‌యూయూటీఐ) ద్వారా ప్రభుత్వానికి సంక్రమించిన వాటాలను కూడా కొత్త ఈటీఎఫ్‌లో చేర్చారు. ఈ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ కూడా విజయవంతం కాగలదని జైట్లీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈటీఎఫ్ కూడా మ్యూచువల్ ఫండ్ పథకం లాంటిదే. పెట్టుబడిదారులు యూనిట్ల రూపంలో వాటాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈటీఎఫ్‌ల ద్వారా ఆస్తుల నిర్వహణ 4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందని, వచ్చే నాలుగేండ్లలో 7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని జైట్లీ అన్నారు. ఈటీఎఫ్‌ల ద్వారా సేకరించబోయే నిధులకు పరిమితేం లేదని, ప్రభుత్వ అవసరాన్ని బట్టి పలు దఫాల్లో నిధుల సేకరణ జరుగనుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్యదర్శి నీరజ్ గుప్తా తెలిపారు. భారత్-22కు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సంస్థ ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించనుంది.

భారత్ 22లో చేర్చిన కంపెనీల వివరాలు (రంగాలవారీగా)

రంగం	చేర్చిన కంపెనీలు	ఈటీఎఫ్‌లో వెయిటేజీ (%)
ఎనర్జీ	ఓఎన్‌జీసీ, ఐవోసీ, బీపీసీఎల్, కోల్ ఇండియా	17.5
ఫైనాన్స్	ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇండియన్ బ్యాంక్	20.3
ఇండస్ట్రియల్	ఎల్ అండ్ టీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్, ఎన్‌బీసీసీ	22.6
ఎఫ్ఎంసీజీ	ఐటీసీ	15.2
యుటిలిటీ	పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, గెయిల్, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ లిమిటెడ్, ఎస్‌జేవీఎన్	20.0
బేసిక్ మెటీరియల్స్	నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్	4.4

నాలుగు రక్షణ పీఎస్‌యూల్లో వాటా విక్రయం!



న్యూఢిల్లీ, ఆగస్టు 4: మరో నాలుగు ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్నది. రక్షణ విభాగానికి చెందిన నాలుగు సంస్థల్లో 25 శాతం వాటాను ఐపీవో ద్వారా విక్రయించాలని సంకల్పించింది. భారత్ డైనమిక్స్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్, మజాగాన్ డక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎల్)తో పాటు మిశ్రా ధాతు నిగామ్ లిమిటెడ్ (మిధానీ)లో 25 శాతం వాటా విక్రయానికి సంబంధించిన ప్రకటనలకోసం బిడ్డింగ్ దాఖలు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపం) దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 18లోగా బిడ్డింగ్ దాఖలు చేయాలని సూచించింది. ఈ నాలుగు రక్షణ రంగానికి సంబంధించిన సంస్థల్లో వాటాల విక్రయానికి ఏప్రిల్‌లోనే కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. మినీరత్న హోదా కలిగిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్)ను 1970లో ప్రారంభించారు. ప్రస్తుతం సంస్థ రక్షణ రంగానికి సంబంధించిన పరికరాలతోపాటు క్షిపణులను రూపొందిస్తున్నది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.563.24 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 1960లో ప్రారంభమైన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ నికర విలువ రూ.1,064.41 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల్లో వాటాలను విక్రయించడం ద్వారా కేంద్రం రూ.72,500 కోట్ల నిధులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

పీఎస్‌బీల విలీన ప్రతిపాదనేదీ లేదు

లోక్‌సభకు తెలిపిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ,ఆగస్టు 4: ప్రస్తుతానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఎస్‌బీఐలో ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్‌ను విలీనం చేసిన నేపథ్యంలో మరిన్ని పీఎస్‌బీల్లో విలీనాలు జరుగవచ్చని మార్కెట్లో ఊహాగానాలు జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. సభలో అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. డిపాజిట్లపై సర్‌చార్జ్ విధించే ప్రతిపాదనేదీ లేదని ఆర్బీఐ తెలిపిందని గంగ్వార్ అన్నారు. ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ.. డిసెంబర్ 31, 2016తో ముగిసిన తొమ్మిది నెలల్లో ప్రభుత్వ సెక్యూరిటీల్లో రూ.1.84 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టిందన్నారు. అదేకాలానికి ఈక్విటీ షేర్లలో రూ.29,152 కోట్లు, ప్రభుత్వేతర రుణ పథకాల్లో మరో రూ.27,482 కోట్లు ఇన్వెస్ట్ చేసిందన్నారు. ఆ తొమ్మిది నెలల్లో సంస్థ మార్కెట్ పెట్టుబడులపై రూ.13,927 కోట్ల లాభాలను స్వీకరించిందన్నారు. గతనెల 28నాటి ముద్ర పథకం ద్వారా 8.56 కోట్ల మందికి రుణాలు జారీ చేయడం జరిగిందన్నారు.

బిట్‌కాయిన్‌లపై నియంత్రణ లేదు

మన దేశంలో బిట్‌కాయిన్‌తోపాటు ఇతర వర్చువల్ కరెన్సీల నియంత్రణకు ఇప్పటివరకు ఎలాంటి నియమావళిని ప్రవేశపెట్టలేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు. వర్చువల్ కరెన్సీల నిర్వహణకు ఇంతవరకు దేశంలో ఏ కంపెనీకి ఆర్బీఐ లైసెన్సు ఇవ్వలేదన్నారు. అయితే, మన దేశంలోనూ బిట్‌కాయిన్‌తోపాటు ఇతర క్రిప్టో కరెన్సీల ద్వారా లావాదేవీలు జరుగుతున్నట్లు ఆధారాలున్నాయన్నారు. గడిచిన కొన్నేండ్లలో భారత్‌లో బిట్‌కాయిన్ మార్కెట్ గణనీయంగా పెరిగిందన్నారు.

ఆంధ్రాబ్యాంక్ లాభం రూ.40 కోట్లు



హైదరాబాద్, ఆగస్టు 4: హైదరాబాద్ కేంద్రంగా ఆర్థిక సేవలు అందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ ఆంధ్రాబ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.40.42 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.31.08 కోట్ల లాభంతో పోలిస్తే 30 శాతం వృద్ధి కనబరిచింది. మొండి బకాయిలు పెరిగినప్పటికీ లాభాల్లో వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. సమీక్షకాలంలో రూ.5,155.21 కోట్ల ఆదాయాన్ని గడించింది. వీటిలో వడ్డీల ద్వారా రూ.4,402 కోట్ల ఆదాయం సమకూరగా, ఇతర మార్గాల ద్వారా రూ.753 కోట్లు లభించాయి. నికర వడ్డీ మార్జిన్ 3.12 శాతంగా నమోదైంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) విలువ అడ్వాన్స్‌లో 13.33 శాతానికి(రూ.19,428.04 కోట్లు) చేరుకున్నాయి. గతేడాది ఇది 10.30 శాతంగా ఉంది. నికర ఎన్‌పీఏ 6.21 శాతం నుంచి 8.90 శాతానికి(రూ.11,120.24 కోట్లు) పెరిగింది. సమీక్షకాలంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.1,329 కోట్ల స్థాయిలో నిధులను వెచ్చించింది. రూ.7,033.02 కోట్ల రుణాలను పునర్‌వ్యవస్థీకరించింది. కాసా డిపాజిట్లు 24.48 శాతం పెరిగి రూ.58,615 కోట్లకు చేరుకోవడం లాభాల్లోకి రావడానికి కారణమైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. తొలి త్రైమాసికంలో రిటైల్ రంగానికి రూ.29,327 కోట్ల స్థాయిలో రుణాలు ఇవ్వగా.. రూ.27,919 కోట్ల వ్యవసాయ రుణాలు, ఎంఎస్ఎంఈకి రూ.28,327 కోట్ల మేర ఇచ్చినట్లు పేర్కొంది. గడిచిన త్రైమాసికం చివరి నాటికి బ్యాంక్ వ్యాపారం 5.89 శాతం పెరిగి రూ.3,34,073 కోట్లకు చేరుకుంది. దీంట్లో డిపాజిట్లు 5.61 శాతం పెరిగి రూ.1,88,272 కోట్లకు చేరుకోగా, అడ్వాన్స్‌లు 6.25 శాతం ఎగబాకి రూ.1,45,,801 కోట్లకు చేరుకున్నాయి.

మహీంద్రా లాభాల్లో నిస్తేజం

క్యూ1లో 20 శాతం తగ్గిన ప్రాఫిట్

ముంబై, ఆగస్టు 4: దేశీయ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా నిరాశాజనక ఫలితాలను నమోదు చేసుకున్నది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ రూ.765.96 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.954.95 కోట్ల లాభంతో పోలిస్తే 19.79 శాతం క్షీణత కనబరిచింది. అమ్మకాల్లో నిస్తేజం కారణంగా ఫలితాలపై ప్రభావం చూపిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.29 శాతం పెరిగి రూ.12,335.56 కోట్లకు చేరుకున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలంలో కంపెనీ 1,12,293 యూనిట్ల వాహనాలను, 81,270 యూనిట్ల ట్రాక్టర్లను విక్రయించింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీతో కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు ముందుగానే మళ్లించడంతో గడిచిన త్రైమాసికంలో ఆటోమొబైల్ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొందని కంపెనీ వెల్లడించింది. వీటితోపాటు ప్యాసింజర్ వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టడం, ధరలు తగ్గడం, బీఎస్-3 ప్రమాణాలతో తయారైన వాహనాలపై నిషేధం విధించడం తదితర కారణాలు ఆటోమొబైల్ పరిశ్రమపై ప్రభావం చూపాయి. దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది ట్రాక్టర్ల అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని అవుట్‌లుక్‌లో పేర్కొంది. కంపెనీ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.1,418.10 వద్ద స్థిరపడింది.

హెచ్‌పీసీఎల్‌కు ఇన్వెంటరీ నష్టాల సెగ

క్యూ1లో 56 శాతం తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: దేశంలో రెండో అతిపెద్ద ఇంధన విక్రయ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆర్థిక ఫలితాలకు ఇన్వెంటరీ నష్టాల సెగ తగిలింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలంలో సంస్థ రూ.925 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.2,098 కోట్ల లాభంతో పోలిస్తే 56 శాతం పతనం చెందింది. గడిచిన త్రైమాసికంలో రూ.1,595 కోట్ల స్థాయిలో ఇన్వెంటరీ నష్టం సంభవించినట్లు హెచ్‌పీసీఎల్ సీఎండీ ఎంకే సురాణా తెలిపారు. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో బ్యారెల్ ఇంధనాన్ని శుద్ధి చేయడం ద్వారా 5.86 డాలర్ల ఆదాయం సమకూరిందని, అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన 6.83 డాలర్లతో పోలిస్తే తగ్గిందని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఉత్పత్తి, మార్కెటింగ్ చేయడానికి మధ్య ధరల్లో వ్యత్యాసం నెలకొనడాన్ని ఇన్వెంటరీ నష్టంగా వ్యవహరిస్తారు. తొలి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.51,600 కోట్ల స్థాయి నుంచి రూ.59,891 కోట్లకు చేరుకుంది. ముంబై, వైజాగ్‌లలో ఉన్న చమురు క్షేత్రాల్లో 4.49 మిలియన్ టన్నుల క్రూడాయిల్‌ను వెలిక్కి తీసింది. నూతనంగా 84 పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయడంతో మొత్తం అవుట్‌లెట్ల సంఖ్య 14,495కి చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి రూ.7,100 కోట్ల స్థాయిలో పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది.

ఖేల్

బార్సిలోనాకు నెయ్‌మార్ గుడ్‌బై



పారిస్: బ్రెజిల్ స్టార్ స్ట్రయికర్ నెయ్‌మార్.. బార్సిలోనా ఫుట్‌బాల్ క్లబ్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇక నుంచి ఫ్రెంచ్ క్లబ్ 'పారిస్ సెయింట్ జర్మన్ (పీఎస్‌జీ)'కు అతను ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఏడాదికి రూ. 203 కోట్లు చెల్లించే విధంగా ఐదేండ్ల కాలానికి పీఎస్‌జీతో ఒప్పందం చేసుకున్నాడు. అయితే నెయ్‌మార్‌ను కొనుగోలు చేయడానికి 'కొనుగోలు నిబంధనల' ప్రకారం పీఎస్‌జీ దాదాపు రూ. 1703 కోట్లను బార్సిలోనాకు చెల్లించింది. సాకర్ ప్రపంచంలో ఇదే అతిపెద్ద ఒప్పందం. పీఎస్‌జీతో ఒప్పందం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని నెయ్‌మార్ అన్నాడు. కొత్త సహచరులకు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పాడు.

రైలు ప్రమాదంలో హాకీ ప్లేయర్ మృతి




జ్యోతి

చండీగఢ్: జాతీయస్థాయి హాకీ క్రీడాకారిణి జ్యోతి గుప్తా రైలు ప్రమాదంలో మరణించింది. హర్యానాలోని రేవారీలో పట్టాలు దాటుతుండగా చండీగఢ్-జైపూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో 20 ఏండ్ల జ్యోతి అక్కడికక్కడే మృతిచెందింది. రైల్వే పోలీస్ అధికారి రణ్‌వీర్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో దీన్ని ధృవీకరించాడు. అయితే ఘటన స్థలంలో ఎలాంటి సూసైడ్ లెటర్ లభించలేదని సింగ్ తెలిపాడు. తన పేరులో తప్పును సరిచేసుకోవడానికి రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయానికి వెళుతున్నట్లు జ్యోతి తమకు చెప్పిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న కూతురు మరణం పట్ల వాళ్లు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

ఆసియా సెమీస్‌లో అంకిత్, అక్షయ్

న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అంకిత నార్వల్(57కి), అక్షయ్ సివాచ్(60కి) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. దీంతో టోర్నీలో కనీసం కాంస్య పతకం ఖరారు చేసుకున్న బాక్సర్ల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. ఫిలిప్పిన్స్ వేదికగా శుక్రవారం జరిగిన వేర్వేరు క్వార్టర్స్ బౌట్లలో అంకిత్..3-2తో దిమిత్రి బర్మిన్(కజకిస్థాన్)పై గెలువగా, అక్షయ్..లిన్ యు(చైనీస్ తైపీ)పై అలవోక విజయాన్నందుకున్నాడు. సీలేయ్ సాయ్(46కి), అమన్‌న గంగాస్(54కి) అకాశ్ సాయి(66కి) క్వార్టర్స్‌లో ఓడిపోయారు.

దీపిక, జోష్న జోడీకి కాంస్యం




దీపిక

మాంచెస్టర్: ప్రపంచ స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ జోడీ దీపిక పల్లికల్, జోష్న చినప్ప కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో రెండో సీడ్ భారత ద్వయం 11-6, 6-11, 8-11 తేడాతో బ్రిటన్ జోడీ జెన్నీ డంక్లాఫ్, అలీసన్ వాటర్స్ చేతిలో ఓటమిపాలైంది. తొలి సెట్‌ను అలవోకగా కైవసం చేసుకున్నప్పటికీ ప్రత్యర్థి పుంజుకోవడంతో మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సౌరవ్ ఘోశల్, దీపిక జోడీతో పాటు విక్రమ్ మల్హోత్ర, జోష్న చినప్ప ద్వయం క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది.

ముగిసిన భారత పోరు

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్‌లో భారత షట్లర్ల పోరు ముగిసింది. శుక్రవారం జరిగిన వేర్వేరు క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ల్లో హెచ్ఎస్ ప్రణయ్, సౌరభ్ వర్మ ఓడిపోయారు. గత నెలలో యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచి జోరు మీద కనిపించిన ప్రణయ్..అదే దూకుడు కొనసాగించడంలో ఒకింత విఫలమయ్యాడు. గంటపాటు జరిగిన హోరాహోరీ క్వార్టర్స్‌లో ప్రణయ్ 10-21, 22-20, 21-23 తేడాతో 11వ సీడ్ లిన్ యు సీన్(చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. మరో క్వార్టర్స్‌లో సౌరభ్ వర్మ 19-21, 16-21 తేడాతో లీ చుక్ యు(హాంకాంగ్)పై ఓడాడు. 42 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో వర్మ వరుస సెట్లలో ప్రత్యర్థికి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు.



హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో అధికార లాంఛనాలతో శాస్త్రవేత్త భార్గవ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) భార్గవ

అధికార లాంఛనాలతో

శాస్త్రవేత్త భార్గవ అంత్యక్రియలు

సీఎం ఆదేశాలతో ఏర్పాట్లు.. ప్రముఖుల నివాళి
సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కొండాపూర్: ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ పుష్పమిత్ర భార్గవ అంత్యక్రియలను శుక్రవారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్.. భార్గవ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో సీసీఎంబీ ఏర్పాటు, కణ జీవశాస్త్రంలో భార్గవ చేసిన కృషి అపారమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. భార్గవ ఈ నెల 1వ తేదీన మరణించగా.. అంత్యక్రియలను శుక్రవారం రాయదుర్గంలోని మహాప్రస్థానంలో నిర్వహించారు. పార్థివదేహానికి సీపీఐ నేత నారాయణ, సీపీఎం నేత వీరభద్రం, అజీజ్‌పాషా, కల్పనా కన్నబిరాన్, బయోమెట్రిక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి, సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్ లాల్జిసింగ్, ప్రొఫెసర్ రమా మెల్కోటె, వైద్యులు కాకర్ల సుబ్బారావు, విద్యావేత్త చుక్కా రామయ్య, వేదకుమార్, వినయ్, డాక్టర్ గేయానంద్, నూకరాజు, శాస్త్రి, బాలసుబ్రమణ్యం, టీ రమేశ్, సుద్దాల అశోక్‌తేజ, ఏలె లక్ష్మణ్, బీఎన్‌రెడ్డి, సత్యప్రసాద్, వహీద్, రామలింగారెడ్డి, మన్నె నర్సింహారెడ్డి తదితరులు నివాళులర్పించారు. భార్గవ పిల్లలు మోహిత్, వనితా భట్టాచార్యను పరామర్శించారు.

చేవెళ్లలో నేడు టీటా ఉద్యోగమేళా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేవెళ్లలోని ప్రగతిభవన్‌లో శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార మక్తాలా తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో చేవెళ్ల ప్రోగ్రెసివ్ యూత్ క్లబ్‌తో కలిసి మేళాను నిర్వహిస్తున్నారు. ఐటీ, ఇతర రంగాల్లో ఉద్యోగాలను ఆశించే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటా కోరింది.

ఆన్‌లైన్‌లోనే రోడ్డు కటింగ్ అనుమతులు

ఆగస్టు 1 నుంచే అమల్లోకి.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇక నుంచి రహదారులను ఎడాపెడా తవ్వేయడానికి వీల్లేదు. అనుమతులు సైతం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకున్నాకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ రోడ్డు కటింగ్‌పై విధివిధానాలను తెలియజేశారు. ఈ ఉత్తర్వులు ఆగస్టు 1 నుంచే అమలులోకి వచ్చినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక ఆరు రోజుల్లో సంబంధిత ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఒక్కరోజులో అనుమతి సర్టిఫికెట్‌ను మంజూరుచేస్తారు. రోడ్డు ఎందుకు తవ్వుతున్నారు? వ్యక్తిగత ప్రయోజనమా? సామాజిక అవసరమా? అనేదానిపై పూర్తిస్థాయి సర్టిఫికెట్లు దరఖాస్తుతో పాటు జతచేయాలి. రోడ్డు ఏ ప్రాంతంలో ఉన్నది? ఏ రకమైన రోడ్డు? చిరునామా వివరంగా పేర్కొనాలి. దీనికి నిర్ధారిత రుసుము కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనుమతులకు సంబంధించి ఫోన్‌కు సంక్షిప్త సందేశం పంపిస్తారు.

రోడ్డు కటింగ్ ఫీజుల వివరాలు

రోడ్డు రకం	చార్జీలు
సీసీ రోడ్లు	రూ. 1,844
బీటీ రోడ్లు	రూ. 2,275
ఫుట్‌పాత్‌లు	రూ. 799
బెర్మ్/ డబ్ల్యూబీఎం	రూ. 285
రోడ్డుకు మట్టికట్ట అవతల (గ్రామీణంలో)	రూ. 156
రోడ్డుకు మట్టికట్ట అవతల (పట్టణాల్లో)	రూ. 195

కాంగ్రెసోళ్లే ముక్కు నేలకురాయాలి


లక్ష గుంజీలు తీసి క్షమాపణ చెప్పాలి ● తప్పుడు కేసులు వేసినందుకు అదే శిక్ష
ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, విప్ వెంకటేశ్వర్లు ఫైర్ ● యముడే వచ్చినా కేసీఆర్ భయపడరని వ్యాఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'ప్రాజెక్టులను నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేసే ప్రయత్నంచేస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు లక్ష్యానికి విరుద్ధంగా అభివృద్ధికి అడ్డుపడి కేసులు వేయిస్తున్న కాంగ్రెస్ నేతలు జానారెడ్డి సహా ఇతర నేతలే ముక్కు నేలకురాయాలి. లక్ష గుంజీలు తీసి ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మండలిలో ప్రభుత్వ విప్ బీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఇంగిత జ్ఞానంలేకుండా రెండు నెలలుగా సీఎం కేసీఆర్ కుటుంబమే లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహంవ్యక్తంచేశారు. జానారెడ్డి, ఇతర నాయకుల ముఖాల్లో ప్రేతకళ కనిపిస్తున్నదన్నారు. ప్రతిపక్షంగా ఏనాడైనా అధికారపక్షానికి సహకరించారా? సంయమనం ఎప్పుడు పాటించారు? అని ప్రశ్నించారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వాన్ని తప్పుపట్టిన చరిత్ర మీదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఎవరికీ భయపడలేదని, యముడే వచ్చినా ఆయనలో భయం కనిపించదని అన్నారు. చావుకు ఎదురొడ్డి తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేసిన చరిత్ర ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. రాజకీయ జీవితం అంధకారం అవుతున్నదనే భయంతోనే కాంగ్రెస్‌నేతలు జ్ఞానం కోల్పోయి విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కుంభకోణాల చరిత్ర ప్రజలకు తెలుసని చెప్పారు. లారీ ప్రమాదంలో ఒకరు చనిపోతే, లారీలను తగులబెట్టి, కేసుకు కులం రంగు ఆపాదించి దేశ సమస్యగా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అప్పుడు భాష గుర్తుకురాలేదా?

నేరెళ్ల ఘటనపై పీసీసీ అధికార ప్రతినిధులు గాంధీభవన్ వేదికగా మాట్లాడుతూ సిరిసిల్ల ఎస్పీ విశ్వజిత్, మంత్రి కేటీఆర్‌ను తన్నుతాం, చంపుతామన్నప్పుడు జానారెడ్డి, ఇతర నేతలకు భాష గుర్తుకురాలేదా? ప్రాజెక్టులపై 196 కేసులు వేసి అభివృద్ధికి ఎందుకు అడ్డుపడుతున్నారు? అని కర్నె ప్రశ్నించారు. అమరవీరుల స్తూపం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నిస్తే మర్రి శశిధర్‌రెడ్డి కేసులు వేయలేదా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కొల్లాపూర్ ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి, కామారెడ్డి సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డి కూతురు రచనారెడ్డి ప్రాజెక్టులపై కేసులు వేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు త్వరలో వీఆర్‌ఎస్ తీసుకోవాల్సి వస్తుందని మండలిలో ప్రభుత్వ విప్ బీ వెంకటేశ్వర్లు జోస్యం చెప్పారు. రెండు నెలలుగా సీఎం కేసీఆర్ స్పందించాలని కాంగ్రెస్ నేతలే కోరారని, ఇప్పుడు స్పందిస్తే తట్టుకోలేకపోతున్నారన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించకుండా కారుకూతలు కూస్తున్నారని మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో విప్ బీ వెంకటేశ్వర్లు

పోత్గల్ పాపం ఎవరిది?

కాంగ్రెస్ కౌన్సిలర్‌గా పోటీచేసి ఓడిపోయిన సయ్యద్ సమద్ ఇసుక లారీ ఢీకొట్టడంతో మూడు రోజుల కిందట సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో దళితుడు శంకరయ్యను మృతిచెందాడని కర్నె గుర్తుచేశారు. లారీడ్రైవర్ శ్రీనివాస్‌గౌడ్.. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బంధువు, శిష్యుడని తెలిపారు. ప్రమాదం జరుగగానే ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రాములును పొన్నం ప్రభాకర్ పోలీస్‌స్టేషన్‌కు పంపి, శ్రీనివాస్‌గౌడ్‌ను విడిపించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇవేమీ తెలుసుకోకుండానే కాంగ్రెస్ నాయకులు, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులదే ఇసుక మాఫియా అంటారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు ఇసుక మాఫియాకు అర్థం చెప్పాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేస్తే మాఫియా అంటారని, ఏడాదికి రూ.400నుంచి రూ.500కోట్ల ఆదాయం వచ్చేలా చేస్తే మాఫియా ఎలా అవుతుందో చెప్పాలని నిలదీశారు.

రాష్ట్రంలో ఎకో-సెన్సిటివ్ జోన్ల ఏర్పాటు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

- కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం, శివ్వారం
- హరిణవనస్థలి, మృగవని, మంజీర, పోచారం,
- ప్రాణహిత అభయారణ్యాలు, పార్కుల చుట్టూ జోన్ల పరిధి నిర్ధారణ
- తుది నోటిఫికేషన్లు జారీచేసిన కేంద్రం

రాష్ట్రంలోని అభయారణ్యాలు, జాతీయపార్కుల చుట్టూ ఎకో-సెన్సిటివ్ జోన్ల (పర్యావరణ సున్నిత ప్రాంతాలు) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్లను విడుదల చేసింది. కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం, మంజీర, పోచారం, ప్రాణహిత, శివ్వారం, హరిణవనస్థలి, మృగవని జాతీయపార్కుల చుట్టూ సున్నిత ప్రాంతాల పరిధిని కేంద్రం అధికారికంగా నిర్ధారించింది. హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్‌పార్కుతోపాటు అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం, ఆదిలాబాద్ కవ్వాల్ టైగర్ రిజర్వుల సెన్సిటివ్ జోన్ల పరిధి త్వరలో ఖరారు చేయనున్నది. కేబీఆర్ పార్కు చుట్టూ 3 నుంచి 26 మీటర్ల వరకున్న ప్రాంతాన్ని ఎకో-సెన్సిటివ్ జోన్ పరిధిలోకి తేవాలని రాష్ట్ర అధికారులు తాజాగా నిర్ణయించారు. కేబీఆర్ పార్కు చుట్టూ 3నుంచి 8మీటర్ల వరకు సున్నిత ప్రాంతంగా ప్రకటించే అవకాశమున్నా వివాదాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పాత జిల్లాల ప్రకారం సెన్సిటివ్ జోన్ల వివరాలు:

రాష్ట్రంలో ప్రస్తుతం తొమ్మిది అభయారణ్యాలు, మూడు జాతీయపార్కులున్నాయి. చాలా వరకు అడవులు తరిగిపోయి, చుట్టూ జనావాసాలు పెరిగిపోవడం వల్ల పది కిలోమీటర్ల వరకు సెన్సిటివ్ జోన్ల ఏర్పాటు సాధ్యం కాదని గతంలోనే అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కిన్నెరసాని అభయారణ్యం చుట్టూ తూర్పు నుంచి పడమర వరకు ఒక కిలోమీటరు నుంచి 17 కిలోమీటర్ల వరకు సున్నితమైన జోన్‌గా ప్రకటించారు. వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం చుట్టూ 3నుంచి 10కిలోమీటర్ల వరకు, ఇదే జిల్లాలోని పాకాల అభయారణ్యంతోపాటు మెదక్ జిల్లాలోని మంజీర, పోచారం అభయారణ్యాలు, ఆదిలాబాద్ జిల్లా ప్రాణహిత, రంగారెడ్డి జిల్లా చిలుకూరు మృగవని జాతీయ పార్కు చుట్టూ 3నుంచి 5కిలోమీటర్ల వరకున్న ప్రాంతాలను, మహావీర్ హరిణ వనస్థలి చుట్టూ రెండు కిలోమీటర్ల వరకున్న ప్రాంతాన్ని ఎకో-సెన్సిటివ్ జోన్లుగా పరిగణిస్తూ కేంద్రం తుది నోటిఫికేషన్లను విడుదల చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నది. ఆయా జిల్లా కలెక్టర్లు జోనల్ మాస్టర్ ప్లాన్లు,మేనేజ్‌మెంట్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

ఎందుకీ సెన్సిటివ్ జోన్లు?

దేశవ్యాప్తంగా చాలావరకు అభయారణ్యాలు, అడవులు కబ్జాకు గురికావడం, జనావాసాలు పెరిగిపోవడం వల్ల వన్యప్రాణులకు రక్షణ కరువవుతున్నది. రక్షిత ప్రాంతాలలో మనుషుల ప్రవేశం పెరిగి వన్యప్రాణుల జనావాసాల్లోకి పరుగులు తీస్తున్నాయి. దీంతో చాలాచోట్ల జంతు, జనజీవన సంఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అభయారణ్యాలు, రక్షిత ప్రాంతాల చుట్టూ దాదాపు 10 కిలోమీటర్ల వరకున్న ప్రదేశాలను పర్యావరణ సున్నిత ప్రాంతాలుగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే మొదట్లో దీనిపై చాలా రాష్ట్రాలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. జనావాసాలు పెరిగిపోయి, పట్టణాలు అభివృద్ధి చెందిన క్రమంలో ప్రతి అభయారణ్యం చుట్టూ 10కిలోమీటర్ల వరకు సెన్సిటివ్ జోన్‌ను ప్రకటించడం సాధ్యంకాదని పేర్కొన్నాయి. దాంతో ఆయా ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా ఎంత మేరకు సున్నిత ప్రాంతాలుగా ప్రకటిస్తారనే విషయంపై వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని సుప్రీంకోర్టు సూచించింది. లేకపోతే అభయారణ్యాల చుట్టూ 10కిలోమీటర్ల వరకున్న ప్రాంతాల్ని సున్నిత ప్రాంతాలుగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీంతో తెలంగాణతోపాటు అన్ని రాష్ట్రాలు ఆ మేరకు ప్రతిపాదనలు పంపాయి. ఎకో-సెన్సిటివ్ జోన్లలో జన సంచారం, ఇతర సాధారణ కార్యక్రమాలకు అభ్యంతరాలుండవు. కానీ గనుల తవ్వకం, ప్రాజెక్టులు వంటి భారీ నిర్మాణ పనులకు అనుమతి ఉండదు. జోన్ల పరిధిలో పెద్ద ఎత్తున రోడ్లు వేయాలన్నా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

పైరవీల అడ్డాగా యూఎల్సీ

పది నెలలక్రితం విభాగాన్ని రద్దు చేసినా చంద్రవిహార్‌ను వదలని అధికారులు

పట్టించుకోని జిల్లా కలెక్టర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) విభాగాన్ని రద్దుచేసి పది నెలలు దాటింది. యూఎల్సీ ఫైళ్లను ఫైనల్‌చేసే అధికారాన్ని ఆయా జిల్లా కలెక్టర్లకే అప్పగించింది. సంబంధిత అధికారులను ఆయా జిల్లా కలెక్టర్ల కింద పని చేయాలంటూ అటాచ్ కూడా చేశారు. అయినప్పటికీ యూఎల్సీ అధికారులు చంద్రవిహార్ భవనంలోని కార్యాలయాన్ని, ఆ ఫైళ్లను వదులడంలేదు. పైగా యూఎల్సీలో దందాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. యూఎల్సీ ఫైళ్లను ప్రభుత్వమే నేరుగా క్లియర్ చేయడంకోసం పాత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు కలిపి ప్రత్యేకంగా యూఎల్సీ విభాగాన్ని ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటుచేశారు. యూఎల్సీ అంటేనే దందాలు, పైరవీలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు అప్పట్లోనే పెద్ద ఎత్తున వచ్చాయి. రెండు జిల్లాలకు కలిపి యూఎల్సీ ఫైళ్లు చూసేందుకు ఈ కార్యాలయానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌స్థాయి అధికారిని అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. యూఎల్సీ అధికారి సంబంధిత ఫైళ్లను పరిశీలించి ప్రభుత్వానికి రికమండ్ చేసేవారు. క్రమంగా ఇదంతా ఒక పెద్ద ప్రహసనంగా మారింది. పైరవీలు, దందాలకు అడ్డాగా మారింది. కలెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడ కొంతమంది రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇదంతా గుర్తించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. పైరవీలకు తావులేకుండా వ్యవస్థ పారదర్శకంగా ఉండేందుకు యూఎల్సీ విభాగాన్ని రద్దుచేశారు. సంబంధిత ఫైళ్లను ఆయా జిల్లా కలెక్టర్లకు అటాచ్‌చేశారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న యూఎల్సీ కార్యాలయంలోని ఆయా డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఇతర సిబ్బంది సుమారు 70 మందిని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు బదిలీచేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లకు రిపోర్ట్ చేసి, కలెక్టర్ కార్యాలయాల్లోనే ఉండాలని నిర్దేశించారు. ఇవన్నీ జరిగి పది నెలలవుతున్నది. కానీ దందాలు, పైరవీలకు అలవాటు పడిన కొందరు.. కావాలని కలెక్టర్లకు దూరంగా ఉండడం కోసం రకరకాల కారణాలు చూపి చంద్రవిహార్‌లో ఉన్న యూఎల్సీ కార్యాలయాన్ని పట్టుకొని వేలాడుతున్నారని, ఈ కార్యాలయాన్ని దందాలకు నిలయంగా మార్చారని ఆరోపణలు వస్తున్నాయి. ఫైళ్లు, సిబ్బంది చంద్రవిహార్‌లో ఉంటే.. కలెక్టర్లు మాత్రం కలెక్టరేట్ కార్యాలయాల్లో వారి రెగ్యులర్ పనుల్లో తలమునకలై ఉంటున్నారు. కలెక్టర్లు అడిగితే సంబంధిత డిప్యూటీ కలెక్టర్లు ఫైళ్లు తీసుకొని వెళతారని, వీరు వెళ్లే సమయానికి కలెక్టర్లు అందుబాటులో ఉంటే సంతకం.. లేకుంటే అంతే సంగతులన్న తీరుగా ఉందని అంటున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాల ప్రకారం నిత్యం బిజీగా ఉంటే కలెక్టర్లు దీనిపై దృష్టి సారించకపోవడంతో యూఎల్సీ అధికారులు ఆడింది ఆట.. పాడింది పాట అన్న తీరుగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి జిల్లాలకు కేటాయించిన ఫైళ్లను, అధికారులను ఆయా జిల్లాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంకు కాంట్రాక్ట్ ఉద్యోగుల కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పును రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సంఘం అధ్యక్షుడు జగన్నాథంప్రవీణ్ అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 25,583 మంది కాంట్రాక్ట్, 80వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు బాగుపడుతాయన్నారు. సీఎంకు కృతజ్ఞతగా అన్నీ జిల్లాల్లో సభలు ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఎంబీసీల ఆర్థికప్రగతికి సర్కారు కృషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబడిన కులాలు(ఎంబీసీ) ఆర్థిక ప్రగతి సాధించడంకోసం ఎంబీసీ కార్పొరేషన్ పనిచేస్తున్నదని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ కమిషన్ కార్యాలయంలో ఎంబీసీ సంక్షేమసంఘం ప్రతినిధులు బీసీ కమిషన్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. విద్య, న్యాయ, పరిపాలనా శాఖల్లో బీసీ ఏ, ఎంబీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, అభ్యర్థులు లేకుంటే బ్యాక్‌లాగ్ పోస్టులుగా ప్రకటించాలని ఎంబీసీ ప్రతినిధులు కోరారు. జ్యోతిరావు పూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుచేయాలని, ఉద్యోగాల్లో, పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల పరిధిలో కులాల వారీగా ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులపై సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. బీసీ ఏతోపాటు, బీసీ బీ, సీ, డీ గ్రూపుల్లోని అత్యంత వెనుకబడిన కుటుంబాలపై పరిశోధన జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. బీసీలో 8 కులాలు అసలే ఎదుగలేదని, ఏబీసీడీ వర్గీకరణ మార్చకుండానే ఎంబీసీలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

నేడు టీజీవో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) శనివారం భేటీ కానుందని టీజీవో అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని టీజీవో కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పదోన్నతులు, ఖాళీల భర్తీ, ఏపీలో పనిచేస్తున్న రాష్ట్ర ఉద్యోగులు, పదకొండో పీఆర్సీ ఏర్పాటు, కొత్త సర్వీసు నిబంధనలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

సెప్టెంబర్ 1న సామూహిక సెలవు

- నూతన పెన్షన్ విధానానికి నిరసన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పెన్షన్ విధానానికి నిరసనగా సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టబోతున్నామని తెలంగాణ రాష్ట్ర పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. ఈ మేరకు సంఘం నాయకులు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలిసి విజ్ఞాపన అందజేశారు. ఉద్యోగుల జీతం నుంచి 10శాతం, ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ 10శాతాన్ని షేర్‌మార్కెట్‌కు తరలించడంవల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల కష్టార్జితానికి గ్యారంటీ లేకుండాపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానం సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వచ్చినందున అదేరోజు నిరసన తెలుపనున్నామని చెప్పారు. పాత పెన్షన్‌దారులు కూడా తమకు సంఘీభావం తెలపాలని స్థితప్రజ్ఞ విజ్ఞప్తి చేశారు.

రాయితీల మంజూరు ఆన్‌లైన్‌లోనే

- 30 రోజుల్లో యజమానికి మంజూరుపత్రం
- నేటినుంచి అమలుచేయనున్న పరిశ్రమలశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిశ్రమలకు అందించే రాయితీలను ఇకపై ఆన్‌లైన్‌లో మంజూరు చేయనున్నారు. ఈ నిర్ణయం శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నది. ఇకపై ప్రతి పరిశ్రమ యజమానికి రాయితీలు, ప్రోత్సాహకాలకు సంబంధించి పరిశ్రమలశాఖకు దరఖాస్తు ఆన్‌లైన్‌లోనే చేసుకోవాల్సి ఉంటుంది. పరిశ్రమల యజమానులకు సులువుగా, పారదర్శకంగా రాయితీలను అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ విధానాన్ని శనివారం నుంచి అమలుచేయనున్నట్టు పరిశ్రమల శాఖ కమిషనర్ అహ్మద్‌నదీమ్ తెలిపారు. ఈవోడీబీ పరిధిలో ప్రతి సర్వీసు గరిష్ఠంగా 30 రోజుల్లో అందించాలని నిర్ణయించారు. 30 రోజుల గడువులోనే రాయితీ మంజూరు పత్రం యజమానికి అందజేయనున్నారు. రుణాల చెల్లింపులో, ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ సాయం పొందేందుకు మంజూరు పత్రాలు కీలకంగా మారనున్నాయి. టీఎస్‌ఐపాస్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడంతో పరిశ్రమల యజమానులకు మెరుగైన సేవలు అందించాలన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ఆదేశాలకు అనుగుణంగా ఆన్‌లైన్ విధానాన్ని పరిశ్రమలశాఖ అందుబాటులోకి తెచ్చింది. రాయితీల మంజూరులో కిందిస్థాయి సిబ్బంది, అధికారులు అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేస్తున్నారు. దరఖాస్తు చేసిన వారంరోజుల్లో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పరిశీలిస్తారు. అన్ని పత్రాలు సరిగా ఉంటే పరిశ్రమను తనిఖీచేసే తేదీని నిర్ణయించి కంపెనీ యజమాని మెయిల్‌కు, సెల్ నంబర్ సందేశం పంపుతారు. తనిఖీ నివేదికను రాష్ట్ర పరిశ్రమల శాఖకు పంపించాక, సంయుక్త సంచాలకులు పరిశీలించి అడిషనల్ డైరెక్టర్‌కు చేరవేస్తారు. అక్కడి నుంచి స్టేట్ లెవల్ కమిటీ (ఎస్సెల్సీ)ఆమోదానికి పంపిస్తారు. అక్కడ ఆమోదముద్ర పడ్డాక పరిశ్రమ యజమానికి మంజూరు పత్రాన్ని ఆన్‌లైన్‌లో అందజేస్తారు. ఈ ప్రక్రియ దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన 15 రోజుల్లోగా యజమానుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతాయి. సూక్ష్మ పరిశ్రమలకు సంబంధించిన రాయితీలను జిల్లా స్థాయి కమిటీలో మంజూరు చేసే అధికారం ఉంది. శుక్రవారం వరకు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని జనరల్ మేనేజర్లను పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్‌నదీమ్ ఆదేశాలు జారీచేశారు. ఆన్‌లైన్ విధానంపై జిల్లా పరిశ్రమల కేంద్రాల జనరల్ మేనేజర్లకు శుక్రవారం హైదరాబాద్‌లోని పరిశ్రమలశాఖ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు సంచాలకుడు దేవానంద్, సంయుక్త సంచాలకుడు సురేశ్ పాల్గొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల లక్ష్యాన్ని వివరించి సందేహాలను నివృత్తి చేశారు.

ఐదేండ్లకుపైగా పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- దిగువ కోర్టుల న్యాయాధికారులు రోజువారీ వివరాలను తెలియజేయాలి: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని దిగువ న్యాయస్థానాల్లో ఐదేండ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ఉమ్మడి హైకోర్టు చర్యలుచేపట్టింది. పాత పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని దిగువ కోర్టుల్లో పనిచేసే న్యాయాధికారులకు ఇప్పటికే స్పష్టంచేసిన ఉమ్మడి హైకోర్టు.. తాజాగా ఐదేండ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను 2018 మార్చి 31వ తేదీ నాటికి జీరోస్థాయికి తీసుకురావాలని తేల్చిచెప్పింది. రోజువారీగా పెండింగ్ కేసుల పరిష్కారంపై న్యాయాధికారులకు మార్గదర్శకాలను జారీచేసింది. ఐదేండ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు.. రోజువారీగా పెండింగ్ కేసుల విచారణ చేపట్టి, పరిష్కారం చేసిన కేసుల వివరాలను తమకు అందించాలని పేర్కొన్నది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఆదేశాలమేరకు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ వెంకటేశ్వర్‌రెడ్డి.. దిగువ కోర్టుల న్యాయాధికారులకు సమాచారం అందించారు. హైకోర్టు వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా రూపొందించిన డైలీ డిస్పోజల్స్ ఆఫ్ జ్యుడీషియల్ ఆఫీసర్ లింక్‌లో రోజువారీగా న్యాయాధికారులు తాము పరిష్కరించిన కేసుల వివరాలను సాయంత్రం ఆరుగంటలలోగా నమోదుచేయాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కేసుల పరిష్కారం వివరాలను నేరుగా హైకోర్టుకు తెలియజేసే ప్రక్రియను ఈ నెల 7 నుంచి ప్రారంభించనున్నారు.

దీక్ష విరమించిన 'ఉద్యాన' విద్యార్థులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యానశాఖలో పోస్టులు భర్తీచేయాలని కోరుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ విద్యార్థులు చేపట్టిన దీక్షను శుక్రవారం విరమించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఉద్యాన, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఉపకులపతి, వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి హామీ ఇవ్వటంతో విద్యార్థులు దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యాన రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వివిధ హోదాల్లో నియామకాలు చేపడుతామని పార్థసారథి వారికి వివరించారు. ఆందోళన విరమించిన నేపథ్యంలో శనివారం, ఆదివారాలు ప్రిపరేషన్ హాలీడేస్ ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. సోమవారం నుంచి యూజీ, పీజీ, పీహెచ్‌డీ పరీక్షలు, తరగతులు ఉంటాయన్నారు.

యాజమాన్యాలకు
ఇంటర్వ్యూ అవకాశం ఇవ్వొద్దు
జీవో 13ను రద్దుచేయాలంటూ హైకోర్టులో పిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వృత్తి విద్యా కళాశాలల్లో బీ క్యాటగిరీ సీట్లభర్తీలో భాగంగా విద్యార్థులను కాలేజీ యాజమాన్యాలు ఇంటర్వ్యూకు అవకాశం కల్పిస్తూ 2014లో జారీచేసిన జీవో 13ను రద్దుచేయాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. బీ క్యాటగిరీ, ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీ విధానంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా జారీచేసిన జీవో 13తో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని సరూర్‌నగర్‌కు చెందిన ఏఎస్పీఐఆర్‌ఈ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీ లక్ష్మారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలుచేశారు. సింగిల్‌విండో ద్వారా మెరిట్ విద్యార్థులతో బీ క్యాటగిరీ సీట్లను భర్తీచేయాలని సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ.. ఫీజుల చెల్లింపులో విద్యార్థుల ఆర్థికస్థోమత తెలుసుకునేందుకు వీలుగా కాలేజీ యాజమాన్యాలు ఇంటర్వ్యూకు తెరలేపి, క్యాపిటేషన్ ఫీజును డిమాండ్ చేస్తున్నాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్ కంటే ముందే పలు కాలేజీల్లో బీ క్యాటగిరీ సీట్లను భర్తీ చేసుకుంటున్నారని వివరించారు. ఒక్కో కోర్సుకు ఒక్కో కాలేజీలో రూ.20 లక్షల వరకు క్యాపిటేషన్ ఫీజును వసూలుచేయడంతో మెరిట్ విద్యార్థులు బీ క్యాటగిరీ, ఎన్‌ఆర్‌ఐ సీట్లలో అవకాశాన్ని కోల్పోతున్నారని వివరించారు. ప్రతివాదులుగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఉన్నత విద్యా స్టేట్ కౌన్సిల్ కార్యదర్శి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ తదితరులను పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: అగ్నిప్రమాదాల నివారణకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపకశాఖ రీజినల్ అధికారి పాపయ్య తెలిపారు. శుక్రవారం 98 చోట్ల అవగాహన సదస్సులు, మాక్‌డ్రిల్ నిర్వహించామని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో 10, కరీంనగర్‌లో 9, ఖమ్మంలో 7, నల్లగొండలో 10, మహబూబ్‌నగర్‌లో 10, నిజామాబాద్‌లో 9, వరంగల్‌లో 7, మెదక్‌లో 8, రంగారెడ్డిలో 14, హైదరాబాద్‌లో 14 చోట్ల సదస్సులు చేపట్టమన్నారు. ఈ సదస్సుల్లో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారని, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులు వివరించారని పేర్కొన్నారు.

మీడియా అకాడమీ భవన నిర్మాణానికి రూ.15 కోట్లు

ఐదు అంతస్తులతో నిర్మాణం.. డిజైన్ ఖరారయ్యాక టెండర్లు

హైదరాబాద్/ తెలుగుయూనివర్సిటీ, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు విడుదలచేసింది. ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ మీడియా అకాడమీ భవనం ఐదు అంతస్తులతో నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. భవనానికి సంబంధించి పలు మార్పుచేర్పులు చేయాలని సూచించినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి డిజైన్ ఖరారైన వెంటనే టెండర్లు పిలుస్తామని ఈఎన్సీ గణపతిరెడ్డి చెప్పారు. మీడియా అకాడమీలో ఉన్న పాత భవనం స్థానంలో కొత్తగా విశాలమైన భవనం నిర్మించేందుకు జర్నలిస్టు సంఘాలు ఎంతోకాలంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేయడంతో నిధులు మంజూరయ్యాయి. తమ అవసరాలకు అనుగుణంగా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేయడం పట్ల జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

తెలంగాణ మీడియా అకాడమీ భవన నిర్మాణం కోసం రూ.15 కోట్లు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 2015లో ప్రెస్ అకాడమీలో నిర్వహించిన మొదటి పాలకమండలి సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని పరిశీలించి తగు సూచనలు చేసి ప్రెస్ అకాడమీకి నూతన భవనం అవసరమని అభిప్రాయపడ్డారని అల్లం నారాయణ గుర్తుచేశారు. తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసిందని చెప్పారు. నూతనంగా నిర్మించబోయే మీడియా అకాడమీ భవనంలో జర్నలిస్టుల శిక్షణకు ఉపయోగపడే విధంగా విశాలమైన హాలు, కంప్యూటర్ శిక్షణకు ల్యాబ్, మినీ కాన్ఫరెన్స్ హాలు, పార్కింగ్ తదితర సౌకర్యాలతో నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ భవన నిర్మాణానికి రూ.15 కోట్లు కేటాయించడం పట్ల సీఎం కేసీఆర్‌కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) ప్రధాన కార్యదర్శి క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.



ఈ నెల 11న హైదరాబాద్‌లో జరుగనున్న తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా శుక్రవారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసి పెండ్లిపత్రికను అందజేస్తున్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి.

ఏఈఈ, అసిస్టెంట్ సర్జన్ల పరీక్షలు 27, 28కి వాయిదా

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఎగ్జామ్స్ దృష్ట్యా టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (నోటిఫికేషన్ నం.31/2017), వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (32/2017), ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ (33/2017) పోస్టులకు ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించే రాత పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు కూడా అవే తేదీల్లో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నది. వాయిదావేసిన పరీక్షలను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపింది.



టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తదితరులు

టెట్-2017 ఫలితాల విడుదల

- అర్హత సాధించిన 1,01,763 మంది అభ్యర్థులు
- పేపర్-1లో 57.37శాతం.. పేపర్-2లో 19.51శాతం మంది ఉత్తీర్ణత
- టాప్‌లో రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు
- విత్‌హెల్డ్‌లో 1,632 మంది ఫలితాలు
- దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్న పాఠశాల విద్యాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)-2017 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పేపర్-1లో 57.37 శాతం, పేపర్-2లో 19.51 శాతం ఉత్తీర్ణత నమోదైందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. జూలై 23న నిర్వహించిన టెట్-2017 రెండు పేపర్లలో కలిపి మొత్తం 1,01,763 మంది అర్హత సాధించినట్టు చెప్పారు. టెట్-2016 ఫలితాల కంటే ప్రస్తుతం పేపర్-1లో ఉత్తీర్ణత శాతం పెరుగగా, రెండో పేపర్‌లో తగ్గిందని పేర్కొన్నారు. 2016లో నిర్వహించిన టెట్ పేపర్-1లో 54.45 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా.. ప్రస్తుతం 57.37 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని, 2.92 శాతం మంది అభ్యర్థులు అధికంగా అర్హత సాధించారని తెలిపారు. టెట్ పేపర్-2లో గత ఏడాది 25.04 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా.. ప్రస్తుతం 19.51 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఈ లెక్కన 5.53 శాతం ఉత్తీర్ణత తక్కువగా వచ్చిందని కిషన్ తెలిపారు. 1,632 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టామని చెప్పారు. ఓఎంఆర్ ఆన్సర్‌షీట్‌లో అభ్యర్థులు బబ్లింగ్ చేయకపోవడం లేదా వాటిని ఖాళీగా ఉంచడం, హాల్‌టికెట్ నంబరు వేయకపోవడం వంటి పలు కారణాల వల్ల ఫలితాలను నిలిపివేసినట్టు తెలిపారు. సరైన కారణాలతో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి అవసరమైతే వారి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. ఫలితాలను టీఎస్‌టెట్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

ఫలితాల్లో ప్రథమం.. అథమం

టెట్ పేపర్-1 ఫలితాల్లో 74.27 శాతం ఉత్తీర్ణతతో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. 48.40 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లా చివరిస్థానంలో ఉన్నది. పేపర్-2 ఫలితాల్లో 24.02 శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల మొదటిస్థానంలో, 17.19 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లా చివరిస్థానంలో నిలిచింది. పేపర్-2 (గణితం, సైన్స్) ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 24.91 శాతం ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో నిలువగా, 16.26 శాతం మార్కులతో జనగామ, రంగారెడ్డి జిల్లాలు చివరిస్థానంలో నిలిచాయి.

టెట్-2017 ఫలితాల వివరాలు

అంశం	పేపర్-1	పేపర్-2 (గణితం, సైన్స్)	పేపర్ 2 (సోషల్ స్టడీస్)	మొత్తం
పరీక్షలకు హాజరు	98,848	1,11,018	1,19,914	2,30,932
ఉత్తీర్ణులు	56,708	20,323	24,732	45,055
ఉత్తీర్ణత శాతం	57.37	18.31	20.62	19.51

ఆ'దారానికి' ఆదరణ

సర్కారు చేయూతతో మళ్లీ మగ్గాల సందడి.. పోటీపడుతున్న మహిళాకార్మికులు

తెలంగాణ రాష్ట్రంలో దశ తిరిగిన కమలాపురం చేనేత సహకార సంఘం



వరంగల్ అర్బన్ జిల్లా కమలాపురం సంఘం గోదాముల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల వస్త్రాలు

నూర శ్రీనివాస్/వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: నేసిన వస్త్రాలు..పేరుకుపోయిన గోదాములు! ఉన్న సరుకే అమ్ముడుకాక.. కొత్త ఆర్డర్లు లేక.. మూగబోయిన మగ్గాలు! గిట్టుబాటు మాట పక్కనపెడితే.. చేతికి పనేలేని దుస్థితిలో వ్యవసాయకార్మికులుగా కొందరు.. ఉపాధి కూలీలుగా మారిపోయింది కొందరు! వృత్తిపై మమకారంతో సూరత్‌కో భీవండికో పొట్టచేత పట్టుకుని వలసపోయిన కళాకారులు మరికొందరు! ఇది గతం!! తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారి జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి! చేనేతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం.. స్వయంగా మంత్రి కేటీఆర్ చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తున్న తీరుతో ఉన్న స్టాక్ అంతా అమ్ముడుకావడమే కాక.. కొత్త ఆర్డర్లతో కొత్త ఉత్సాహం నెలకొంది! వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని కమలాపురం మండల కేంద్రంలోని కమలాపురం చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి, విక్రయ కేంద్రానికి వెళితే.. వృత్తిపై భరోసాతో.. బతుకుపై ధీమాతో పని చేస్తున్న పనిమంతులు కనిపిస్తున్నారు! మురిసిన దారాలతో మెరుస్తున్న మగ్గాలు మళ్లీ సందడి చేస్తున్నాయి. ప్రఖ్యాత బ్రాండ్లుగా చెప్పుకునే వస్త్రాలనుసైతం కొత్తరూపులో ఆవిష్కరిస్తున్నారు. ఆ సహకార సంఘం విజయగాథే ఇది!

67 ఏండ్ల చరిత్ర

కమలాపురం చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తుల, విక్రయ కేంద్రం చుట్టుపక్కల దాదాపు 24 గ్రామాల వృత్తిదారులతో 67 ఏండ్లక్రితం ఏర్పడింది. మొదట్లో 1500 మంది వరకూ నేతపనివాళ్లు ఉండేది. మారిన పరిస్థితులు, ఇబ్బందులతో 560 మంది మిగిలారు. తెలంగాణ ఏర్పడకముందు సంఘం నిర్వహణ ఇబ్బందుల్లో ఉండేది. నేసిన వస్త్రాలకు గిరాకీ ఉండేది కాదు. ఒకదశలో ఇక్కడి చేనేత కార్మికులు వ్యవసాయ కూలీలుగా, ఉపాధి హామీ కూలీలుగా పోయినవారున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ చేనేతకు ఇస్తున్న ఆదరణ, వారంలో ఒకరోజు తాను చేనేత వస్త్రాలను ధరించడమే కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునివ్వడంద్వారా కొత్త సంప్రదాయాన్ని తెచ్చారు. అప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా టెస్కో అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో కమలాపురం సంఘంలో పేరుకుపోయిన సరుకులో 90% టెస్కో కొనుగోలు చేసింది. మిగిలిన 10% సరుకు కమలాపురం, శ్రీరాములపల్లె, కందుగుల దుకాణాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణాపూర్ దుకాణాల్లో అమ్ముడవుతున్నది. కమలాపురం చేనేత సంఘం శిథిల భవనాలను తిరిగి నిర్మించుకునేందుకు సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఐటీ మంత్రి కేటీఆర్ ఇతోధికంగా సహకరించారు. కొత్త భవన నిర్మాణానికి రూ.15 లక్షలు, శ్రీరాములపల్లె వైండర్స్ భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి.



కమలాపురం చేనేత పారిశ్రామిక సహకార సంఘం భవనం

ఇదీ కమలాపురం లినెన్ క్లాత్

కమలాపురం చేనేత పారిశ్రామిక సంఘంలో చద్దర్లు (బెడ్ షీట్స్), తువ్వాళ్లు, లుంగీలు, షర్టింగ్స్, డ్రస్ మెరిటీయల్స్, కార్పెట్లు, నవార్లు, దోమతెరలు, కుర్చీ క్లాత్స్, దస్తీలు ఇలా ఒకటేమిటి.. అనేక రకాల వస్త్రాలు తయారవుతున్నాయి. దేశంలోనే పేరెన్నికగన్న మిల్లుల్లో తయారయ్యే బ్రాండ్లను పోలిన నాణ్యమైన వస్త్రాల్ని కూడా నేస్తున్నారు. షర్టింగ్, డ్రస్ మెటీరియల్స్‌లో ప్రత్యేకించి లినెన్ కాటన్‌ను పోలిన బ్రాండ్‌ను కూడా నేస్తున్నారు. ఈ సరుకును కూడా టెస్కో కొనుగోలు చేస్తున్నదని, దీనివల్ల తమ సంఘానికి మంచి గుర్తింపు వస్తున్నదని సంఘ నిర్వాహకులు గర్వంగా చెప్తున్నారు. తమిళనాడు ఈరోడ్ మోడల్‌ను చూసి మల్లెపందిరి బెడ్‌షీట్‌ను తయారు చేసి అందరి మెప్పును సొంతం చేసుకున్నారిక్కడి పనిమంతులు. రామ్‌రాజ్ కాటన్‌ను పోలిన ధోవతులు, లుంగీలు సైతం తయారవుతున్నాయి. గుంట మగ్గాలు, గుంట మగ్గాలపై జకాడ్ (మగ్గంపైన ఉండే ప్రత్యేక నిర్మాణం)తో పట్టంచు ధోవతులు నేసే పాత పద్ధతుల్ని కొనసాగిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత కూలీ రేట్లు కొద్దిగా పెరిగాయని, అదే సమయంలో మరికొంత పెంచాలని కార్మికులు కోరుతున్నారు.



కమలాపురంలో నేసిన లినెన్ క్లాత్

పురుషులతో దీటుగా మగ్గాలపై మహిళలు



చేనేత కార్మికురాలు గాజుల సవిత

కమలాపురం మగ్గాలపై పురుషులతో సమానంగా మహిళలు భాగస్వాములవుతున్నారు. గాజుల సవిత, చేరాల భారతి. ఈ ఇద్దరూ పురుషులతో పోటీగా వస్త్రాలు నేస్తున్నారు. సవిత గతంలో బీడీ కార్మికురాలు. పొగాకు పడకపోవడమే కాదు.. పొద్దంతా చేసినా రోజుకు రూ.60-70 కంటే వచ్చేవి కాదు. భర్త ఒక్కడి సంపాదనతో బతుకలేని స్థితిలో ఈ సంఘం ఇచ్చిన 45 రోజుల శిక్షణలో మగ్గంపై నేయడం నేర్చుకుని, కార్మికురాలిగా మారిపోయారు. ఇప్పుడు రోజుకు రూ.100-120 వస్తున్నాయి. కూలి మరింత పెంచాలని ఆమె వేడుకుంటున్నారు. ఇక చేరాల భారతిది తూర్పుగోదావరి జిల్లా అమలాపాలెం. భారతి కమలాపూర్ కోడలు. భర్త బస్ కండక్టర్. అమలాపాలెం తమదీ చేనేత కుటుంబమే అయినా..ఇక్కడికొచ్చినంక మరిన్ని మెళకువలు నేర్చుకొని పురుషులతో పోటీపడుతున్నానని గర్వంగా చెప్తున్నారు. అదే సమయంలో మరింత ప్రోత్సాహం అవసరమని పలువురు కార్మికులు చెప్తున్నారు. 'గతంలో మమ్ములను ఎవలూ పట్టిచ్చుకోలె. ఇప్పుడిప్పుడే చేనేతకు ఆదరణ దొరుకుతాంది. మారుతున్న కాలంకు తగ్గట్టుగా మారాలనడం మంచిదే. కానీ, ఇది తప్ప వేరే పనిచేయలేని కార్మికుల కోసం (50-70 వయస్సులో ఉన్నకార్మికులు) ఏదైనా ఆలోచించాలి' అని సంఘం అధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణ కోరారు.



చేనేత కార్మికురాలు చేరాల భారతి

చేపల నిల్వకు కోల్డ్ స్టోరేజీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మత్స్యకారులు చేపలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో మార్కెట్ల నిర్మాణానికి అనుమతులు మంజూరుచేశాం. స్థల సేకరణ చేపట్టాల్సి ఉన్నది. మత్స్యరంగ అభివృద్ధి కోసం మార్కెటింగ్, చేపల నిల్వకు కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, మత్స్యకారులకు శిక్షణ తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది'అని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి తలసాని అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, జోగురామన్న, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ రాజయ్య యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌చందా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తర్వాత మంత్రి తలసాని మీడియాకు వివరాలు వెల్లడించారు.ఈ ఏడాది 77 రిజర్వాయర్లు, 13,465 పంచాయతీ చెరువులు, 4,467 ప్రభుత్వ చెరువుల్లో 70 కోట్ల చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. చేప పిల్లల విడుదలను వీడియో చిత్రీకరించాలని సూచించామన్నారు. మత్స్యకారులకు చెరువులు లీజు అంశాన్ని పరిశీలిస్తున్నామని, సొసైటీలో 18 ఏండ్లు నిండినవారికి సభ్యత్వం కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 41,133 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. పశుగ్రాసం కొరత లేకుండా లక్ష ఎకరాల్లో స్టైలో హెమాటా గడ్డిని పెంచాలని నిర్ణయించినట్ట తెలిపారు. గొర్రెల రీ సైక్లింగ్‌కు అవకాశం లేకుండా విజిలెన్స్ బృందాలతో పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

వజ్ర బస్సుల్లో రూ.25 రాయితీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నుంచి నిజామాబాద్, వరంగల్ రూట్లలో ప్రవేశపెట్టిన వజ్ర ఏసీ మినీ బస్సులో ప్రయాణించేవారికి ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఆర్టీసీ మొబైల్‌యాప్ ఓపెన్ చేయగానే ఖాతాలో రూ.100 డిపాజిట్ అవుతాయి. అందులో నుంచి నాలుగు బుకింగ్‌లకు రూ.25 చొప్పున రాయితీ అందుతుంది. నాలుగు బుకింగ్స్ తర్వాత మళ్లీ మొబైల్‌యాప్ ఓపెన్‌చేస్తే తిరిగి రూ.100 జమవుతాయి. ఈ సౌకర్యాన్ని శనివారం నుంచి అమలుచేయనున్నట్టు అధికారులు తెలిపారు.

జీఎస్టీపై తాడోపేడో!

మూడోపేజీ తరువాయి...

ఎంపీలు శుక్రవారం లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. అయితే, దానిని తిరస్కరించిన స్పీకర్.. జీరోఅవర్ ముందు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీతో కలిగే ఇబ్బందులను వివరించారు. దానిపై జైట్లీ స్పందిస్తూ కౌన్సిల్ సమావేశంలోనే ఇటువంటివాటిపై చర్చిస్తామని తెలిపారు. శనివారం నాటి కౌన్సిల్ సమావేశంలో దీనిపై సానుకూలత వ్యక్తంకాని పక్షంతో తదుపరి సమావేశాల్లో సైతం ఈ అంశంపై గట్టిగా పట్టుబట్టాలని ఎంపీలు భావిస్తున్నారు.

బీజేపీ నేతల నిస్సహాయత

ప్రజోపయోగకరమైన ప్రాజెక్టులకు జీఎస్టీ మినహాయింపు సాధించే విషయంలో తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ, ఇతర నేతలు కూడా నిస్సహాయతను ప్రదర్శిస్తున్నారు.'రాష్ట్ర బీజేపీ నేతలు కోతలు కోయడం తప్ప కేంద్రం నుంచి ఇసుమంత కూడా సహాయం పొందటానికి ప్రయత్నించడం లేదు' అని టీఆర్‌ఎస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

కోర్టుకు వెళ్లేందుకూ సిద్ధం!

సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు.. ఈ మూడు పథకాలను జీఎస్టీ నుంచి మినహాయించకపోతే అవసరమైతే కేంద్రంపై కోర్టుకు వెళ్లాలని కూడా తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నదని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మిషన్ భగీరథను రూ.40వేల కోట్లతో చేపట్టామని, అప్పట్లోనే ఐదుశాతం వ్యాట్‌లో ఈ పథకం పనులు ఖరారయ్యాయని ఆ అధికారి గుర్తుచేశారు. ఇప్పుడు జీఎస్టీ పేరుతో 18శాతం పన్ను వేస్తే కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని, ప్రాజెక్టులు, పథకాలు ఎక్కడివక్కడ ఆగిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అందుకే ఈ అంశంపై తాడోపేడో తేల్చుకోవాలని ప్రభుత్వం సిద్ధమవుతున్నదని ఆ అధికారి చెప్పారు.

రాష్ట్రంపై 19వేల కోట్ల భారం

దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత జీఎస్టీ కౌన్సిల్ తొలి సమావేశం శనివారం ఢిల్లీలో జరుగనునది. సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కే తారక రామారావు.. శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కలిశారు. జీఎస్టీతో తెలంగాణ ప్రభుత్వ పథకాలపై పడే ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితరాలపై జీఎస్టీ కారణంగా ఏటా రూ.19,200 కోట్లు అదనంగా భారం పడుతుందని తెలిపారు. ఫలితంగా రాష్ట్ర బడ్జెట్‌ను పునర్వ్యవస్థీకరించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. జీఎస్టీకి పూర్వమే ఈ పథకాలన్నీ ప్రారంభించినందున 'వ్యాట్' వ్యవస్థలో ఉన్నట్లుగానే పన్ను పరిమితిని యథాతథంగా 5%గానే ఉంచాలని కేటీఆర్ కోరారు. దీనిపై జైట్లీ స్పందిస్తూ.. జీఎస్టీ సమావేశంలో అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమిష్టిగా నిర్ణయం తీసుకుందామని చెప్పారని తెలిసింది.



కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ, ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ రాసిన లేఖలు

గ్రానైట్, బీడీ పరిశ్రమపైనా వినతులు

లక్షలమంది ఉపాధిని దృష్టిలో పెట్టుకుని బీడీలకు ఉపయోగించే తునికాకు, బీడీలపై పన్ను తగ్గించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నది. గ్రానైట్‌పై 28% పన్ను వల్ల చిన్న మైనింగ్ వ్యాపారులకు ఇబ్బందని, దాన్ని 12% లేదా 5% స్లాబ్‌లో చేర్చాలని మరోసారి కోరనున్నారు. జీఎస్టీవల్ల ప్రభుత్వ పథకాలపై ఎంత భారం పడుతుంది..గ్రానైట్, బీడీ పరిశ్రమల్లో ఉపాధి దెబ్బతినే విషయాలను సమావేశంలో వివరించనున్నట్టు ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు.

ప్రాజెక్టులపై 19వేల కోట్ల అదనపు భారం

తెలంగాణలో ప్రాజెక్టులకు దాదాపు రూ.2.30 లక్షల కోట్ల మేర ఖర్చవుతుందని జైట్లీకి కేటీఆర్ తెలిపారు. ఆనాడు అమల్లో ఉన్న వ్యాట్ ప్రకారం 5% పన్నును పరిగణనలోకి తీసుకున్నారని,ఇప్పుడు 18% జీఎస్టీ చొప్పున చూస్తే రాష్ట్రంపై సుమారు రూ.19,200 కోట్ల మేరకు అదనపు భారం పడుతుందని వివరించారు. జూన్ 18న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 17వ సమావేశంలో స్వయంగా తాను ఈ విషయాన్ని వివరించడంతో కౌన్సిల్ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ప్రతిపాదనలు పంపితే జీఎస్టీ తగ్గించడంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని జైట్లీకి గుర్తుచేశారు. ఆ ప్రకారమే అన్ని వివరాలను కౌన్సిల్‌కు సమర్పించామని తెలిపారు. ఈ పథకాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినవే కాబట్టి కేంద్రం 2012లో వెలువరించిన నోటిఫికేషన్ ప్రకారం ఎలాంటి సర్వీసు పన్ను ఉండదు. పై ఐదు ప్రాజెక్టులకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.2.30 లక్షల కోట్లను ఖర్చుచేస్తుండగా వ్యాట్ ద్వారా 5% చొప్పున మొత్తం రూ. 11,500 కోట్లను పన్నుగా చెల్లిస్తున్నది. ఇప్పుడు 18% జీఎస్టీతో రూ.41,400 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే అదనంగా రూ.29,900 కోట్ల మేరకు రాష్ట్ర బడ్జెట్‌పై భారం పడుతుంది. ఇందులో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, ఇతరత్రా రూ.10,700 కోట్లు తిరిగి రాష్ట్రానికి వచ్చినా అంతిమంగా రూ.19,200 కోట్ల భారాన్ని రాష్ట్రం మోయాల్సి ఉంటుంది. ఈ అంశాలన్నింటినీ జైట్లీకి కూలంకషంగా వివరించిన కేటీఆర్.. వీటికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని, లేదా గరిష్ఠ పన్ను పరిమితిని 5%గా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌తో పాటు జైట్లీని కలిసినవారిలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాం నాయక్, బీబీ పాటిల్, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జి నగేశ్, పసునూరి దయాకర్ తదితరులున్నారు.

జీఎస్టీతో రాష్ట్ర ప్రాజెక్టులపై పడే భారం

- **మిషన్ భగీరథ:** ప్రాజెక్టు వ్యయం రూ.40 వేల కోట్లు. 5% వ్యాట్ కింద పన్ను చెల్లింపు రూ.2,000 కోట్లు. జీఎస్టీ 18%తో రూ.7,200 కోట్లు. అదనపు భారం రూ.5,200 కోట్లు.
- **మిషన్ కాకతీయ:** ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లు. 5% వ్యాట్ చెల్లింపుతో రూ.1,000 కోట్లు. 18% జీఎస్టీతో చెల్లించాల్సింది రూ.3,600 కోట్లు. అదనపు భారం రూ.2,600 కోట్లు.
- **సాగునీటి ప్రాజెక్టులు:** వ్యయం రూ.లక్ష కోట్లు. 5% వ్యాట్ చెల్లింపుతో రూ.5,000 కోట్లు. 18% జీఎస్టీతో చెల్లించాల్సింది రూ.18,000 కోట్లు. అదనపు భారం రూ.13,000 కోట్లు.
- **డబుల్ బెడ్‌రూం ఇండ్లు:** వ్యయం రూ.20 వేల కోట్లు. 5% వ్యాట్ చెల్లింపుతో రూ.1,000 కోట్లు. 18% జీఎస్టీతో చెల్లించాల్సింది రూ.3,600 కోట్లు. అదనపు భారం రూ.2,600 కోట్లు.
- **రోడ్లు,భవనాలు:** మౌలిక సౌకర్యాలతో కలిపి రోడ్లు భవనాల నిర్మాణానికి మొత్తం వ్యయం రూ.50వేల కోట్లు. 5% వ్యాట్ చెల్లింపుతో రూ.2,500 కోట్లు. 18% జీఎస్టీతో చెల్లించాల్సింది రూ.9,000 కోట్లు. అదనపు భారం రూ.6,500 కోట్లు.

7న చేనేత సంబురాలు

- పీపుల్స్‌ప్లాజాలో వస్త్ర ప్రదర్శన
- హెచ్ఐసీసీలో సినీనటి సమంత నేతృత్వంలో ఫ్యాషన్ షో



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ చేనేత దినోత్సవాన్ని జిల్లాల్లో చేనేత సంబురాలు పేరుతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్ తెలిపారు. జిల్లాల్లో చేనేత వాక్, రన్, విద్యార్థులకు క్విజ్ పోటీలు, చేనేత వస్త్రాలతో ప్రదర్శనలు ఏర్పాటుచేయాలని సూచించామని శుక్రవారం ఆమె మీడియాతో చెప్పారు. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్‌గార్డెన్ నుంచి పీపుల్స్‌ప్లాజా వరకు హ్యాండ్లూమ్ వాక్ ఉంటుందన్నారు. పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రప్రదర్శనను చేనేత, జౌళి శాఖ మంత్రి కే తారకరామారావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 15 వరకు ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. సోమవారం సాయంత్రం హెచ్ఐసీసీలో సినీనటి సమంత ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని, చేనేత ప్రముఖులను సన్మానిస్తున్నామని పేర్కొన్నారు. 10, 11తేదీల్లో కొనుగోలు, అమ్మకందార్ల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకులు బీ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త సంచాలకులు పూర్ణచందర్‌రావు, ఉప సంచాలకులు రతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఎలక్ట్రానిక్ క్లస్టర్

మూడోపేజీ తరువాయి...

ఖర్చుచేసి, ఆయా కంపెనీలు, సంస్థలు ఏర్పాటు చేయడానికి అనువైన వాతావరణాన్ని దశలవారీగా కల్పించనున్నారు. రెండు క్లస్టర్లలో అంతర్గత రోడ్లు, మెయిన్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ, కామన్ ఫెసిలిటీ సెంటర్, పరిపాలన భవనాలు, ల్యాబ్‌లు, గోడౌన్లు, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. కంపెనీలకు అవసరమయ్యే యూనివర్సల్ మొబైల్ టెస్టింగ్ సర్వీసెస్, ర్యాపిడ్ ప్రోటోటైపింగ్, ప్రొడక్ట్ డిజైన్ హౌజ్, టూల్ రూం, ప్లాస్టింగ్ మౌల్డింగ్ ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. వీటితో పాటుగా ఉద్యోగులకు హాస్టల్, మెస్ సౌకర్యం, హాస్పిటల్, క్యాంటిన్, ఉద్యోగుల చిన్న పిల్లలను చూసుకోవడానికి వీలుగా డే కేర్ సెంటర్ తరహాలో క్రెచ్ ఏర్పాటు చేస్తారు.

మహేశ్వరం క్లస్టర్‌లో ఏర్పాటయ్యే సంస్థలు

ఈ క్లస్టర్‌లో ప్రధానంగా ఎల్ఈడీల తయారీ ఉంటుంది. వీటితో పాటుగా కమ్యూనికేషన్ పరికరాలు, పీసీబీలు, కెపాసిటర్లు, పరీక్షల కొలతల పరికరాలు, యంత్రాలు, మెడికల్ ఎలక్ట్రానిక్స్, క్రిస్టల్స్, ఆర్ఎఫ్ఐడీ, కంప్యూటర్ బేస్డ్ డిజైన్స్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, స్మార్ట్ కార్డ్స్ తయారు చేస్తారు. వైర్ ఉండ్ రెసిస్టర్లు, పవర్ సప్లయ్స్, స్టెబిలైజర్లు, సర్వో స్టెబిలైజర్లు, కంట్రోల్ సిస్టమ్స్, యాంటెనాలు, కమ్యూనికేషన్ రిసీవర్స్‌లోని భాగాలను తయారు కంపెనీలకు అవకాశం కల్పిస్తారు.


శ్రావణంలో కూడా ఆషాడం ధరలకే
శ్రావణ వైభవం
సరికొత్త వర్ణాలలో
కంచి పట్టు చీరలు మీకోసం...
శ్రావణం K9 సేల్
శ్రావణంలో కూడా ఆషాడం ధరలకే
తూకంలో చీరల అమ్మకం...
upto 70% OFF
సరికొత్త స్టాక్‌పై. అన్ని రకాల వస్త్రాలపై...
సరికొత్త వర్ణాలలో
కంచి, ధర్మవరం, ఉప్పాడ, ఆరణి,
కోయంబత్తూర్ పోచంపల్లి, గద్వాల్ నుండి
ప్రసిద్ధ పెళ్లి పట్టు చీరలు
R.S. Brothers™
Retail India Pvt. Ltd.
Hyderabad | Secunderabad
LINENCLUB Siyaram's Raymond DIGJAM OCM ARVIND
Levi's INDIAN TERRAIN BLACKBERRYS Pepe Jeans KILLER mufti U.S. POLO ASSN Louis Philippe VANHEUSEN Allen Solly integriti ROCKSTAR JEANS
PAN AMERICA sin LAWMAN Pg3 laven e-mail WHITE HOUSE Wrangler spykar Classic Polo MONTE CARLO Park Avenue



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పిట్టలవాడలో మొక్కనాటుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కనాటుతున్న విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

చివరాయకట్టుకూ నీరందిస్తాం

సీఎం సభకు భారీగా తరలిరావాలి

10న శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం

పనులకు శంకుస్థాపన: మంత్రి ఈటల రాజేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్‌ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: చివరాయకట్టుకూ నీరందించడమే లక్ష్యంగా చేపడుతున్న శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి సీఎం కేసీఆర్ ఈనెల 10న శంకుస్థాపన చేస్తారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఈ సందర్భంగా పోచంపాడ్ వద్ద నిర్వహించే బహిరంగ సభకు రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం పద్మనాయక కల్యాణ మండలంలో నిర్వహించిన పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా వరదకాలువ ద్వారా నీటిని ఎత్తిపోసి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపడమే ధ్యేయంగా ఈ పనులు సాగుతాయని వివరించారు. ఈ పనులు పూర్తయితే ఏడు జిల్లాల్లో లక్షలాది ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారు. 2018 జూలై నాటికి మధ్యమానేరు పనులు పూర్తిచేసి, పది టీఎంసీల నీటిని నిల్వ చేస్తామన్నారు. పదేండ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ మధ్యమానేరు ప్రాజెక్టుకు సంబంధించి 30 శాతం పనులను పూర్తి చేస్తే, గడిచిన మూడేండ్ల కాలంలో తమ ప్రభుత్వం 70 శాతం పనులను పూర్తిచేసిందన్నారు. అన్ని ప్రాజెక్టుల పనులు ఇలాగే కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మెడికల్ కళాశాల హామీని అమలు చేయాలంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆమరణ నిరాహార దీక్ష పేరుతో హైడ్రామా చేస్తున్నారని విమర్శించారు. ఈ తరహా విధానాలు మానుకోవాలని సూచించారు.

స్నేహం ముసుగులో ఘరానా మోసం

రూ.2.5 కోట్లకుపైగా కుచ్చుటోపి.. అప్పులిచ్చినవారికి ఐపీ నోటీసులు



సుధీర్‌రెడ్డి

పాలమూరు: 'నా భార్య తీవ్ర అనారోగ్యంతో ఉంది.. మీరు కొంత ఆర్థికంగా సహాయం చేస్తే కాపాడుకుంటా.. నాన్న అనారోగ్యంతో దవాఖానలో ఉన్నారు.. మీరు సహకరించాలి, మా అత్తగారు చావుబతుకుల్లో ఉన్నారు.. ఆమెకు హైదరాబాద్‌లో ఉన్న ఇల్లును అమ్మి మీ అప్పు తీరుస్తా'.. అంటూ ఇలా ఒక్కొక్కరికి ఒక్కోరకమైన కథను వినిపించి అప్పులు చేశాడు ఓ ఘనుడు. స్నేహితులు, బంధువులను ఎవరినీ వదలలేదు. ఇలా దాదాపు రూ.2.5 కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టాడు. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్‌కు చెందిన సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లో చదువుకున్నాడు. తమిళనాడులో ఎంబీఏ చేశాడు. ఆ తర్వాత 2006లో లండన్ వెళ్లి అక్కడ ఉద్యోగం చేసినట్టు తెలిసింది. ఇలా అన్నిచోట్ల స్నేహాన్ని ఏర్పర్చుకున్నాడు. కొంతకాలానికి హైదరాబాద్‌కు వచ్చి పాత స్నేహితులందరితో అనుబంధాన్ని కొనసాగించాడు. ఈ క్రమంలో అప్పులు చేసి హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో సోలార్-4 గ్రీన్ ఇండియా కంపెనీ ప్రారంభించాడు. దీంతోపాటు పలు వ్యాపారాలు చేస్తున్నట్టు నమ్మించి భారీ మొత్తంలో అప్పులు చేసినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి కొందరికి బ్లాంక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చినట్టు తెలిసింది. మరికొందరు ఎలాంటి రాతలు లేకుండానే డబ్బులు ఇచ్చారు. ఇచ్చిన గడువు దాటిపోవడంతో అప్పులిచ్చిన వారు ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఇప్పుడు.. అప్పుడంటూ కాలయాపన చేయడం మొదలుపెట్టాడు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 31లోగా మీ డబ్బులు చెల్లిస్తా.. మా ఊర్లో వంద ఎకరాల పొలం ఉంది. అందులో కొంత అమ్మేస్తా.. మా అత్తగారికి హైదరాబాద్‌లో కోటిన్నర విలువ చేసే ఇల్లు ఉంది.. ఆమె చావుబతుకుల్లో ఉంది.. ఆ తర్వాత ఆ ఇల్లును విక్రయించి మీ రుణం తీర్చుకుంటా'.. అని ఒకరి తెలియకుండా మరొకరికి ఒక్కో కథను చెబుతూ నమ్మిస్తూ వచ్చాడు. గడువు ముగిసినా డబ్బులు అందకపోవడంతో కొందరు సుధీర్ సెల్ (8106688887)కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంతలోనే మహబూబ్‌నగర్ కోర్టు నుంచి ఎనిమిది మందికి ఐపీ నోటీసులు అందాయి. ఆ నోటీసులో ఉన్న వివరాలను చూసుకొని ఒకరికొకరు ఫోన్లు చేసుకోవడంతో సుధీర్‌రెడ్డి ఘరానా మోసం వెలుగుచూసింది. అప్పులిచ్చిన వారు ఈ నెల 29న మహబూబ్‌నగర్ కోర్టుకు హాజరు కానున్నారు.



ఏసీబీ అధికారుల దాడుల్లో పట్టుబడిన బంగారు ఆభరణాలు, వెండి నాణేలు, నగదు (ఇన్‌సెట్‌లో) ఏసీటీవో సురేందర్‌గౌడ్

ఏసీటీవో ఇండ్లపై ఏసీబీ దాడులు

వెలుగుచూసిన రూ.కోట్లాది అక్రమాస్తులు?

కూడగట్టుకున్న భవనాలు, ప్లాట్లు


హైదరాబాద్/జడ్చర్ల, నమస్తే తెలంగాణ: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్(ఏసీటీవో) బత్తిన సురేందర్‌గౌడ్ ఆదాయానికి మించిన ఆస్తులను కూడగట్టుకున్నాడు. శుక్రవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించగా ఈ విషయం వెలుగు చూసింది. ఏసీబీ డీజీ పూర్ణచంద్రారావు కథనం ప్రకారం.. ఏసీబీ అధికారులు ఎనిమిది బృందాలుగా ఏర్పడి జడ్చర్లలోని సురేందర్‌గౌడ్ ఇంటితోపాటు కుటుంబ సభ్యులు, పలు ప్రాంతాల్లోని బంధువుల ఇండ్లపై మెరుపు దాడులు చేశారు. జడ్చర్లలో రూ.1.21కోట్ల విలువచేసే భవనాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.19 లక్షల విలువచేసే వ్యవసాయ భూమి, జడ్చర్లలో రూ. 4లక్షల విలువచేసే ప్లాట్లు, రూ.17 లక్షల విలువచేసే రెండు కార్లు, రూ. 8లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 6 లక్షల బీమా పాలసీలు, రూ.5లక్షల విలువచేసే గృహోపకరణాలు సోదాల్లో బయట పడినట్టు డీజీ పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ. 1.85 కోట్లు ఉంటుందని, మార్కెట్ విలువ ప్రకారం రూ. 6 కోట్ల వరకు ఉంటాయ న్నారు. సురేందర్ గౌడ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జూరాలకు వరద

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: జూరాల ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నది. శుక్రవారం రాత్రి వరకు 3710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 17,566 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆల్మట్టి నుంచి నారాయణపూర్ ప్రాజెక్టుకు 21,003 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. అదే విధంగా ఆల్మట్టి ప్రాజెక్టు నిండింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 129.72 టీఎంసీలుండగా, 128.19 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇంకా 21,003 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. అదే విధంగా జూరాల నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650, కోయిల్‌సాగర్‌కు 282, ఎడమ కాల్వకు 900, కుడి కాల్వకు 716 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 1033, భీమా లిఫ్టు-2కు 839 క్యూసెక్కులు వదులుతున్నారు. జూరాలకు ఇన్‌ఫ్లో 3710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 4416 క్యూసెక్కులుగా నమోదైంది.

పేదల చెంతకు సర్కారు వైద్యం





ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యం కోసం వచ్చిన ప్రజలు.. రిమ్స్‌లో మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రభుత్వ వైద్యశాలల్లో పెరిగిన ప్రసవాలు

82 శాతంతో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ ఫస్ట్

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలని సర్కారు తీసుకున్న నిర్ణయం ఆదిలాబాద్ జిల్లాలో సత్ఫలితాలనిస్తున్నది. అడవి బిడ్డలకు నిలయమైన ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో సర్కారు దవాఖానల్లో ప్రసవాలు 62 శాతం ఉండగా, ఆరునెలల్లో 20 శాతం పెరిగి ప్రస్తుతం రాష్ట్రంలోనే 82శాతంతో ఆదిలాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లాలో రిమ్స్‌తోపాటు, 22 పీహెచ్‌సీలున్నాయి. గతంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటివి సోకినప్పుడు సరైన వైద్యం అందేది కాదు. ఈ క్రమంలో మరణాలు సంభవించేవి. తెలంగాణ ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో జిల్లాలోని సర్కారు దవాఖానల్లో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. మూడేండ్లుగా గిరిజనుల చెంతకు సర్కారు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సర్కారు వైద్యశాలల్లోనూ ప్రసవాల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది.


సత్ఫలితాలిస్తున్న అధికారుల చర్యలు

జిల్లాలోని 22 పీహెచ్‌సీలకు వైద్యం కోసం వస్తున్న గర్భిణుల సంఖ్య పెరిగింది. ఒక్కో పీహెచ్‌సీకి ప్రతినెలా కనీసం 10 నుంచి 20మంది గర్భిణులు వైద్యం కోసం వస్తుంటారు. వీరి సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 24గంటలపాటు వైద్య సేవలందించే పీహెచ్‌సీలు 10 ఉన్నాయి. ప్రతి కేంద్రానికి ఒక స్టాఫ్ నర్సును అదనంగా నియమించారు. ప్రసవ సమయంలో గర్భిణులకు ఇబ్బందులు కలుగకుండా కావాల్సిన పరికరాలను అందుబాటులో ఉంచారు. దీంతో గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగింది.

కేసీఆర్ కిట్‌తో పలు ప్రయోజనాలు

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించే వారికి ఆడపిల్ల పుడితే రూ. 13 వేలు, మగ పిల్లవానికి రూ.12వేలతోపాటు తల్లికి, బిడ్డకు అవసరమయ్యే వస్తువులను ప్రభుత్వం కేసీఆర్ కిట్ ద్వారా అందజేస్తున్నది. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో సర్కారు వైద్యశాలలకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవించిన 1058 మందికి కేసీఆర్ కిట్లను అందజేసినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం 1308 గర్భిణులు తమ పేర్లను నమోదు చేయించుకొని వైద్యసేవలు పొందుతున్నారు.

వందశాతం లక్ష్యంగా పనిచేస్తాం



ప్రభుత్వ వైద్యసేవలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సర్కారు వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. గర్భిణులు వంద శాతం సర్కార్ దవాఖానలకు వచ్చేలా కృషి చేస్తున్నాం.

- తొడసం చందు, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

సర్కారు సాయం మరువలేను..



మాది ఉట్నూరు మండలం గంగాపూర్. నాకు జూన్ ఆరో తారీఖున ఉట్నూర్ దవాఖానలో కొడుకు పుట్టిండు. సర్కారోళ్లు రూ.7 వేలు ఇచ్చిండ్రు. బాబుకు ఉపయోగపడే వస్తువులు కూడా ఇచ్చిండ్రు. నాకు పైసా ఖర్చు లేకుండాపోయింది. ప్రైవేటు దవాఖానకు పోతే రూ.20 వేల వరకు ఖర్చు అయ్యేది.

- మైసవ్వ, గిరిజన మహిళ

2.70 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లు

- **సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రథమ స్థానం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**
- **పేదలు ఆత్మగౌరవంతో బతుకాలన్నదే సీఎం ఆకాంక్ష: మంత్రి హరీశ్‌రావు**



సిద్దిపేట జిల్లా మందపల్లి పంచాయతీ పరిధిలోని పిట్టలవాడలో సామూహిక గృహ ప్రవేశానికి హాజరైన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు. (ఇన్‌సెట్‌లో) శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2.70 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, హైదరాబాద్‌లో లక్ష ఇండ్లకు గాను 70 వేల ఇండ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మందపల్లి పంచాయతీ పరిధిలోని పిట్టలవాడలో 20 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు భారీ నీటి పారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు చూసి ప్రతిపక్ష పార్టీలకు నిద్ర పట్టడం లేదన్నారు. వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదనే అక్కసుతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. కోర్టుల్లో కేసులు వేస్తూ ప్రాజెక్టులు అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా 2019 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతుకాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి కట్టించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఎవరైనా అమ్మినా, కొన్నా జైలుకేనని చెప్పారు. అనంతరం సిద్దిపేటలో జిల్లా స్థాయి క్రీడా సంబురాలను మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్, శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, భూపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మినీ స్టేడియంలోని జిమ్, షటిల్ కోర్టును ప్రారంభించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ క్రీడా సౌకర్యాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. ప్రభుత్వ సలహాదారు వివేక్ మాట్లాడుతూ సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిందని, ఇందుకు మంత్రి హరీశ్‌రావు విశేష కృషి సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ మంత్రి వినోద్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వ సలహాదారు వివేక్, మాజీ మంత్రి వినోద్, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు షటిల్, వాలీబాల్, క్రికెట్, చెస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్నది కాంగ్రెస్సే

చేతులెత్తి ప్రార్థిస్తున్నా ప్రాజెక్టులు ముందుకు పోనివ్వండి

భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డుపడుతున్నది కాంగ్రెస్ పార్టీ కాదా..? కోర్టుల్లో కేసులు వేయలేదా..?, ఆ వివరాలు మా దగ్గర ఉన్నాయి.. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఐదుగురు కాంగ్రెస్ పార్టీ నాయకుల పేర్లతోనే కోర్టులో కేసులు వేసింది నిజం కాదా..? నీటి పారుదల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్లు వేసింది మీరు కాదా..? హైదరాబాద్‌లో కళాభారతి కట్టవద్దని.. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు వద్దని.. అమరవీరుల స్థూపం వద్దని.. రోడ్లు వెడల్పు చేయవద్దని.. హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేయవద్దని కేసులు వేసింది ఎవరు.? అని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పిటిషన్ల వివరాలు మీ గాంధీభవన్‌కు పంపిస్తాం. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చదువుకొని సమాధానాలు ఇవ్వండి' అన్నారు. సీఎం కేసీఆర్ బాధను, పనులు ఆగిపోతున్నాయనే ఆవేదనను ప్రతిపక్షాలు అర్థం చేసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం, పేదల సంక్షేమానికి అనేక ప్రణాళికలు రచించి వాటిని అమలు చేస్తుంటే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూస్తుండటంతోనే ఎంతో బాధతో సీఎం మాట్లాడారన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వను అని కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నప్పుడు ఈ రోశం ఎక్కడకు పోయిందన్నారు. నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులు, ఆదిలాబాద్ అంటురోగాల బాధితులకు రక్షిత నీరు ఇవ్వకుండా చిత్తూరుకు రూ. 8వేల కోట్లతో స్పెషల్ స్కీమ్ తీసుకుపోయినప్పుడు ఈ నల్లగొండ జిల్లా నేతల స్పందన ఎటుపోయిందని ప్రశ్నించారు. పెద్ద మనసుతో ఆలోచించి కేసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'మీకు చేతులెత్తి ప్రార్థిస్తున్న.. తెలంగాణ ప్రాజెక్టులు ముందుకు పోనివ్వండి' అని మంత్రి హరీశ్‌రావు కోరారు. కేసుల వల్ల ప్రభుత్వ తప్పిదాలు బయటపడుతాయనే భయం తమకు లేదని, పనులు పెండింగ్‌లో ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు.



విఠల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి. ఇన్‌సెట్‌లో పోలీసుల గౌరవ వందనం

అధికారిక లాంఛనాలతో విఠల్‌రెడ్డి అంత్యక్రియలు


కామారెడ్డి, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య సమరయోధుడు, కామారెడ్డి తొలి ఎమ్మెల్యే జీడిపల్లి విఠల్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం కామారెడ్డిలోని ఇందిరానగర్ శ్మశాన వాటికలో అధికారిక లాంఛనలతో నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి ఈ కార్యక్రమానికి హాజయ్యారు. సిరిసిల్ల రోడ్‌లోని విఠల్‌రెడ్డి ఇంటి నుంచి అంతియయాత్ర ప్రారంభమైంది. పోలీసుల గౌరవ వందనం అనంతరం పెద్ద కుమారుడు నర్సింహారెడ్డి తండ్రి చితికి నిప్పంటించారు.



జమాబందీతో భూసమస్యలకు చెక్

మేడిపల్లి: జగిత్యాల జిల్లా మేడిపల్లిలో శుక్రవారం జమాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా వేధిస్తున్న భూసమస్యలు స్వ రాష్ట్రంలో జమాబందీ ద్వారా పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. జమాబందీలో మొత్తం 3,993 మంది దరఖాస్తులు చేసుకోగా 2805 దరఖాస్తులను పరిష్కరించినట్టు తెలిపారు. ఈ సభలో 1150 మందికి భూమి పత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫైడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో తహసీల్దార్ ప్రసాద్ మృతి




ప్రసాద్ (ఫైల్)

పినపాక: వచ్చేనెలలో రిటైర్ కావాల్సిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక తహసీల్దార్ కొన్నెకంటి ప్రసాద్(58) గుండెపోటుతో మరణించారు. స్వగ్రామమైన కొత్తగూడెంలో శుక్రవారం ఉదయం వాకింగ్ చేస్తుండగా గుండెపోటుతో కుప్పకూలారు. పాల్వంచ డివిజన్ సీతారామప్రాజెక్ట్ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌లో పనిచేస్తూ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. పినపాక తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐదోరోజే మరణించడం విషాదం నింపింది. ప్రసాద్‌కు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దార్ మరణవార్త తెలుసుకున్న పినపాక రెవెన్యూ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కొత్తగూడెం వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	21003	21003	1705	1704.72	129.72	128.19
నారాయణపూర్	17790	17566	1615	1614.24	37.646	37.04
జూరాల	3710	4416	1045	1037.34	9.66	5.460
తుంగభద్ర	4545	411	1633	1613.00	100.86	41.31
శ్రీశైలం	70	70	885	778	215.807	19.62
నాగార్జునసాగర్	709	709	590	500.60	312.045	116.26
పులిచింతల	877	4965	175	115.65	45.77	2.85
ప్రకాశం బ్యారేజీ	7621	7621	57.05	54.25	3.070	2.33




(జూన్1 నుంచి ఇప్పటివరకు 311.946 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	7659	3235	1522	1511.96	102.732	66.08
కడెం	0	950	700	687.30	7.6	4.730
ఎస్సారెస్పీ	0	632	1091	1055.40	90.313	9.58
సింగూరు	0	345	1717.93	1708.99	29.91	17.87
నిజాంసాగర్	0	35	1405	1380.30	17.803	1.35
ఎల్లంపల్లి	217	418	485	472.01	20.175	10.45
లోయర్‌మానేరు	0	129	920	893.60	24.07	7.374
ధవళేశ్వరం	58105	57873	45	45	2.93	2.93

ఖేల్



క్వార్టర్స్‌లో యుకీ భాంబ్రి

న్యూఢిల్లీ: ఏటీపీ సిటీ ఓపెన్‌లో భారత యువ టెన్నిస్ ఆటగాడు యుకీ భాంబ్రి అత్యద్భుత ప్రదర్శన కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే తన కంటే మెరుగైన ర్యాంక్(22)లో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ గేల్ మోన్‌ఫీల్స్‌ను ఓడించి సంచలనం సృష్టించిన యుకీ..తాజాగా సిటీ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఈ ఢిల్లీ కుర్రాడు 6-7(5), 6-3, 6-1 తేడాతో గుయిడో పెల్లా(అర్జెంటీనా)పై విజయం సాధించాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో తన(200) కంటే సరిగ్గా 100 ర్యాంక్‌లు ఎక్కువ ఉన్న పెల్లాను యుకీ అలవోకగా ఓడించాడు. ఓ ఏటీపీ వరల్డ్ టూర్ ఈవెంట్ ప్రధాన డ్రాలో మూడు మ్యాచ్‌లు గెలువడం యుకీకి ఇదే తొలిసారి కాగా, చెన్నై ఓపెన్(2014) తర్వాత ఏటీపీ టోర్నీ క్వార్టర్స్ చేరుకోవడం రెండో సారి. ఇప్పటికే తన ఖాతాలో 90 పాయింట్లను ఖరారు చేసుకున్న యుకీ శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆండర్సన్(దక్షిణాఫ్రికా)తో తలపడుతాడు.

మంజుకు కాంస్యం

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన మంజు కుమారి కాంస్య పతకంతో మెరిసింది.మహిళల 59కిలోల విభాగం కాంస్య పతక పోరులో మంజు 2-0 తేడాతో ప్రొకోపెవెన్యుక్(ఉక్రెయిన్)పై గెలిచింది. వాస్తవానికి క్వార్టర్ ఫైనల్లోనే మంజు ఓడిపోయినప్పటికీ ప్రత్యర్థి ఫైనల్‌కు చేరుకోవడంతో రెప్‌చేజ్ రౌండ్ ఆడే అవకాశం దక్కింది. దీన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్న కుమారి..తియాన్న గ్రేస్(కెనడా)పై 4-0 తో గెలిచి కాంస్య పతక పోరులో నిలిచింది. మరోవైపు పూజ గెహ్లోట్(55కి), పూజ(72కి) కాంస్య పతక పోరులో ఆడే చాన్స్ వచ్చినా..రెప్‌చేజ్ రౌండ్‌లలో ఓడి నిరాశ పరిచారు.

ఢిల్లీకి పుణె షాక్



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో పుణెరి పల్టాన్ జోరు కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 26-21తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. ఫలితంగా జోన్-ఎలో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం 17 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నది. పుణె తరపున రైడింగ్‌లో రాజేశ్ మోండల్ (8), డిఫెన్స్‌లో ధర్మరాజు (2) ఆకట్టుకోగా, ఢిల్లీకి ఆనంద్ పాటిల్ (8), సునీల్ (4) అండగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 32-31తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. బుల్స్ రైడర్లు అజయ్ కుమార్, అజయ్ ఠాకూర్ వరుస పాయింట్లతో దుమ్మురేపారు.

తోకతో కొట్టారు!



జడేజా, సాహా, అశ్విన్ అర్ధసెంచరీలు

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 622/9 డిక్లేర్డ్

శ్రీలంక 50/2

ఆతిథ్య అనుకూలత ఉన్నా.. బౌలింగ్‌లో పసలేదు. తెలిసిన పిచ్‌లే అయినా.. బంతుల్లో వైవిధ్యం లేదు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ కాకపోయినా.. నిలువరించే వ్యూహం లేకపోయింది. వెరసి.. రెండో టెస్టు దాదాపుగా భారత్ చేతుల్లోకి వచ్చేసింది. సెంచరీ హీరోలు పుజార, రహానే వేసిన పటిష్ఠమైన పునాదుల మీద లోయర్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాట్స్‌మెన్ జోరు చూపెడుతూ కొలంబోలో భారీ పరుగుల కట్టడాన్ని నిర్మించారు. అడ్డుకోవాల్సిన లంక బౌలర్లు నిస్సహాయ స్థితికి చేరడంతో టీమ్‌ఇండియా శాసించే స్థాయికి చేరుకుంది.

లంక గడ్డపై వరుసగా రెండు టెస్టుల్లో ఐదు వందలకుపైగా స్కోరు చేసిన మొదటి విదేశీ జట్టు భారత్.

1

లంక గడ్డపై ఒకే టెస్టులో ఆరు అర్ధసెంచరీలు నమోదు కావడం ఇదే తొలిసారి. కానీ భారత్‌కు ఇది రెండోసారి. 2007 ఓవల్‌లో కూడా టీమ్‌ఇండియా ఈ ఫీట్‌ను సాధించింది.

కొలంబో: లోయర్ ఆర్డర్‌లో నాణ్యమైన బ్యాట్స్‌మెన్ కోసం ఎదురుచూస్తున్న భారత్ కల ఎట్టకేలకు నెరవేరింది. జడేజా (70 నాటౌట్), అశ్విన్ (54) రూపంలో ఇద్దరు కొత్త ఆల్‌రౌండర్లు టీమ్ ఇండియా బ్యాటింగ్ లైనప్‌లోకి వచ్చారు. ఇన్నాళ్లూ స్పిన్నర్లుగా పరిగణిస్తున్న ఈ ఇద్దరు తొలిసారి విదేశీ గడ్డపై తమ బ్యాటింగ్ సత్తా ఏంటో చూపెట్టారు. లంక బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొన్న ఈ ఇద్దరూ రెండో టెస్టులో భారత్‌కు భారీ స్కోరు అందించారు. సాహా (67) కూడా వీరికి జత కలువడంతో టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌ను 158 ఓవర్లలో 9 వికెట్లకు 622 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. సెంచరీల హీరోలు పుజార (232 బంతుల్లో 133; 11 ఫోర్లు, 1 సిక్స్), రహానే (222 బంతుల్లో 132; 14 ఫోర్లు) భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లంక శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్లకు 50 పరుగులు చేసి ఎదురీదుతున్నది. మెండిస్ (16 బ్యాటింగ్), చండిమల్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అశ్విన్ రెండు వికెట్లు తీశాడు. ఆతిథ్య జట్టు ఇంకా 572 పరుగులు వెనుకబడి ఉంది.

కీలక భాగస్వామ్యాలు..

344/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన పుజార, రహానే ఎక్కువసేపు ఇన్నింగ్స్‌ను కొనసాగించలేకపోయారు. రెండో ఓవర్‌లోనే పుజారను ఔట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 217 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక లోయర్ ఆర్డర్‌లో వచ్చిన ప్రతి బ్యాట్స్‌మెన్ తలా కొన్ని పరుగులు జత చేశారు. వికెట్ మీద టర్న్ కనిపించడంతో చండిమల్ ఎక్కువగా స్పిన్నర్లను కొనసాగించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న అశ్విన్, రహానే చకచకా సింగిల్స్, డబుల్స్‌తో పరుగులు రాబట్టారు. భారీ ఇన్నింగ్స్‌పై దృష్టిపెట్టిన రహానేను 111వ ఓవర్‌లో పుష్పకుమార బోల్తా కొట్టించాడు. ఈ ముంబైకర్ అశ్విన్‌తో ఐదో వికెట్‌కు 63 పరుగులు జత చేశాడు. కొత్తగా వచ్చిన సాహా వికెట్‌ను కాపాడుకోవడంతో భారత్ 442/5 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో లంక స్పిన్నర్లు కాస్త వైవిధ్యంగా బంతులు వేయడంతో అశ్విన్ క్రీజును వదలేస్తూ ఇబ్బందిపడ్డాడు. ఫలితంగా 122వ ఓవర్‌లో హెరాత్ ఫ్లైట్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఈ ఇద్దరి మధ్య ఆరో వికెట్‌కు 38 పరుగులు సమకూరాయి. ఇక హార్దిక్ (20)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లిన సాహా.. అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఏడో వికెట్‌కు 45 పరుగులు జత చేశాకా.. పుష్పకుమార పాండ్యాను ఔట్ చేశాడు. బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా 134వ ఓవర్‌లో భారత్ స్కోరును 500లకు చేర్చాడు. ఆఖరి సెషన్‌లో జడేజా వేగం పెంచి బౌండరీలు, సిక్స్ బాదాడు. ఫలితంగా కెరీర్‌లో 8వ హాఫ్ మార్క్‌ను పూర్తి చేశాడు. రెండోఎండ్‌లో సాహా కూడా అటాక్ మొదలుపెట్టినా.. హెరాత్ బంతులను అర్థం చేసుకోలేక స్టంపౌటయ్యాడు. ఈ ఇద్దరి మధ్య 8వ వికెట్‌కు 72 పరుగులు జత కావడంతో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. షమీ (19)తో కలిసి చకచకా పరుగులు రాబట్టిన జడ్డూ 9వ వికెట్‌కు 30 పరుగులు సమకూర్చాడు. ఓవరాల్‌గా 156వ ఓవర్‌లో భారత్ స్కోరు 600లకు చేరింది. ఉమేశ్ (8 నాటౌట్), జడేజా క్రీజులో ఉండగానే.. మరో రెండు ఓవర్ల తర్వాత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. హెరాత్ 4 వికెట్లు పడగొట్టాడు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధవన్ ఎల్బీ (బి) పెరీరా 35, రాహుల్ రనౌట్ 57, పుజార ఎల్బీ (బి) కరుణరత్నే 133, కోహ్లీ (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13, రహానే (స్టంప్) డిక్‌వెల్లా (బి) పుష్పకుమార 132, అశ్విన్ (బి) హెరాత్ 54, సాహా (స్టంప్) డిక్‌వెల్లా (బి) హెరాత్ 67, పాండ్యా (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20, జడేజా నాటౌట్ 70, షమీ (సి) తరంగ (బి) హెరాత్ 19, ఉమేశ్ నాటౌట్ 8, **ఎక్స్‌ట్రాలు:** 14, **మొత్తం:** 158 ఓవర్లలో 622/9 డిక్లేర్డ్. **వికెట్లపతనం:** 1-56, 2-109, 3-133, 4-350, 5-413, 6-451, 7-496, 8-568, 9-598.**బౌలింగ్:** ఫెర్నాండో 17.4-2-63-0, హెరాత్ 42-7-154-4, కరుణరత్నే 8-0-31-1, పెరీరా 40-3-147-1, పుష్పకుమార 38.2-2-156-2, డి సిల్వా 12-0-59-0.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25, తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, మెండిస్ బ్యాటింగ్ 16, చండిమల్ బ్యాటింగ్ 8, **ఎక్స్‌ట్రాలు:** 1, **మొత్తం:** 20 ఓవర్లలో 50/2. **వికెట్లపతనం:** 1-0, 2-33.**బౌలింగ్:** షమీ 3-1-7-0, అశ్విన్ 10-2-38-2, జడేజా 7-4-4-0.



4

టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతంగా 2 వేల పరుగులు, 200ల వికెట్లు తీసిన నాలుగో ఆటగాడిగా అశ్విన్ (51 టెస్టులు) రికార్డు సృష్టించాడు. ఇయాన్ బోథమ్ (42 టెస్టులు), కపిల్ దేవ్ (50 టెస్టులు), ఇమ్రాన్ ఖాన్ (50 టెస్టులు) ఈ జాబితాలో ముందున్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శనివారం 5 ఆగస్టు 2017
WWW. NTNEWS.COM



అక్షరాల దళం.. అరణ్య గళం!

ఈమె ఇప్పుడొక సెన్సేషన్. ఆడవాళ్ల ఆ నాలుగు రోజుల టబూను ఛేధిస్తూ.. 'ఏ బ్రౌన్ గాళ్స్ గైడ్ టు జెండర్ డిస్క్రిమినేషన్' అంటూ లింగ వివక్షతపై అక్షర జడివాన కురిపించింది అరణ్య జోహార్. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈమె వీడియోలకు యువతరం జోహారతులు పడుతున్నది. స్త్రీవాదంపై కలంతో గళ మెత్తిన ఈ యువకెరటం అక్షరాలను దళంగా మార్చుకుని.. గుసగుసలను తన కవిత్వంలో ఒంపుకొని సరికొత్త గొంతుకను వినిపిస్తున్నది. ఈ సందర్భంగా మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చిన అరణ్య జోహార్‌తో జిందగీ ములాఖత్.

- **హైదరాబాద్‌తో మీకున్న అనుబంధం?**
- హైదరాబాద్ గురించి చదువడం, వినడమే తప్ప ఇప్పటి వరకు రాలేదు. ఇదే మొదటి సారి. అమ్మతో కలిసి వచ్చాను. రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కవిత్వం చదివాను. ఆర్ట్‌లైఫ్ సంస్థ ఫౌండర్ తరుష్ సక్సేనా, కో ఫౌండర్ ప్రశాంత్ శర్మ నన్ను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. ఇక్కడి ప్రజలు నన్ను ఆత్మీయంగా పలుకరించారు. మొదటి సారి వచ్చినా.. ఇంతకు ముందు ఎన్నోసార్లు వచ్చిన నగరంలా అనిపించింది. ఎప్పటి నుంచో హైదరాబాద్ బిర్యానీ తినాలని ఉండేది. అది కూడా జరిగిపోయింది.

- **మీరు మాట్లాడిన అంశాలు గ్రామీణ ప్రాంతాల వరకు చేరాలంటే?**
- కచ్చితంగా చేరుతుంది. ప్రజల్లో చైతన్యం వచ్చింది. పది సంవత్సరాలకు ముందు ప్రపంచం ఇలా లేదు. ఇప్పుడు ఎలాంటి సమస్య ఎదురైనా స్పందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆణిముత్యాల్లాంటి వాళ్లు ఉన్నారు. ప్రోత్సాహం అందిస్తే సాధికారత తప్పకుండా సాధ్యమవుతుంది.

- **అమ్మాయిలకు మీరిచ్చే సందేశం ఏంటి?**
- ఎవరూ సామాన్యులు కారు. అమ్మాయిలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరు. ఇది నేను చెప్పే విషయం కాదు. ఇప్పటికీ ఎంతో మంది నిరూపించారు. నేటితరం అమ్మాయిలు ఇంకా అడ్వాన్స్‌గా ఉండాలి. ఏ విషయంపైనా సైలెంట్‌గా ఉండకండి. ఏదో ఒకటి మాట్లాడండి.

- **అమ్మాయిల మీద దాడులకు కారణం వారి డ్రెస్సింగ్ స్టయిలే అంటున్నారు మీరేమంటారు?**
- అది వాళ్ల అమాయకత్వం. మూర్ఖత్వం. నిర్భయ మీద దాడి జరిగినప్పుడు రాత్రి అమ్మాయికి ఏం పని? అన్నారు. రాత్రి ఎనిమిది గంటలకు అమ్మాయి బయటికెళ్తే స్వేచ్ఛ లేదా? అయినా ఆ సమయంలో ఆమె కుర్తీ ధరించింది. ఆ సమయంలో ఆ అమ్మాయి స్నేహితుడు ఇంటిదగ్గర దించడానికి తీసుకెళ్తున్నాడు. దాడులు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించడానికి టాపిక్‌ను డైవర్ట్ చేయడానికి ఇతరత్రా విషయాలపై మాట్లాడటం పద్ధతి కాదు. అలా అంటే నన్స్ మీద కూడా దాడి జరిగింది. వాళ్లు శరీరాన్నంత కప్పుకొనే బట్టలు వేసుకుంటారు. బుర్ఖా వేసుకున్న అమ్మాయి మీద కూడా దాడి జరిగింది. మరీ దీనికి కారణం ఏం చెప్తారు? అమ్మాయిల మీద దాడులకు కారణం డ్రెస్సింగ్ స్టయిల్ అంటే ఎవ్వరూ ఒప్పుకోరు. మనుషుల ఆలోచనా తీరు మారనంత కాలం ఈ దాడులు ఆగవు. మహిళల్ని గౌరవించడం ఇంటినుంచి మొదలుపెడితే గానీ మార్పు రాదు.

- **మీరొచ్చిన బ్యాక్‌గ్రౌండ్ ఎలాంటిది?**
- పుట్టింది గోవా. పెరిగింది మాత్రం చాలా ప్రాంతాల్లో. కొన్నాళ్లు కేరళలో ఉన్నాం. రెండేళ్లు శ్రీలంకలో ఉన్నాం. నాన్న కవిత్వం రాస్తారు. అన్నయ్య కూడా సంగీతంతో పాటు సాహిత్యాన్ని కూడా ఒంటపట్టించుకున్నాడు. ఆ ప్రభావం నాపై పడింది.

- **కుటుంబ నేపథ్యం, చదువు?**
- నాన్న మైసూర్‌లో ఉంటారు. ఐటీసీ హోటల్‌లో జనరల్ మేనేజర్. అమ్మ గృహిణి. అన్నయ్య ర్యాపర్. ప్రస్తుతానికి ముంబైలో ఉంటూ సోఫాయా కాలేజ్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. సైకాలజీ అంటే ఇష్టం. ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ చేసి టీచర్ అవ్వాలనుకుంటున్నారు.

- **కవిత్వం రాయాలని ఎందుకనిపించింది?**
- కవిత్వం చాలా చదివాను. ప్రత్యేకంగా అలాంటిది, ఇలాంటిది అని ఏం లేదు. నచ్చితే ఏ కవిత్వం అయినా చదువుతాను. ముఖ్యంగా మనిషి జీవితానికి దగ్గరగా ఉంటే నచ్చుతుంది. ఇంటికి వచ్చే అన్ని వార్త పత్రికలే కాకుండా నాన్న రాసే సాహిత్యాన్ని, ఇంట్లో ఉండే పుస్తకాలను చదివేదాన్ని. ప్రతి విషయాన్ని చర్చించేవాళ్లం. పుస్తకాల్లో, వార్తా పత్రికల్లో సమాచారంలో ఇతరత్రా విషయాల్లో సందేహం ఉంటే అన్నయ్య, నేను, అమ్మ చర్చించేవాళ్లం. అందుకే ప్రతి విషయాన్ని దూరదృష్టిలో ఆలోచించడం తెలిసింది. మా తల్లిదండ్రులు చాలా ఓపెన్ మైండెడ్. నేను రాసే ప్రతి కవితనూ చదివి వినిపిస్తాను. నాన్న సలహాలు సూచనలు కూడా ఇస్తారు.

- **మొదటిసారి కవిత ఎప్పుడు చదివారు? అది ఎలాంటిది?**
- 2013లో నా వయసు పదమూడు సంవత్సరాలు. బాంద్రాలోని ఐబార్‌లో పోయెట్రీ నైట్ కార్యక్రమం జరిగింది. నేను, అమ్మ, అన్న అక్కడికి వెళ్లాం. అమ్మను, అన్నను లోపలికి అనుమతించారు. కానీ నన్ను వెళ్లనివ్వలేదు. నిర్వాహకులతో మాట్లాడి నేను తాగడానికి రాలేదు.. కవిత్వం చదువడానికి వచ్చానని చెప్పి ఒప్పించాను. అక్కడ చదివిన స్లామ్ పోయెట్రీ నేను వినిపించిన మొదటి కవిత.

- **జీవితంలో మరిచిపోలేని సంఘటన ఏదైనా ఉందా?**
- చాలా ఉన్నాయి. సోషల్‌మీడియాలో నా కవిత్వానికి ఫాలోయింగ్ పెరుగుతుంది. లైక్‌లు పెరుతున్నాయి. కామెంట్లు వస్తున్నాయి. ప్రజలకు దగ్గరవుతున్న ఫీలింగ్ కలుగుతుంది. చెప్పాలంటే ఇంత గుర్తింపు వస్తుందని అనుకోలేదు. లాడ్లీ ఈవెంట్‌లో నాతో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద పెద్ద గెస్ట్‌ల ముందు అక్కడ నాతో కవిత్వం చదివించారు. హాల్ మొత్తం చప్పట్లతో దద్దరిల్లింది. ఇంతకన్నా ఏం కావాలి? నా కళ్లు చెమర్చాయి. నా కవిత్వం జర్మన్‌తో పాటు పలు విదేశీ భాషల్లోకి అనువాదం అయ్యాయి. రాష్ట్రాల సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన పాపులారిటీ వచ్చింది. ఇవన్నీ మరిచిపోలేని సంఘటనలే.



- **మీలా ఇతర అమ్మాయిలు ఎందుకు మాట్లాడలేక పోతున్నారంటారు?**
- ఇంట్లో నేను రాసే కవిత్వం మీద కుటుంబ సభ్యులందరం కూర్చుని మాట్లాడుకుంటాం. చర్చిస్తాం. నేను గమనించిన విషయం ఒక్కటి ఉంది. నాలాగా నాతోటి స్నేహితులు కూడా ఇలాంటి అంశాల మీద వాళ్ల ఇళ్ళలో మాట్లాడలేకపోతున్నారు. కారణం.. వాళ్లు పుట్టి పెరిగిన వాతావరణం, కుటుంబ నేపథ్యం. కానీ ఇప్పుడిప్పుడే మార్పు మొదలైంది. అందరిలో అవగాహన పెరుగుతున్నది. కారణం ఏమైనా ఈ విషయాలు మాట్లాడడం వల్ల నష్టం ఉందో లేదో కానీ.. మౌనంగా ఉండటం నష్టమే. మారుతున్న కాలంతో పాటు మనం కూడా మారాలి. ఏ తల్లిదండ్రులు అయినా పిల్లలకు ఇష్టమైన రంగంలో రాణించడం ఒక్కటే కాకుండా సమాజం మీద పరిస్థితుల మీద సందర్భాన్ని బట్టి స్పందించేలా నేర్పాలి.

- **మీరు ఫుట్‌బాల్ ప్లేయర్ కూడానా?**
- అవును. స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆడేదాన్ని. అక్కడ కూడా వివక్ష. అన్నయ్య కూడా ఫుల్‌బాల్ ఆడేవాడు. తనతో పాటు ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో నన్ను ఇండోర్ గేమ్స్ ఆడమని సలహాలిచ్చేవాళ్లు. నేనుమాత్రం నాకు నచ్చిన ఆటలు ఆడేదాన్ని. స్కూల్ లెవల్ కాంపిటీషన్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ చాలా ఆడాను. మూడేళ్ల తర్వాత మానేశాను. ప్రస్తుతం కొరియన్ ఎంబసీతో కలిసి కొన్ని ప్రాజెక్టులు చేస్తున్నాను. కొరియన్స్ జరిపే కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాను.

- **మీరు చేస్తున్నది కేవలం ఇంటర్నెట్ ఉన్నవాళ్లకే చేరుతుంది? రూరల్ కి చేరడానికి ఏం చేస్తున్నారు?**
- నిజమే! ప్రస్తుతానికి ఇంటర్నెట్‌కి ఎక్కువ రీచ్ ఉంది కాబట్టి యూట్యూబ్ వీడియోల రూపంలో చేస్తున్నాను. ఈ వీడియోలు ముఖ్యంగా మెట్రోపాలిటన్ సిటీస్‌కు ఎక్కువ రీచ్ అవుతున్నాయి. కానీ నేను మాట్లాడే అంశాలు అందరికీ సంబంధించినవి. బాగా డబ్బున్న వాళ్ల సమస్యలు, నిరుపేదల సమస్యలు కూడా. నా వంతుగా చేస్తున్నవి కొందరికైనా చేరుతున్నందుకు సంతోషం. అన్ని ప్రాంతాల్లో చేరడానికి భవిష్యత్తులో ప్రణాళికలు వేసి క్యాంపులు, కార్యక్రమాలు కూడా చేయాలనుకుంటున్నా.


- **ఇప్పటి వరకు ఎన్ని కవితలు రాశారు, నెక్ట్స్ ఏం రాస్తున్నారు?**
- చాలా రాశాను. ఏదీ రాసినా నేను దగ్గరి నుంచి గమనించి రాస్తాను. ఐదు వీడియోలు చేసి యూట్యూబ్‌లో పెట్టాను. నా భావాలను, నా ఆలోచనా విధానాలను అక్షరాలుగా మలిచి కవిత్వాన్ని రాస్తున్నాను. మానసిక సంఘర్షణ, లింగభేదం, వివక్ష వంటి అంశాలను నా కవితా వస్తువులుగా తీసుకుంటున్నాను. అమ్మాయిల రంగు, ఆడవాళ్ల వస్త్రధారణ, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, అమ్మాయిల నెలసరి వంటి అంశాల మీద కవిత్వం రాశాను. భవిష్యత్తులో మరిన్ని కవితలు రాయాలనుకుంటున్నాను. ఇంతమంది నా కవిత్వాన్ని ఫాలో అవుతున్నారు. కాబట్టి నా మీద ఓ బాధ్యత ఉంది. నేనేం రాసినా ప్రత్యేకంగా, పదిమందికి పనికొచ్చేవిగా ఉండాలని అనుకుంటున్నా.

- **ఎలాంటి పుస్తకాలు చదువుతారు?**
- అన్ని రకాల పుస్తకాలు చదువుతాను. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సుకత నాలో ఎక్కువ ఉంటుంది. హ్యారీపోర్టర్ చదివాను. ఇటీవల బరాక్ ఒబామా పుస్తకం చదివాను.

- **న్యాప్‌కిన్ ప్యాడ్‌పై జీఎస్టీని ఎత్తివేయకపోవడం పై మీ పోరాటం?**
- దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాను. ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నాను. ఈ విషయంపై ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో చర్చించడానికి నాకు ఆహ్వానం వచ్చింది. అక్కడికి కేంద్ర ఆరోగ్య మంత్రి, ఆర్థిక మంత్రులు కూడా వచ్చారు. ఆ చర్చా కార్యక్రమంలో న్యాప్‌కిన్ ప్యాడ్స్‌పై జీఎస్టీని ఎత్తివేయకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాను. జీఎస్టీ ఒక ఎత్తయితే లగ్జరీ టాక్స్ కూడా విధించారు. ఈ విషయంపై కూడా మాట్లాడాను. ఆ చర్చలో పాల్గొన్న వాళ్లలో అందరికన్నా చిన్న దాన్ని నేనే. అయినా నా గళం వినిపించాను. జీఎస్టీ పన్ను పెట్టడం వల్ల ధరలు పెరుగుతాయి. అధిక ధరల వల్ల న్యాప్‌కిన్ ప్యాడ్స్ వాడే స్తోమత గ్రామీణ ప్రాంతాల్లో ఉండదని చెప్పాను. న్యాప్‌కిన్ ప్యాడ్స్‌పై సోషల్‌మీడియాలో చర్చ జరిగింది. అమ్మాయిలు కూడా మాట్లాడారు. తమ గొంతును వినిపించారు.

- **ఆ సదస్సులో ఇంకేం చర్చించారు?**
- గ్రామీణ ప్రాంతాల్లోకి న్యాప్‌కిన్ ప్యాడ్స్ వాడకంపై అవగాహన కల్పించాలని కోరాను. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అమ్మాయిలు నెలసరి వచ్చినప్పుడు నెలకు ఐదురోజులు సెలవులు పెడుతున్నారు. ఈ విషయంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని కూడా విన్నవించాను. వాటికయ్యే నిర్మాణ ఖర్చులు, నిర్వహణ ఖర్చులకు సంబంధించిన విషయాలు కూడా చర్చించాం. మెట్రోపాలిటన్ నగరాలను పక్కన పెడితే గ్రామీణ ప్రాంతాల్లో న్యాప్‌కిన్ ప్యాడ్స్ పదం పలుకడానికి కూడా సిగ్గుగా భావిస్తున్నారు. ఇలాంటి చిన్న చిన్న విషయాల మీద అమ్మాయిలు గొంతు విప్పి మాట్లాడాలంటే ఏం చేయాలనే అంశం లేవనెత్తాం. ఎందుకంటే భారతదేశంలో ఎక్కువ గ్రామాలే ఉన్నాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశ అభివృద్ధి ఎంతో దూరం ఉండదు.

ఈ వయసులో వినికిడి యంత్రమా?



అడుగండి చెబుతా

మా పాప వయసు 14 నెలలు. వినికిడి శక్తి సరిగా లేదని డాక్టర్‌కు చూపిస్తే బీఈఆర్‌ఏ పరీక్ష చేశారు,. చెవి నరాలు బలహీనం అయ్యాయని, 20 శాతం మాత్రమే వినికిడి ఉందని అన్నారు. ప్రస్తుతం వినికిడి యంత్రం పెట్టమని సూచించారు. కానీ ఈ వయసులో అది ఉపయోగించడం ఇబ్బందిగా ఉంటుంది. ఆపరేషన్ ద్వారా చెవి లోపల కృత్రిమ యంత్రం అమరుస్తారని విన్నాం. ఇది సాధ్యమేనా? ఈ వయసులో అమర్చవచ్చా? పూర్తి వివరాలు తెలుపగలరు.

రాజు, జగిత్యాల

గర్భంతో ఉన్నపుడు వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకితే పుట్టబోయే బిడ్డకు ఇలా వినికిడి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. తల్లి వాడిన కొన్ని రకాల మందులు కూడా ఇలాంటి దుష్ప్రభావం కలిగిస్తాయి. మేనరికపు వివాహాలు కూడా ఇలాంటి లోపాలు కలిగిన పిల్లలు పుట్టడానికి కారణం అవుతాయి. ఒక్కోసారి జన్యుపరమైన లోపాలు కూడా ఈ స్థితికి కారణం అవుతాయి. మీరు చెప్పిన సమాచారాన్ని బట్టి మీ పాపకు చెవి దగ్గరి నుంచి మెదడుకు సమాచారాన్ని తీసుకెళ్లే నాడులు బలహీనం అయ్యాయి. కాబట్టి కృత్రిమంగా తయారు చేసిన లోపలి చేవి అమరిస్తే ఈ నాడులు ఉత్తేజితమై వినికిడి పరికరం అవసరం లేకుండానే వినికిడి మెరుగవుతుంది. కానీ ఇది చాలా ఖరీదైన సర్జరీ. ఇప్పుడు డిజిట్ హియరింగ్ ఎయిడ్స్ పేరిట వస్తున్న వినికిడి యంత్రాలను బయటకు కనిపించకుండా చెవిలోపలే అమర్చుకోవచ్చు. మీ పాప వయసు ఆరోగ్య పరిస్థితులను బట్టి ఈఎన్‌టీ వైద్యుల పర్యవేక్షణలో ఆడియాలజిస్ట్‌లు వీటిని అమరుస్తారు.



డాక్టర్ మేఘనాథ్
ఈఎన్‌టీ స్పెషలిస్ట్
డైరెక్టర్
మా ఈఎన్‌టీ
హైదరాబాద్

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్ : నమస్తే తెలంగాణ – అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్) #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

వాట్సప్!

ట్వీట్



శ్రీ శ్రీ రవి శంకర్
@SriSri

రవి శంకర్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
2,103,257

జీవితమనే ఈ సముద్రంలో ఈదుతున్నాం. సముద్రాన్ని ఈదాలంటే శక్తి కావాలి. ఇంకో దారి కూడా లేదు. ఇతర శక్తులు కూడా లేవు. ఇది నిజం. ఇదే నిజం.

సమ్‌థింగ్ స్పెషల్



డబుల్ ధమాకా.. ఇదేంది కాకా?!

కామన్‌మ్యాన్ వాయిస్

ఇంఛార్జిగా కుంతియా వచ్చినా, రాహుల్ వచ్చినా చివరికి సోనియా వచ్చినా ఏమీ కాదు. ఎందుకంటే ఇంఛార్జీలు వస్తుంటారు.. పోతుంటారు. మేము మాత్రం పక్కాగా పబ్లిక్ పక్కనే ఉంటాం. మీరు మాత్రం పక్కనే ఉంటామని చెప్పి ఢిల్లీకి వెళ్లి పోతారు.

నజీర్ మహ్మద్

గతం తాలూకు జ్ఞాపకాలను నెమరువేసుకోవడం అంటే.. మంచిని మాత్రమే తలుచుకొని చెడుని వదిలెయ్యమని కాదు. మంచి అనుభవాలను తలుచుకుంటూనే, చేదు అనుభవాలకు వెనుక గల కారణాలని, నీ వల్ల జరిగిన తప్పుల్ని తెలుసుకుంటూ.. వీలైతే వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తూ.. మరలా అవి జరుగకుండా చూసుకోవడం.

Lakshmi Priyanka

ఆకాశం మీదికెళ్లి ఎవరో పిలుస్తున్నట్లు ఎందుకురా బైక్ మీద అంత స్పీడ్‌గా పోతున్నావ్? ట్రాఫిక్ పోలీసులు నీ లైసెన్స్ రద్దు చేయకముందే ఓటర్ కార్డ్ రద్దు చేసుకుంటవ?

Sudheer Kumar Thandra

వైరల్ వీడియో



రాహుల్ సిప్లిగంజ్ 'గల్లీ కా గణేష్' పేరుతో కొత్త పాట చేశాడు. వినాయక చవితి కుర్రాళ్లు చేసే జోష్ అంతా ఈ పాటతో కనిపిస్తుంది. మీరూ ఓ లుక్కేయండి.

RAHUL SIPLIGUNJ - GALLI KA GANESH ft. KOTI (music director)

Total views : 647,541+

Published on Aug 1, 2017

షేరింగ్

టమాటా దొంగల ముఠా

నగరంలో టమాటా దొంగల ముఠాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు విడుదల చేసిన ప్రకటనతో నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట టమాటలకు రక్షణగా పోలీసులు పహారాగా ఉంటున్నారని, ప్రజలు భయపడవద్దని పోలీసులు పేర్కొంటున్నారు. నగర ప్రజలు విహారయాత్రలకు గానీ, దైవ దర్శనాలకు గానీ వెళ్లినప్పుడు ఇంటితో పాటు ఫ్రిడ్జ్‌లకు కూడా గట్టి తాళాలు వేయాలంటున్నారు. మాకు ముందస్తుగా సమాచారం ఇచ్చినట్లయితే ఆయా ఇండ్లకు అదనపు భద్రత కల్పిస్తామని పోలీసులు హామీ ఇస్తున్నారు.

ఓ వాట్సప్ మెసేజ్

ట్రెండ్ మారుతున్నది బాస్.. అంతా గాడ్జెట్స్ గురూస్‌గా మారిపోతున్నారు. అంతేనా ట్రెండ్‌కు తగ్గట్లుగానే తమ ప్రియమైన వారికి గిఫ్ట్స్ కూడా ఇచ్చేస్తున్నారు. యూత్ మైండ్‌సెట్‌కు తగ్గట్లుగా కొత్త గాడ్జెట్స్ మార్కెట్‌లోకి వచ్చేశాయి. వచ్చే ఫ్రెండ్‌షిప్ డేకి మీకు ఇష్టమైన వారికి మర్చిపోలేని మోడ్రన్స్ గిఫ్ట్స్ అందించి మెస్మరైజ్ చేయండి.



'బ్యాండ్' బాజా దోస్త్

బాండ్ వైబ్రేట్ బ్రాస్లెట్



ఈ ప్రపంచంలో మీరెక్కడున్న మీ ప్రియమైన వారిని ఈ బాండ్ వైబ్రేట్ బ్రాస్లెట్ ద్వారా చిన్న వైబ్రేషన్ ఇవ్వొచ్చు. మననం చేసుకోవచ్చు. దీనిని ఫెస్టివల్‌తో సంబంధం లేకుండా ప్రజెంట్ చేయ్యొచ్చు. ఇది మీ ఆప్తులకు, స్నేహితులకు ఇచ్చే అరుదైన బహుమానం. ఇది రెండు సెట్లకు కనెక్ట్ అయి ఉంటుంది. మీ దగ్గర ఉన్న బ్రాస్లెట్‌ను ప్రెస్ చేస్తే.. మీరు ఎవరికైతే రెండోది ఇచ్చారో అది 5 సెకన్లు వైబ్రేట్ అవుతుంది. అది వైబ్రేట్ అయినప్పుడు మిమ్మల్ని అవతలి వ్యక్తి తలుచుకున్నట్లు. ఐఫోన్4ఎస్, ఆండ్రాయిడ్ మొబైల్స్‌కు కనెక్టయి ఉంటుంది. దీని ప్రారంభ ధర 170 డాలర్లు. ఇది ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్లలో లభిస్తుంది.

ఎలక్ట్రానిక్ ఫ్రెండ్‌షిప్ బ్రాస్లెట్



స్నేహితులకు, ప్రియమైన వారికి రహస్యంగా మెసెజ్‌లు పంపుకోవాలనుకుంటున్నారా..? స్నేహితులను ఒకేసారి కమ్యూనికేట్ చేయాలనుకుంటున్నారా..? అయితే ఎలక్ట్రానిక్ ఫ్రెండ్‌షిప్ బ్రాస్లెట్ ప్రయత్నించండి. చూడడానికి వాచ్‌ల కనిపిస్తున్న ఈ బ్రాస్లెట్ చాలా ప్రత్యేకమైంది. ఇది మెసెజ్‌ల ద్వారా స్నేహితులను కమ్యూనికేట్ చేస్తుంది. రహస్యంగా సంకేతాలు పంపుకోవచ్చు. దీనిని కూడా ఫ్రెండ్‌షిప్ డేకు ప్రత్యేకంగా బహుకరిస్తున్నారు. దీని ధర రూ.3,200 నుంచి రూ.7వేల వరకు ఉంది. దీనికి చార్జింగ్ పెట్టుకునే సౌకర్యం కూడా ఉంది. ఇది కూడా ఆన్‌లైన్ స్టోర్లలో.. మార్కెట్‌లలో లభిస్తుంది.

సోలార్ కలర్‌చేంజ్ బ్రాస్లెట్



మీ ప్రియమైన వారి జీవితం రంగుల మయం కావాలనుకుంటున్నారా..? అయితే ఈ గిఫ్ట్ బహుకరించండి. ఇది సోలార్ యాక్టివ్ కలర్ చేంజింగ్ వోవెన్ ఫ్రెండ్‌షిప్ బ్రాస్లెట్. ఇది సోలార్ పవర్‌తో నడుస్తుంది. చూడడానికి తెల్ల రంగులో ఉంటుంది. నీడపడితే బ్లూ, మెజెంతా, పర్పుల్ రంగుల్లోకి మారుతుంది. దీని ఖరీదు 4.95 డాలర్లు. ఇది ఆన్‌లైన్ స్టోర్లలో దొరుకుతుంది.

స్మార్ట్ ఫిట్‌నెస్ బ్యాండ్



మీ స్నేహబంధం కూడా చాలా ఫిట్‌గా, ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో దీనిని స్నేహితులకు బహుకరించవచ్చు. దీనిని ధరించి వారిని ఇది మానిటర్ చేస్తుంటుంది. వీటిల్లో చాలా రకాల మోడల్స్ ఉన్నాయి. ఇవి ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.800 నుంచి మొదలవుతుంది. బయట మార్కెట్‌లో కూడా ఇవి అందుబాటులో ఉన్నాయి.

హెడ్‌ఫోన్ స్ప్లిటర్



ఇది ప్రత్యేకంగా ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్ కోసం తయారు చేసింది. మల్టిపుల్ హెడ్‌ఫోన్‌లా పనిచేస్తుంది. దీనిని ఓ ఫోన్‌కు కనెక్ట్ చేసి.. మిగతా ఐదు పిన్స్ నుంచి ఐదు హెడ్‌ఫోన్స్‌కు పెట్టుకొని ఎంచక్కా పాటలు వినవచ్చు, సినిమాలు కూడా చూడొచ్చు. ఐదుగురికి చాలా కంఫర్ట్‌బుల్‌గా ఉంటుంది. దీని ధర 13 డాలర్లు. ఆన్‌లైన్ స్టోర్లలో, మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

లింకిట్జ్ బ్యాండ్



ఇది చిన్నపిల్లలకు, టీనేజర్స్‌కు చాలా స్పెషల్. ఇందులో ఎల్‌ఈడీ లైట్స్, మ్యూజిక్ స్పీకర్స్, మైక్రోఫోన్, మోషన్ లింక్ వంటివి ఉంటాయి. యూత్‌ను ఈ గాడ్జెట్ బాగా ఆకట్టుకుంటుంది. దీనిని ముందుగా బుక్ చేసుకోవాలి. ధర 60 డాలర్లు. దీనికి యూఎస్‌బీ సౌకర్యం ఉంది. చార్జింగ్ కూడా చేసుకోవచ్చు. ఇది ఆన్‌లైన్ స్టోర్లలో మాత్రమే లభిస్తుంది.

షాక్ కొడుతుంది!

వాహనాల్లో దూర ప్రయాణాలు చేయాల్సి వచ్చినప్పుడు అలసిపోతాం. నిద్ర కమ్ముకొస్తుంది. ఒంటరిగా ప్రయాణం చేస్తే ఇక అంతే సంగతులు. కానీ ఒంటరిగా, జంటగా ప్రయాణించినా మిమ్మల్ని తట్టి లేపేందుకు ఒక బ్రాస్లెట్ వచ్చేసింది.

ఎవరైనా, ఎప్పుడైనా అర్జెంటుగా ప్రయాణం చేయాల్సి రావొచ్చు. అలాంటప్పుడు బస్సులు, రైళ్ల కంటే కార్లలో వెళ్లడానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. అయితే ఒక్కోసారి డ్రైవ్ చేస్తున్నప్పుడు బాగా అలసిపోయి నిద్ర వచ్చేస్తుంది. డ్రైవ్ చేస్తున్నామన్న మాటే కానీ పరిసరాలను గుర్తించే పరిస్థితి ఉండదు. పక్కన ఎవరన్నా ఉంటే వాళ్లు తట్టి లేపుతారు, లేదా అదోఇదో మాట్లాడుతుంటారు. ఒకవేళ వాళ్లూ నిద్రపోతే? ఒంటరిగా ప్రయాణం చేస్తే పరిస్థితి ఏంటి? ఇలా కునుకు తీయడం వల్లే చాలా రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. ఈ ప్రమాదాలకు చెక్ చెప్పేందుకు డిజిటల్ ట్రెండ్స్ సంస్థ 'స్టిర్' అనే బ్రాస్లెట్‌ని తయారుచేసింది. ఇది మీకు పట్టే చెమట, గుండె చేసే పనితీరును బట్టి మీరు నిద్రలోకి జారుకుంటున్నారనే విషయాన్ని పసిగట్టేస్తుంది. దీంట్లో మూడు లైట్లు ఉంటాయి. అందులో ముందుగా తెల్ల లైటు వెలుగుతుంది. మీరు ఏ క్షణమైనా నిద్రపోతారు అలర్ట్‌గా ఉండమనే సంకేతం. మీరు అది గమనించకుండా అలాగే వెళ్తుంటే పసుపు పచ్చ బటన్ వస్తుంది. ఇది ప్రమాద హెచ్చరిక. వెంటనే చిన్న షాక్ ఇస్తుంది. అప్పటికీ మీరు మేలుకోకపోతే ఎరుపు రంగుతో సైరన్ మోగిస్తుంది. ఇందులో ఉండే 16 సెన్సార్లు ఈ పనిని చేసి పెడతాయి. దీని ధర రూ.15వేల పైనే!



కీబోర్డ్‌తో ఆండ్రాయిడ్ ఫోన్..

బ్లాక్‌బెర్రీల అభిమానుల కోసం బ్లాక్‌బెర్రీ కీవన్ స్మార్ట్‌ఫోన్‌ను రిలీజ్ చేసింది. దీంట్లో ప్రత్యేకం ఏమిటంటే.. ఫిజికల్ కీబోర్డ్. ముందు భాగంలో ప్రత్యేకంగా ఉండే ఈ క్వెర్టీ కీబోర్డ్ అందరినీ ఆకర్షించడం ఖాయం.

పేరు : బ్లాక్‌బెర్రీ కీవన్
డిస్ ప్లే: 4.5 ఇంచుల డిస్‌ప్లే
ప్రొటెక్షన్ : స్క్రాచ్ రెసిస్టెంట్ గ్లాస్ ప్రొటెక్షన్
ఆపరేటింగ్ సిస్టమ్ : ఆండ్రాయిడ్ 7.1 నౌగట్
ప్రాసెసర్: 2 గిగాహెర్ట్జ్ స్నాప్ డ్రాగన్ 625 ప్రాసెసర్
ఫ్రంట్ కెమెరా: 8 మెగా పిక్సెల్
రియర్ కెమెరా: 12మెగా పిక్సెల్
ఫొటో రిజల్యూషన్: 1620 X 1080 పిక్సెల్స్
ర్యామ్: 3 జీబీ
ఇంటర్నల్ స్టోరేజ్: 32 జీబీ (2టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్)
బ్యాటరీ: 3505 mAh / **హెడ్ ఫోన్** : 3.5మి.మి. జాక్
బ్లూటూత్ : 4.2 ఎన్ఎఫ్‌సీ, యూఎస్‌బీ టైప్ సి
రంగులు : బ్లాక్ / **చార్జ్** : క్విక్ చార్జ్ 3.0టెక్నాలజీ
ధర: రూ. 39,990



అంధులకు చూపించే అద్దాలు..

చూపు కోల్పోయి ప్రపంచాన్ని చూడలేక జీవితాంతం చీకటిని మాత్రమే చూస్తూ బతికే అంధుల బాధ వర్ణనాతీతం. వారికి ఈ ప్రపంచాన్ని చూడాలని, ఎన్నో కోరికలు ఉంటాయి. వాళ్ల కోరిక ఇలా తీరింది..



అంధులకు క్రికెట్, ఫుట్‌బాల్ లాంటి మ్యాచ్‌లు చూడాలని ఉంటుంది. కానీ ఎలా..యూరప్‌కి చెందిన బ్రైన్ కాసే అనే వ్యక్తి ఆ కల నిజం చేశాడు. 51 సంవత్సరాల కాసే.. చూపు లేనివాళ్లు కూడా చూడగల కళ్లద్దాలు కనిపెట్టాడు. కాసే కూడా చూడలేడు. కానీ ఎన్నో చూడాలని కలలు కనేవాడు. ఈ హైటెక్ కళ్లద్దాలు పెట్టుకొని తన ఫేవరెట్ టీమ్ ఫుట్‌బాల్ మ్యాచ్ కూడా చూశాడు. విజువల్ ఎయిడ్ టెక్నాలజీ సహాయంతో కనిపెట్టిన 'ఈసైట్' అనే పరికరంతో ఆయన తన స్వంత గ్రామాన్ని చూశాడు. 27ఏళ్ల క్రితం చూపు కోల్పోయిన కాసే అప్పటి నుంచే ఏదైనా చూపునిచ్చే పరికరం కనిపెట్టాలని కలలు కనేవాడు. మన కరెన్సీలో 82వేల రూపాయాలు ఖరీదు చేసే ఈ పరికరం మార్చి నెలలో కాసే ధరించి ప్రదర్శించాడు. ఈ అద్దాలు పెట్టుకుని టీవీలో, కంప్యూటర్‌లో ప్లే అయ్యే వీడియోలు చూడవచ్చు.

ప్లేస్టోర్లో మన యాప్స్!


మీ ఫోన్లో ఏమేం యాప్స్ ఉన్నాయి. అందులో మేడిన్ ఇండియా యాప్స్ ఎన్ని? ఏంటీ మేడిన్ ఇండియా యాప్సా? అని విచిత్రమైన ఎక్స్‌ప్రెషన్ ఇవ్వకండి. అవును.. ప్లే స్టోర్లో మేడిన్ ఇండియా యాప్స్ రాబోతున్నాయి.

సాఫ్ట్‌వేర్ దిగ్గజం గూగుల్ బెంగళూరులో నిర్వహించిన యాప్ ఎక్సలెన్స్ సమ్మిట్‌లో అనూహ్య నిర్ణయాలు తీసుకున్నది. ఇప్పటి వరకు ఈ స్థాయిలో ఇండియాలో గూగుల్ ఈవెంట్ నిర్వహిచంలేదు. ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా 'మేడిన్ ఇండియా' పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది. అదే.. ఇకపై మన చేతిలో ఉండే ఫోన్లో మన యాప్సే ఉండబోతున్నాయన్నమాట. ఇండియన్ డెవలపర్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కేవలం ఇండియన్ యాప్స్ మాత్రమే ప్రదర్శిస్తారు. ఇండియన్స్ రూపొందించిన హై క్వాలిటీ యాప్స్‌కి మాత్రమే ఈ సెక్షన్‌లో చోటు కల్పించారు. యాప్ డెవలపర్లు తాము తయారుచేసిన యాప్‌ను ఈ సెక్షన్‌లో చూడాలనుకుంటే g.co/play/madeforindia అనే వెబ్‌సైట్లోకి వెళ్లి సెల్ఫ్ నామినేషన్ ఫారమ్ పూర్తి చేయాలి. ఆ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల బ్యాటరీ ఎంత ఖర్చవుతుంది? డేటా ఎంత ఖర్చవుతుంది? ఇంటర్నల్ కనెక్టివిటీ, అన్నీ ఫోన్లలో పనిచేస్తుందా? లేదా? లాంటి అంశాలన్నీ పొందుపరచాల్సి ఉంటుంది. ఇప్పటికే 700 ఇండియన్ యాప్స్ తమ యాప్‌ను ఇందులో చేర్చారు. ఈ యాప్స్ క్వాలిటీ చెక్ చేసి బెస్ట్ క్వాలిటీ యాప్స్‌ని ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంచుతారు. మిగతా వాటిని అభివృద్ధి చేస్తారు. ఇదీ సంగతి.



గుర్తు తెలియని మెయిల్స్‌తో..

మీకు పరిచయం లేని మెయిల్ ఐడీ నుంచి అనుమానాస్పద ఈ-మెయిల్స్.. మీ అకౌంట్‌లో ప్రత్యక్షమవుతుంటాయి. వాటిని ఎవరు పంపారో తెలీదు. ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలీదు. అలాంటి మెయిల్స్‌ను ఎలా గుర్తించాలో తెలుసుకోండి.



- జీమెయిల్‌లో మెసేజ్ ఓపెన్ చేసిన 'షో ఒరిజినల్'పై క్లిక్ చేసి, మరొక టాబ్‌పై ఆ పేజీ ఓపెన్ అయ్యేలా చూసుకోండి. వేరొక ట్యాబ్‌లో ఒరిజినల్ మెసేజ్ ఓపెన్ అయిన తర్వాత రిసీవర్ కోసం సెర్చ్ చేసి సెండర్ కంప్యూటర్ తాలుకు IPV4 అడ్రస్‌ను కాపీ చేయండి. అడ్రస్ కాపీ అయిన తర్వాత wolframalpha.com అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. ఆ అడ్రస్‌ను పేస్ట్ చేయండి. ఐపీ అడ్రస్ తాలుకు లొకేషన్ వివరాలు తెలిసిపోతాయి.
- ముందుగా మీరు ఆ మెయిల్ అందుకున్న సమయాన్ని గుర్తుపెట్టుకొని టైమ్ జోన్ మ్యాప్ అనే సైట్‌లో ఎంటర్ చేస్తే.. మీకు మెయిల్ పంపిన వ్యక్తి తాలుకు దేశం, ప్రాంతాన్ని చూడొచ్చు.
- మీ ఫేస్‌బుక్ అకౌంట్‌లోకి లాగిన్ అయి.. సెండర్ మెయిల్ ఐడీని సెర్చ్ చేస్తే.. ఆ వ్యక్తి తాలుకా ప్రొఫైల్ బయటపడుతుంది.

సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌ఏ 1 ఆల్ట్రా

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ దిగ్గజం సోనీ.. మార్కెట్‌లోకి కొత్త ఫోన్‌ను ప్రవేశపెట్టింది. అదిరిపోయే ఫీచర్లతో సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌ఏ1 అల్ట్రాను లాంచ్ చేసింది. బ్లాక్, వైట్, గోల్డ్ కలర్స్‌లో డివైస్‌ను ఎంచుకోవచ్చు.

పేరు : సోని ఎక్స్‌పీరియా ఎక్స్‌ఏ 1 ఆల్ట్రా
డిస్ ప్లే : 6 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే
ఆపరేటింగ్ సిస్టమ్ : ఆండ్రాయిడ్ 7.0 నౌగట్
ప్రాసెసర్ : ఆక్టా-కోర్ 64 బిట్ మీడియా టెక్ హీలియో
ఫ్రంట్ కెమెరా : 16 మెగా పిక్సెల్
రియర్ కెమెరా : 23 మెగా పిక్సెల్
ఫొటో రిజల్యూషన్ : 1080 X 1920 పిక్సెల్స్
ర్యామ్ : 4 జీబీ
ఇంటర్నల్ స్టోరేజ్ : 64 జీబీ (256 జీబీ వరకు పెంచుకోవచ్చు)
బ్యాటరీ : 2700 mah
హెడ్ ఫోన్ : 3.5మి.మి. జాక్
ప్రొటక్షన్ : స్క్రాచ్ రెసిస్టెంట్ గ్లాస్
ఎఫ్ఎం : లేదు
సిమ్ : సింగిల్
రంగులు : బ్లాక్, వైట్, గోల్డ్
ధర : రూ. 29,990



రెరా కు స్వాగతం

నిర్మాణ రంగానికి బైబిల్..



రెరా చట్టం వల్ల కొనుగోలు దారులకు సరికొత్త భరోసా కలుగుతుంది. స్థలానికి, నిర్మాణానికెంత ఖర్చవు తుందో వారికి తెలుస్తుంది. బిల్డింగ్ ప్లాన్‌పై రెరా ఆమోద ముద్ర పడ్డాక.. అంతర్గతంగా ఎలాంటి మార్పులు చేయడానికి వీలు కలుగదు. చట్టంలో ప్రతి అంశాన్ని పక్కాగా నిర్వచించారు. ఇక నుంచి డెవలపర్లు ప్రణాళికాబద్ధంగా అపార్టుమెంట్లు, విల్లాలను నిర్మిస్తారు. బిల్డర్లు ప్రతి అంశాన్ని పక్కాగా బేరీజు వేసుకొని తప్పదు. కొనుగోలుదారులకు ఏమివ్వాలి? ఎప్పటిలోపు పూర్తి చేయాలనే విషయంపై అవగాహన వస్తుంది. మొత్తానికి, నగర నిర్మాణ రంగంలో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది. ప్రస్తుతం, మన రాష్ట్ర నిర్మాణ రంగానికిది బైబిల్ లాంటిదని చెప్పొచ్చు.

– వేణువినోద్, ఎండీ, సైబర్‌సిటీ డెవలపర్స్

ఎన్నాళ్ల నుంచో ఎదురుచూపు..



'రెరా' చట్టం గురించి గత ఐదేండ్ల నుంచి ఎదురు చూస్తున్నాం. మొదటిసారి ఇల్లు కొనుక్కునేవారికి ఇది పూర్తి స్థాయి భరోసానూ కలిగిస్తుంది. ఇండ్లను కొనుక్కోవడానికి వెనకడుగు వేసేవారికి.. ఇక్కడే కొనే విధంగా ప్రోత్సహిస్తుంది. పైగా, స్పష్టమైన నిబంధనల్ని ఏర్పాటు చేశారు. పద్ధతి ప్రకారం ఇండ్లను చేపట్టే డెవలపర్లకు రెరా చట్టం చక్కటి ప్రోత్సాహానిస్తుంది. దీని వల్ల ఇతర నగరాల్లో ఇండ్లను కొనాలని భావించే ఐటీ ఉద్యోగులు చివరికి భాగ్యనగరంలోనే స్థిరనివాసం ఏర్పరచేలా ప్రోత్సహిస్తుంది. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను మినహాయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఏ చట్టమైనా ప్రస్తుత తేదీ నుంచి అమల్లోకి రావాలిసిందే. అప్పుడే, ఆ చట్టం విజయవంతంగా అమలవుతుంది.

– వి.రవీందర్‌రెడ్డి, ఎండీ, గౌతమీ డెవలపర్స్

సీఎంకు ధన్యవాదాలు..



ఎట్టకేలకు రెరా చట్టం అమల్లోకి వచ్చేసింది. కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తంలో 70 శాతం ఎస్క్రో ఖాతాలో జమ చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. గతంలో ఈ చట్టంపై కొంత అస్పష్టత ఉండేది. ప్రస్తుతం అది తొలగిపోయింది. మానవతా దృక్పథంతో ఆలోచించి కొనుగోలుదారులను, నిర్మాణ రంగాన్ని ఆదుకోవడానికి 'రెరా'ను తీర్చిదిద్దినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మన నిర్మాణ రంగం విరాజిల్లుతుంది.

– దశరథ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు, ట్రెడా

సంపూర్ణ పారదర్శకత..



'రెరా' చట్టం వల్ల నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుంది. కొనుగోలుదారులు, డెవలపర్లు జవాబుదారీతనంగా వ్యవహరిస్తారు. తెలంగాణ నిర్మాణ రంగం గణనీయంగా వృద్ధిలోకి తీసుకెళ్లే నిర్ణయమిది. నిజానికి, యావత్ తెలంగాణ డెవలపర్లు రెరా చట్టం గురించి ఎదురు చూస్తున్నారు. పట్టణాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెడుతున్నది. రెరా రాక వల్ల.. నిర్మాణ రంగం మరింత వ్యవస్థీకృతంగా అభివృద్ధి చెందుతుంది. దేశంలోనే ఇంత పక్కాగా రెరా నిబంధనలు లేవనే చెప్పాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– గుమ్మి రాంరెడ్డి, అధ్యక్షుడు, క్రెడాయ్ తెలంగాణ

హైదరాబాద్
శనివారం, 5 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

సొంతింటికి 'రెరా' రక్షణ!



సొంతిల్లు కొనుక్కునేటప్పుడు రకరకాల సందేహాలు.. అనేక అనుమానాలు కలగడం సర్వసాధారణమే. ఫ్లాట్ బుక్ చేశాక సొమ్ము కడితే, సకాలంలో డెవలపర్ ఫ్లాటును మన చేతికిస్తాడా? నాణ్యతగా నిర్మిస్తాడా? ఇలా రకరకాల అనుమానాలు పట్టిపీడిస్తాయి. ఏదో ఆదరాబాదరాగా అపార్టుమెంట్ కట్టేసి, బిల్డర్ చేతులు దులిపేసుకుంటే? సొమ్ము కట్టినతర్వాత ఇలాంటి సందేహాలు వెంటాడుతూ ఉంటాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇల్లు కొనుక్కుని గృహప్రవేశం చేశాక.. లీకేజీలు స్వాగతం పలికితే? నాసిరకం కమోడ్లు, నాణ్యత లేని స్విచ్ బోర్డులు మనల్ని ఆహ్వానిస్తే ఎలా?

హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కున్నవారికి ఇలాంటి ఇబ్బందులు సహజంగా మారాయి. అయితే, ఇక నుంచి కొనుగోలుదారుల ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కర్టెసీ.. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ. అదే.. 'రెరా'. ప్రభుత్వం 'రెరా'ను ఆమోదించింది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ఇల్లు కొన్నా సంపూర్ణ రక్షణ ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల తెలంగాణ నిర్మాణ రంగం హర్షం వ్యక్తం చేస్తున్నది.

మోసపూరిత డెవలపర్ల బారిన పడకుండా కొనుగోలుదారులకు సరికొత్త భరోసా లభించనుంది. స్థల యజమానితో ఒప్పందం కుదుర్చుకుని.. అనుమతికి దరఖాస్తు చేసుకుని.. మరోవైపు, అందమైన బ్రోచర్లు ముద్రించి కొనుగోలుదారుల నుంచి సొమ్ము వసూలు చేసే రోజులు కావివి. రెరా చట్టం రాష్ట్రంలో అమల్లోకి రావడంతో.. ఇక నుంచి డెవలపర్లు అతి జాగ్రత్తగా ఇండ్లను నిర్మించాల్సి ఉంటుంది. 'రెరా' ఆమోదం పొందాకే బిల్డర్లు అపార్టుమెంట్లను నిర్మించాలి. ఎట్టి పరిస్థితుల్లో తప్పుడు ప్రకటనల్ని విడుదల చేయడానికి వీల్లేదు. ప్లాట్ల విక్రయం సమయంలో కొనుగోలుదారులకు చెప్పిన గడువుకే ఇండ్లను అందించాలి.

డెవలపర్ల గతచరిత్ర..

ఫ్లాట్ కొనేటప్పుడు బిల్డర్ గురించి తెలుసుకోవాలంటే.. 'రెరా' అథారిటీ రూపొందించే వెబ్‌సైటుకు వెళ్లితే.. పూర్తి వివరాలు తెలుస్తాయి. గత ఐదేండ్లుగా ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశాడు? ఎక్కడెక్కడ కట్టాడు? సకాలంలో ఫ్లాట్లను అందించాడా? కొనుగోలుదారులతో గొడవ పడ్డాడా? ఇలాంటి విషయాలు తెలుస్తాయి. దీంతో, ఆయా అపార్టుమెంట్లలో ఫ్లాట్ కొనాలా? వద్దా? అనే అంశంలో తుది నిర్ణయానికి రావొచ్చు.

రెరాలో ఫిర్యాదు ఎలా?

కొనుగోలుదారుడు తనకు జరిగిన అన్యాయంపై రెరాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారం నింపి రూ.1000 ఫీజు చెల్లించాలి. చెక్, డీడీ ఏదైనా తీసుకుంటారు. కొన్నవారి ఫిర్యాదు ఆధారంగా రెరా విచారణ చేపడుతుంది. డెవలపర్‌కు నోటీసులు జారీ చేస్తుంది.

- నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు కొనుగోలుదారుడు డాక్యుమెంట్లను సమర్పిస్తే.. డెవలపర్‌కి రెరా అథారిటీ వివరిస్తుంది. సదరు డెవలపర్ తప్పుని అంగీకరిస్తే.. అతని విన్నపాన్ని నమోదు చేసుకుని అపరాధ రుసుము వసూలు చేస్తారు. తప్పు అంగీకరించకపోతే రాతపూర్వకంగా వివరణ తీసుకుని జరిమానా విధిస్తారు.

డెవలపర్లు వినకపోతే..

'రెరా' వద్ద నమోదు చేసుకోకుండా ప్రాజెక్టులను ప్రకటిస్తే.. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం జరిమానాను డెవలపర్ల నుంచి వసూలు చేస్తారు. రెరా ఆదేశాలను డెవలపర్లు బేఖాతరు చేస్తే ముక్కు పిండి పరిహారం వసూలు చేస్తారు. కాబట్టి, కొనుగోలుదారులు తమకు జరిగిన అన్యాయంపై రెరాకు ఫిర్యాదు చేస్తే.. తప్పకుండా 'రెరా'లో న్యాయం జరుగుతుంది. పైగా, ఆయా డెవలపర్ల నుంచి పరిహారమూ వసూలు చేస్తారు.

నమస్తే తెలంగాణ రియల్ ఎస్టేట్ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE



★499/- రూ||కే (ఫిక్స్‌డ్) చ|| గ|| యాదాద్రి దగ్గర 500 గ|| ఫార్మ్ ల్యాండ్స్ (2.5L) ప్లాంటేషన్ మెయింటనెన్స్ మోత్కూర్ రోడ్ WGL హైవే క్లి|| టై||, స్పా|| రి|| (నో మీడియేటర్స్). Ph: 9000202540, 9000744158.
NT-188552

★మీ పిల్లల బంగారు భవిష్యత్‌కై శ్రీశైలం హైవే కడ్తాల్ టౌన్‌కి దగ్గరలో DTCP లేఅవుట్‌లో ఓపెన్ ప్లాట్లు Nr.ORR, ఫార్మా సిటీ, ప్లాట్ బుకింగ్‌పై గోల్డ్ కాయిన్ ఫ్రీ, లోన్ సౌకర్యం. Ph: 9014297729.
NT-188114

★వరంగల్ హైవే బీబీనగర్ & భువనగిరికి దగ్గరలో చుట్టూ 9అడుగుల గోడతో 24 శ్రీ గంధం, మలబార్ మొక్కలతోకూడిన ఫామ్ ప్లాట్స్ చ|| గ|| 1849/- లకే. స్పాట్ రి||. Ph: 9010255556
NT-887

★I, Adibatla HMDA LP No.99/ LO/PLG/ HMDA/2016 Resi/ Comm Plots 0.5KM ORR, 1.5km TCS & Wonder LA, Spot Reg, Loans. Ph:8522030914, 9951373883.
NT-181827

★మేడ్చల్ హైవే ఫేసింగ్ HMDA అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటీలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో Open Plots కలవు. సం|| 9959875653/ 8885444432.
NT-182182

★DTCP లేఅవుట్ షాద్‌నగర్ టోల్‌గేట్ దగ్గర్లో, గజాం కేవలం 1900 to 5800. ఓపెన్‌ప్లాట్స్ **బీబీనగర్ నిమ్స్ హాస్పిటల్**. HMDA APPVD రెసిడెన్షియల్ ప్లాట్స్ .గజం కే|| 4700, **9440992190.**
NT-182317

★శ్రీశైలం హైవే కడ్తాల్ టౌన్‌కి ఆనుకుని 100 F+ రోడ్ ఫేసింగ్ DTCP లేఅవుట్ Nr.ORR, ముచ్చర్ల ఫార్మాసిటీకి చేరువలో అతి తక్కువ ధరకు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పా||. రిజి||. Ph: 7780483434.
NT-188109

★అప్పా జంక్షన్ చిలుకూరు విలేజ్‌కి ఆనుకొని **100 Ft** రోడ్ ఫేసింగ్‌లో 10 సం||ల మామిడి మొక్కలతో క్లబ్ హౌస్‌తో ఫామ్ ప్లాట్లు అతి తక్కువ ధరకు కలవు. Ph: 9441355694.
NT-182535

★యాదాద్రికి సమీపంలో గ|| కే|| 1899/- & 12 ఎర్రచందనం మొక్కలతో ప్లాటు కొనండి, మొదటి 10 మందికి 10గ్రా Gold Coin ఆఫర్, సంప్ర|| Ph: **8885770055**
NT-182377

★యాదగిరిగుట్ట, WGL హైవే@వంగపల్లి, DTCP అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్స్‌లో Residential ప్లాట్స్ విత్ Confirmed TLP నంబర్స్, ఫ్రీ రిసార్ట్ మెంబర్‌షిప్, 4 సం|| తర్వాత డబల్ అమౌంట్‌కి **బై బ్యాక్ అగ్రిమెంట్.** Ph: **9000948590/ 9849068590**
NT-182310

★వరంగల్ హైవే ఘట్‌కేసర్ అంకుశాపూర్ విలేజ్‌నందు హైవేకి 0.5KM దూరంలో HMDA Plots LP No:030/LO/Plg, Near Aurora Engg College. Rs.7999/- Bank Loans. Ph: **9440515793.**
NT-182521

★ఇల్లు కట్టుకోవడానికి 60గ|| 67 వేలకే. Nr.Int. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్ Nr. సువర్ణభూమి, 50%కే రిజి|| & మిగితాలోన్. ఆఫర్ 9 కస్టమర్లకే.Ph: 9346887779.
NT-188131

★ఆదిబట్ల న్యూ HMDA లేఅవుట్ వెంచర్ Opening Offer@ ఎలిమినేడు 60% బ్యాంక్ లోన్ Rs: 4999/- Per Sq.yd. Cont: **9063368992**
NT-188162

★ఇల్లు కట్టుకోవడానికి 60 గ|| 67 వేలకే. యాదగిరిగుట్ట, చౌటుప్పల్, సంగారెడ్డి, మొమిన్‌పేట్, షాద్‌నగర్, వికారాబాద్ ఏరియాలలో . ఫోన్: 9542671999.
NT-188132

★Adibatla HMDA LP No :99/LO/PLG/ HMDA/2016 Resi/Comm, Plots 0.5Km ORR, 1.5Km TCS, & Wonder La, Spot Reg. Loans. Ph : 9550963616,9618185795.
NT-182502

★SSR డెవలపర్స్ వారి యాదగిరిగుట్ట పాత లక్ష్మినరసింహ గుడికి దగ్గరలో DTCP అప్రూవ్డ్ లేఅవుట్ అన్ని డె|| తక్కువ ధరలో ప్లాట్స్ కలవు. స్పా||రి||. Ph: 9948033142, 8885731233.
NT-182307

★శుభగృహ HMDA అప్రూవ్డ్ ప్లాట్స్ LP No.01/HMDA/2016, నందిగామ @గచ్చిబౌలి & శంషాబాద్ @ ఆదిభట్ల దగ్గరలో 60% బ్యాంక్ లోన్‌తో ప్లాట్స్. 9666688801.
NT-714

★HMDA Sagar highway beside Gurunanak College, Adibatla Gated Community 880, 992 Sq yds 100' Rd TCS Rd, 2400 Sq yds Ph: 9866243252/ 9100984371.
NT-182505

★సాగర్‌హైవే ఆదిబట్ల మంగళ్‌పల్లి కొంగరకలాన్ రావిర్యాలలో గల HMDA అప్రూవ్డ్ లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును. కొనబడును. లోన్స్ సౌకర్యం. Ph: 9700515919.
NT-182512

★భువనగిరి హైవే కాళీమాత టెంపుల్ వెన్నెల కాటేజీ ఆనుకొని గోల్డెన్ న్యూ వెంచర్ డబుల్ బెడ్‌రూమ్ 150yards 1000, expect 35 లక్షలు బ్యాంకు లోన్. Booking No. 8465003623.
NT-181825

★అధిక రాబడి, శ్రీ గంధం మొక్కలతో బీబీనగర్ దగ్గర మెగా వెంచర్‌లో ఫామ్ ప్లాట్స్ కలవు, మీ పెట్టుబడి పదింతలయ్యే అవకాశం, 150 గజాల ప్లాట్ ధర కేవలం 2.80లక్షలకే. సం|| 9849076059.
NT-734

★ECIL@హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్‌కి 1km దూరంలో 100అడుగుల రోడ్ ఫేసింగ్‌తో HMDA అప్రూవ్డ్ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నందు హౌసింగ్ ప్లాట్స్ కలవు. రోడ్స్, పార్క్, కాంపౌండ్‌వాల్, 24x7 సెక్యూరిటీ అండర్‌గ్రౌండ్ వాటర్ సప్లయి డ్రైనేజ్; ఎలక్ట్రిసిటి, స్ట్రీట్‌లైట్స్, వాటర్‌ట్యాంక్ కలవు. EMI బ్యాంక్‌లోన్ ఫెసిలిటీతో ఇళ్ల మధ్యలో ఈ రోజే ఇల్లు కట్టుకొనే విధంగా లాంచింగ్ ఆఫర్ ప్లాట్ బుక్‌చేసుకొన్న కస్టమర్‌కి 10gr gold Coin ఫ్రీ. ఈ ఆఫర్ 3రోజులు మాత్రమే. ఫ్రీ సైట్ విజిట్ కొరకు. Ph: 8106101817.
NT-180100

★HMDA LAYOUT@KOLLUR & VELIMELA Plots, Beside Ring Road, Near Schools & Colleges, Loan Avail. We Got LP Number & Ready to Construction. 9908727373.
NT-430

★చౌటుప్పల్, హైవేకి 1/2 KM దూరంలో ఎర్రచందనం వెంచర్‌లో ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, ఫ్రీ మెయింటనెన్స్ విత్ లీగల్ అగ్రిమెంట్ . Ph: 8801576948.
NT-182098

★Sai Surya Developers HMDA Layout 200" Road Face with LP No @ Patighanpur Near to Gachibowli. Con: 8121000834/ 9603479562.
NT-176989

★NH-7 హైవే ఫేసింగ్@ షాద్‌నగర్ C.No.820/2017, లే అవుట్‌లో NRSCకు దగ్గరగా వెంటనే ఇల్లు నిర్మించుకొనుటకు, బ్యాంక్‌లోన్ సదుపాయంతో అతి తక్కువ ధరకు ప్లాట్స్. Ph: 7997063666/7997062666.
NT-54

★రాజేంద్రనగర్‌కు శంషాబాద్‌కు దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్సుల సౌకర్యంతో 100 గ|| 1,50,000/-, మాత్రమే EMI, ఫ్రీ రిజి|| & సైట్ విజిట్ ఫ్రీ, సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd # 73/A 2nd ఫ్లోర్, మాస్టార్ బ్లిస్ అపార్ట్‌మెంట్, శివబాగ్‌కాలని, NR. S.R. నగర్. P.S, అమీర్‌పేట్. Ph: 9849973149, 040-23739969.
NT-165758

★New HMDA & HMDA Norms Venture Open plots for Sale beside Adibatla TCS, Company & Nagarjuna Sagar Highway facing New Venture Launching Offer Price 3,999/- Sq.yard. Contact No. 7981592179, 8801878980.
NT-188104

★99000/-కే 100 గ||. 10 యాపిల్ బేర్ మొక్కలతో, వరంగల్ హైవే నీయర్ ఆలేరు రైల్వే స్టేషన్, 9వేలకే ప్లాట్ బుకింగ్, స్పాట్ రిజి||, EMI సౌకర్యం.Ph: 9912093699.
NT-188116

★గండి మైసమ్మ 'X' రోడ్ HMDA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ For Sale. LP No.తో 12Km from మియాపూర్, స్పాట్ రిజి||, బ్యాంక్ లోన్ సౌకర్యం.Ph: 9000106220.
NT-102

★ఆదిబట్ల@బొంగ్లూరు HMDA గేటెడ్ కమ్యూనిటీ (L.P.No.)తో Rich Meadows ప్లాట్లు & ఇండ్లు అన్ని Devpతో విశ్వేశ్వరయ్య కాలేజ్ ఎదురుగా. Ph: 7306432555, 8885937555
NT-188117

★సాగర్‌హైవే ఆదిబట్ల Rs. 6499/- to 7499 HMDA ప్లాట్లు with L.P.No. అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు TCS, ORR, Wonderla దగ్గరలో 60% లోన్ సౌకర్యం. Ph: 9951334943.
NT-182549

★మిషన్ భగీరథ & కలెక్టరేట్స్ దగ్గర అన్ని డెవలప్‌మెంట్స్‌తో HMDA @ భువనగిరి 50% బైబ్యాక్ అమౌంట్ 2 సం||లకు & ఫామ్‌సైట్స్ @ వీరపల్లి ఆపిల్‌బేర్ & రిసార్ట్స్. Ph: 8096688361.
NT-188177

★షాద్‌నగర్, బెంగుళూర్ హైవేకి ప్రక్కన రెసిడెన్షియల్ ప్లాట్స్ కేవలం రూ.2,25,000/- మాత్రమే, వెంటనే ఇల్లు కట్టుకోవచ్చు, 5yrs ఫ్రీ సెక్యూరిటీ/ మెయిన్‌టెనెన్స్, స్పాట్ రిజి||. Ph: 9391231201.
NT-182298

★వరంగల్ హైవే బీబీనగర్ & భువనగిరికి దగ్గరలో చుట్టూ 9 అడుగుల గోడతో 24 శ్రీ గంధం, మలబార్ మొక్కలతో కూడిన ఫామ్ ప్లాట్స్ చ||గ|| 1849/-లకే స్పాట్ రి||. Ph: 9000242796
NT-866

★శ్రీశైలం హైవే కందుకూరు ముచ్చర్ల ఫార్మాసిటీ దగ్గర BT రోడ్‌కి ఆనుకొని ఇండ్ల ప్రక్కన. పండ్ల మొక్కలు, మల్‌బార్ మొక్కలతో ఫామ్ ప్లాట్స్ ఇల్లు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్ కలవు, EMI Avbl. Ph: 9849063344
NT-182410

★అదిభట్ల 540 ఎ|| HMDA మెగావెంచర్ సాగర్ హైవేఫేసింగ్ @ IBP Dev LPNo : 45/2017 Nr. TCS, ORR, Wonderla. Aerospace, లోన్స్. Ph: 9848486259,8919372692.
NT-188121

★షాద్‌నగర్‌టౌన్‌లో 100 గజాలు 1,00,000/- మాత్రమే ఫ్రీ రిజి|| & సైట్ విజిట్ ఫ్రీ సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. #73/A, 2nd ఫ్లోర్, మాస్టార్‌బ్లిస్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్. P.S., అమీర్‌పేట్. Ph: 8185936389, 040-40246023.
NT-165757

★100 చ|| గ|| ప్లాటు 89 వేలకే. Nr.ఎయిర్‌పోర్ట్@ షాద్‌నగర్, Nr. సువర్ణ భూమి, 10 వేలకే. రిజి||. & మిగతా వాయిదాలు, ఇండ్లకు దగ్గర. Ph: 9505289998.
NT-188130

★వరంగల్ హైవే, భువనగిరి యాదాద్రి కొత్త జిల్లా సమీపంలో గేటెడ్ కమ్యూనిటీలో 167 Sq.yds. "15" శ్రీ గంధం మొక్కలు కలవు. 1656 per Sqyd. EMI సదుపాయం కలదు, అన్ని డెవలప్‌మెంట్స్‌తో. Ph: 9676133133.
NT-177006

★Pragati Resorts Presents Open Plots for sale on Warangal NH Highway Pragathi Sphoorthy DTCP Approved. (LTP No.24/2016/H). Ph: 9100499985.
NT-188127

★యాదాద్రి వంగపల్లి 200ft బైపాస్ వద్ద DTCP అప్రూవ్డ్ (TLP No:181/15) గే|| క|| లేఔట్ నందు కొద్ది ప్లాట్లు కలవు, స్పా||రి|| EMI/ లోన్ సౌకర్యం Cont: 8328389727/ 9848397944.
NT-182374

★99,000/- లకే 100 చ|| గ||ల ఇంటి స్థలం శంషాబాద్‌కు అతి దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు డైరెక్ట్ కంపెనీ ఆఫర్, స్పాట్ రిజి||, సైట్ విజిట్ ఫ్రీ. సంప్ర|| 9949695027
NT-165780

★వరంగల్ హైవే బీబీనగర్-గూడూరు NIMS, Schools, Colleges సమీపంలో అన్ని Davpతో "శ్రీ లక్ష్మీనగర్" వెంచర్‌లో ప్లాట్లు కలవు. సంప్ర|| 9494659494.
NT-188138

★గజం కే|| 1200, 1800, 2500, 2999, 5999 & 8500/- రూ|| అన్ని Devpతో HMDA, YTDA, DTCP, GP. ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కలతో ప్లాట్లు కలవు. Ph: 9177151699, 7893545679.
NT-188137

★న్యూ లాంచింగ్ HMDA అప్రూవ్డ్ ప్లాట్స్ Nr. ఆదిభట్ల (కొంగరకలాన్) విత్ 70% బ్యాంక్ లోన్స్, YTDA అప్రూవ్డ్ ప్లాట్స్ యాదగిరిగుట్ట(మల్లాపూర్ విలేజ్) వాట్సాప్. Ph: **7794835154/ 9032878926**
NT-182462

★ బెంగుళూరు హైవే ఫేసింగ్ DTCP అప్రూవ్డ్ వెంచర్‌లో (గేటెడ్ కమ్యూనిటీ) @ షాద్‌నగర్ స్మార్ట్ సిటీ, NRSC దగ్గరలో అతి తక్కువ ధరకే ఇల్లు కట్టుకొనుటకు ప్లాట్స్ లభించును. వెంటనే రిజిస్ట్రేషన్ చేయబడును. సంప్ర: **9550647543.**
NT-182465

★జనగాం సిటీలో రెండు హైవేలు కలుపుతూ ఉన్న బైపాస్ ప్రక్కన 1000 చ|| గ|| ప్లాట్లు కేవలం 12 లక్షలకు మాత్రమే అమ్మకానికి కలవు.Ph: 7287075999.
NT-182330

★మీ పిల్లల బంగారు భవిష్యత్‌కి ఎర్ర చందనం చెట్లు ఉన్న మా ప్లాట్లలో చిన్న మొత్తంలో పెట్టండి, తిరిగి అధిక ఆదాయంతో మీ పిల్లల భవిష్యత్‌కు భరోసా ఇవ్వండి. Ph: 9849851044/ 9951035995.
NT-182542

★యాదాద్రిలో YTDA అప్రూవ్డ్ లే-అవుట్ యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము నుండి కేవలం 2 ని||ల ప్రయాణ దూరంలో సకల సౌకర్యాలతో అందిస్తున్న 30 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో "బంగారం లాంటి ప్లాట్లు" బ్యాంకు లోన్ సౌకర్యంతో ఆకర్షణీయమైన ధరలో అందుబాటులో కలవు. "ప్రతి నిత్యం స్వామి దర్శనం అంతులేని సౌభాగ్యం" ఫ్రీ సైట్ విజిట్ & ప్లాట్ బుకింగ్ కొరకు సంప్రదించండి: Meenesh, Ph: 9010708466/ 9948544173.
NT-188150

★శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ – శ్రీశైలం హైవే IT, రెసిడెన్షియల్ కారిడార్ & ముచ్చెర్ల ఫార్మా సిటీ రీజనల్ రింగ్ రోడ్ ఫేసింగ్ ప్లాట్స్ కలవు. ఫ్రీ సైట్ వి||, స్పాట్ రి||. Ph: 8008134444.
NT-165789

★రామోజీ ఫిల్మ్ సిటీ, Om City, 108 దేవాలయాలకు దగ్గరలో, శ్రీగంధం మొక్కలతో, 150, 200 గజాల ప్లాట్లు అమ్మబడును. మార్కెటింగ్ చేయుటకు M/F కావలెను. Ph: 9700363377.
NT-188355

★Prestageous 540 Acres HMDA Mega Venture with Intl. Dev's @ Sagar Highway IBP Beside Gurunanak Eng. College, 75% Loans. Nr. TCS, ORE, BDL. Ph: 7799994742.
NT-188149

★Kadthal-Near Mucherla Pharma City: DTCP Approved (L.P.No: 20/2017/HRO/H1) 165/200 Sq.Yds E/W Resi. & 300 - 600 Sq.Yds Comm.Plots with Full Developments, 80% Bank Loan. Ph: 9700668034/74. (Marketing Teams also Invited).
NT-182211

★కేవలం రూ. 1,25,000/- లకే 200 చ.గ.ల ఇంటిస్థలం, హైదరాబాద్ (రామోజీఫిల్మ్‌సిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లి|| టైటిల్, స్పాట్ రిజి|| Ph: 9948078062; 7396012127.
NT-182430

★ఫేమస్ ప్రగతి రిసార్ట్స్ వారి YTDA/DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ @యాదాద్రి. YTDA గ|| రూ. 4000/-, DTCP గ|| రూ. 3300 లోన్ సౌకర్యం కలదు. ఫ్రీ రిసార్ట్స్ మె|| షిప్ ఫోన్: 7095971212.
NT-182547

★యాదగిరిగుట్ట దగ్గర్లో DTCP అప్రూవ్డ్ లేఅవుట్ అన్ని వసతులతో 33', 40' BTరోడ్స్ కలవు. అతి తక్కువ ధరతో మరియు EMI సౌకర్యంతో ప్లాట్లు. Ph: 9441666608, 9032012124.
NT-182074

★యాదాద్రి పుణ్యక్షేత్రానికి సమీపంలో పూర్తిగా డెవలప్ చేయబడిన DTCP & HMDA వెంచర్‌లలో మీ అందుబాటు ధరలకే ప్లాట్లు లభించును. Ph: 7893999993.
NT-188105

★గజం:2800/- మాత్రమే ఘట్‌కేసర్, శ్రీ చైతన్య, అరోరా, VBIT కాలేజ్ దగ్గరలో & కీసర ప్రపోస్డ్ 100 ft రోడ్డుకు అనుకొనివున్న రెసి|| వెంచర్‌లో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి|| చేసుకున్న వారికి డిస్కౌంట్ కలదు. Ph: 9059915999, 7013496532.
NT-188118

HMDA PLOT FOR SALE

★శుభగృహ వారి HMDA అప్రూవ్డ్ ప్లాట్స్ LP No.01/HMDA/2016, నందిగామ@గచ్చిబౌలి, & శంషాబాద్ @ఆదిభట్ల దగ్గరలో, 60% బ్యాంక్ లోన్‌తో ప్లాట్స్: 9000716677.
NT-877

HMDA PLOTS & VILLAS

★ఆదిభట్ల HMDA అ|| LP.No-104 లేఅవుట్‌లో 150 ఫీట్ రోడ్, క|| రె|| ప్లాట్లు, స్పాట్ రిజి||, బ్యాంక్ లోన్స్. పంతంగి Vja హైవే 1st టోల్‌గేట్ దగ్గర ఎర్రచందనం మొక్కలతో ప్లాట్లు, స్పాట్ రిజి|| & EMI. యాదాద్రి YTDA అప్రూవ్డ్ LP.No.01 వెంచర్. సంప్ర|| 8801321026.
NT-182479

HOUSE FOR SALE

★INDP & Duplex Houses HMDA Layout 25L to 50L 5km from Aadibatla IT Companies Nr.ORR, Loans. B.Bheem Reddy. Ph: 8885060741, 9700974808.
NT-182519

★ఇండిపెండెంట్ హౌస్ 14,50,000/-లకే సాగర్ హైవే ఇబ్రహీంపట్నం దగ్గరలో మరియు ఓపెన్ ప్లాట్లు. ఫార్మాసిటీ, ఆదిభట్ల సాఫ్ట్‌వేర్ సిటీ, BDL, NSG దగ్గరలో, బ్యాంక్ లోన్ ఫెసిలిటీ. Ph: 9010544228.
NT-188142

★నాగోల్ బండ్లగూడ RTC డిపో దగ్గర Indp. హౌసెస్, 133 Yds - 32L, 200 Yds- 48 లక్షలు 85% లోన్ సౌకర్యం. Ph: 7672010980, 9502364183.
NT-181819

★Nadergul beside MVSR Engineering College, Gated Community 2BHK Dlx Indp. Houses@TCS Adibatla. Call: 9346375131.
NT-1063

★బడంగ్‌పేట్ Indp. 2 BHK House for Sale 85% Loan, Clear Title, 147 Sq.Yds, N/F, G+1 Perm., Car Parking, Krishna Water, Low Price. Cont: Ph: 9241730949, 8885800552.
NT-182415

★ఉప్పల్ మెట్రో స్టేషన్ దగ్గర్లో GHMC లేఅవుట్‌లో విల్లాస్, సోలార్, C.C. కెమెరాలతో, క్లబ్ హౌజ్ & స్విమింగ్ పూల్, All Amenities. 80% లోన్, Ph: 9059976884.
NT-181549

★ఈస్ట్ ఫేస్ ఓపెన్ ఫ్లాట్ ఘట్‌కేసర్ బస్‌స్టాప్, 50,100, 140 చ||గ||ల నార్త్ ఈస్ట్ (G+1) ఉప్పల్ బస్‌స్టాప్ ఇండిపెండెంట్ హౌజ్‌లు, 1000sft అపార్ట్‌మెంట్ ఉప్పల్ బస్‌స్టాప్, 24hrs మంజీర వాటర్, లోన్ సౌకర్యం కలదు. Ph: 8008927698, 8179503198
NT-181831

FARM PLOTS FOR SALE

★శంషాబాద్‌కు దగ్గరలో 300 చ||గ|| ఫామ్‌ప్లాట్లు 4,50,000/- మాత్రమే. EMI సౌకర్యం కలదు. R.T.C బస్‌రోడ్ ఫేసింగ్. M.S. ఎస్టేట్స్. ఫ్రీ సైట్ విజిట్. Ph: 9949190981.
NT-182266

★Farm Plots అప్పా జంక్షన్ @ చేవెళ్ళ. **క్లబ్‌హౌస్,** స్విమ్మింగ్‌పూల్, మలబార్ చెట్లు, పండ్లమొక్కలు. ఫుల్ డెవలప్డ్, స్పాట్ రిజిస్ట్రేషన్, Nr.100ft Road, Ph: 9951685471.
NT-803

★ఫామ్ ల్యాండ్ ఓపెన్ ప్లాట్స్ గజం రూ|| 500/- (యాద్రాది) కొలనుపాక నుండి (సిద్దిపేట్ హైవే) నుండి 10. కి.మీ., 5 గుంటల నుండి ఎకరాలలో అమ్మబడును. Ph: 9278909278,9848553813.
NT-188120

★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సిరులు కురిపించే శ్రీగంధం మలబారు చెట్లతో 150,167 గజాల Farm Plots కలవు. క్లియర్ టైటిల్, స్పాట్ రిజి|| 9133332053.
NT-733

★WGL హైవే బీబీనగర్ Rly స్టేషన్‌కు 1 Km & NIMSకు 2 Km గ|| 2799/- రూ|| క్లబ్ హౌజ్, స్విమ్మింగ్‌పూల్, ఫుడ్ కోర్ట్స్, ఫ్రూట్ & టేక్ ప్లాంటేషన్ గే|| కమ్యూ|| వెంచర్, Ph: 8121222210.
NT-182053

FLATS FOR SALE

★తుర్కయాంజాల్ సాగర్ రింగ్ రోడ్ అతి దగ్గర్లో కరుణశ్రీ రెసిడెన్షియల్ 2BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలదు. Ready To Occupy సంప్రదించండి. Ph : 9666669809/ 9000009642.
NT-356

★Attapur, Pillar No.:212, 3BHK, 1552 Sft, E/F, Car pkg, Wood Work, 24 Hrs Water, Generator & Including Amenities @ 56L. Ph: 7799123414/13.
NT-182209

COMMERCIAL/TO-LET

★Kondapur, Sriramnagar Colony, Nr. Botanical Garden 3 Shutters 10x12 Feets for Rent. Suitable for Office, Clinics, Courier & All other Purpose. Cont: 9247775531.
NT-182454

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటనదారులకు గమనిక

GST

01-07-2017 నుండి ప్రతి ప్రకటన పై GST (Goods and Service Tax) అదనం.



రకుల్‌ప్రీత్‌సింగ్

'టాప్ హీరోల నుంచి వర్ధమాన కథానాయకుల వరకు రకుల్ నామజపం చేస్తున్నారు. అనతి కాలంలోనే వరుస విజయాలతో క్రేజీ కథానాయికగా గుర్తింపును సొంతం చేసుకున్నారామె. శ్రమ ఎప్పుడూ వృథాకాదనేది తన నమ్మకమని, చేసే పనితో పాటు దేవుడిని నమ్ముతానని అదే తన సక్సెస్ సీక్రెట్ అని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆమె నటించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో రకుల్ ప్రీత్‌సింగ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

నా తప్పులను సరిదిద్దుకున్నాను!

- **'జయ జానకి నాయక' ఎలా వుంటుంది?**

అందరూ ఊహిస్తున్న దానికి పూర్తి భిన్నంగా వుండే చిత్రమిది. దర్శకుడు బోయపాటి శ్రీను సిగ్నేచర్ వుంటూనే కొత్త పంథాలో సాగే ప్రేమకథాచిత్రమిది. సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. ప్రస్తుత జనరేషన్‌లో జరుగుతున్న స్వచ్ఛమైన ప్రేమను ఈ చిత్రంలో చూపించారు. ఇందులో నేను జానకి అనే పాత్రలో కనిపిస్తాను. భిన్నపార్శ్వాల్లో సాగుతుంది. కుటుంబం అంటే అమితంగా ఇష్టపడే అమ్మాయి. ఓ సంఘటన వల్ల జానకి జీవితం మారిపోతుంది. ఆ సంఘటన ఏమిటి? అనేది సినిమాకు కీలకం. అవేంటనేది ఇప్పుడు చెప్పను.

- **వదులుకోవాల్సిన ప్రతి సారి ప్రేమనే వదులుకోవాలా అని ఓ డైలాగ్ వుంది. మీరైతే దేన్ని వదులుకోవడానికి ఇష్టపడతారు?**

నా జీవితంలోకి ప్రేమ ప్రవేశించినప్పుడు దాని గురించి మాట్లాడతాను.

- **జానకి పాత్ర నుంచి బయటికి రాలేకపోయారట?**

ఇప్పటి వరకు నేను నటించిన పాత్రల్లో చాలా బరువైన పాత్ర ఇదే. సినిమాలో ఎక్కువ భాగం నా పాత్ర ఏడుస్తూనే కనిపిస్తుంది. పది రోజులు చిత్రీకరణలో పాల్గొంటే చిత్రీకరణ జరిగినన్ని రోజులు జానకి పాత్రలోనే లీనమై మూడీగా వుండేదాన్ని. షాట్ విరామం సమయంలో నేను మూడీగా వుండటం చూసిన దర్శకుడు బోయపాటి శ్రీను 'సీన్ పూర్తయింది. ఇక నవ్వొచ్చు' అనే వారు. అప్పుడు నవ్వేదాన్ని. అంతగా జానకి పాత్ర నన్ను ప్రభావితం చేసింది. షూటింగ్ జరుగుతున్న సందర్భంలో మా అమ్మ ఫోన్ చేసినా మాట్లాడకుండా మూడీగా వున్న సందర్భాలున్నాయి.

- **బోయపాటి శ్రీను మార్కుకు భిన్నంగా ఈ టైటిల్ పెడతారని ఊహించారా?**

బోయపాటి నుంచి ఇలాంటి టైటిల్ వస్తుందని ఊహించలేదు. సినిమాకు ఏం కావాలో ఎలా వుంటే బాగుంటుందో ఆయనకు బాగా తెలుసు. ఇది కంప్లీట్‌గా జానకి చుట్టూ తిరిగే కథ. కుటుంబ భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. అందుకే 'జయ జానకి నాయక' అనే సాఫ్ట్ టైటిల్ పెట్టారు.

- **మీ మైనస్‌లు, ప్లస్‌లు తెలుసని బోయపాటి అన్నారు. అవేంటో చెప్పండి?**

నా ప్లస్‌లు, మైనస్‌లు ఏంటనేది నాకు తెలియదు. మనలో వున్న బలాలు, బలహీనలు ఏంటనేది ఒకరు చెబితేనే తెలుస్తుంది. ప్రతి ఒక్కరూ నేను పర్‌ఫెక్ట్ అనుకుంటారు. నేను అంతే. నాలోని బలాలు, బలహీనతలు ఏంటనేది దర్శకుడు బోయపాటి చెప్పారు. వాటిని సరిదిద్దుకున్నాను కూడా.

రకుల్ హవా నడుస్తున్నదని అంతా అంటున్నారు. నంబర్ గేమ్‌ని నమ్ముతారా?

నంబర్ గేమ్ అనేదాన్ని నమ్మను. వర్క్‌నే ఎక్కువగా నమ్ముతాను. రెండు సినిమాలు హిట్ అయితే రకుల్ టాప్ పోజీషన్‌లో వుందంటారు. అదే రెండు సినిమాలు పోతే రకుల్ పని అయిపోయింది అంటారు. రకుల్‌కు కొత్త హీరోయిన్‌లు అంటే భయం. పోటీని తట్టుకోవడం కష్టమే అనే వార్తల్ని కూడా వింటుంటాను. అవన్నీ వింటున్నప్పుడు నవ్వొస్తూ వుంటుంది. నాకు తెలుగు చిత్రపరిశ్రమ అంటే చాలా ఇష్టం. బాంబే వెళ్లినా తెలుగు చిత్రాల షూటింగ్‌ల గురించే చెబుతుంటాను.

- **స్టార్ హీరోలతో నటిస్తూ కొత్త హీరో చిత్రాన్ని అంగీకరించడానికి కారణం?**

'సరైనోడు' చిత్రీకరణ సమయంలో బోయపాటి శ్రీను ఈ సినిమా గురించి అడిగారు. కథ విన్నప్పుడు నా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా వుందనిపించింది. వెంటనే అంగీకరించాను. కన్విక్షన్ వున్న దర్శకుడు బోయపాటి. ఆయన ఏది నమ్ముతారో దాన్నే తెరపైన చూపించడానికి తాపత్రయపడతారు.

- **వర్ధమాన కథానాయికలు నివేదా థామస్, సాయిపల్లవి మీకు పోటీ అనుకుంటున్నారా?**

అలా అని నేను ఎందుకు అనుకోవాలి. 'నిన్ను కోరి' చూసిన తరువాత నివేదాతో చాలాసేపు మాట్లాడాను. ఇటీవల విడుదలైన 'ఫిదా' నేను ఇంకా చూడలేదు. మన పరిశ్రమలో మంచి నటులున్నారు. ఇలాంటి కథాబలమున్న సినిమాలు విజయవంతమైతే మరిన్ని హీరోయిన్ ప్రధాన కథల్ని రచయితలు రాసే అవకాశం వుంది. కొత్త వాళ్లు వచ్చారు కదా ఎక్కడ నా స్థానం పోతుందో అనే భయం నాకు లేదు.

- **తెలుగు సినిమాల్లో హీరోయిన్ ప్రాధాన్యత పెరుగుతున్నదనే మార్పును అంగీకరిస్తారా?**

అలా అని ఏమీలేదు. గతంలో శ్రీదేవి, టబు, జెనీలియా, త్రిష నటించిన చిత్రాల్లో వాళ్లు కేవలం గ్లామర్, పాటలకే పరిమితం కాలేదు. నటనకు అవకాశమున్న పాత్రల్లో నటించారు. 'బాహుబలి' తరువాత ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా అంటే గౌరవం పెరిగింది. బాలీవుడ్ వెళితే టాలీవుడ్‌లో కొత్త తరహా చిత్రాలు వస్తున్నాయని చెబుతుండటం ఆనందంగా వుంది.

- **'స్పైడర్'లో మీ పాత్ర చిత్రణ ఎలా వుంటుంది?**

సినిమాలో మెడికోగా కనిపిస్తాను. చిత్రమైన ఆలోచనలతో సాగుతుంది. నేను చేసే పనులు ప్రేక్షకులకు నవ్వుపుట్టించేలా వుంటాయి. దర్శకుడు మురుగదాస్ చిత్రంలో తొలిసారి నటించడం కొత్త అనుభూతిని కలిగించింది. 'స్పైడర్'కు సంబంధించిన విశేషాల్ని మరోసారి వివరిస్తాను.

- **ప్రస్తుతం చేస్తున్న సినిమాలు?**

తమిళంలో సూర్య హీరోగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రాన్ని అంగీకరించాను.

బాలకృష్ణ 102వ చిత్రం షురూ!



బాలకృష్ణపై క్లాప్‌నిస్తున్న బోయపాటి శ్రీను

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 102వ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం బాలకృష్ణపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బోయపాటి శ్రీను క్లాప్ నివ్వగా, బి.గోపాల్ కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ '18 ఏళ్ల తరువాత తెలుగులో నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. బాలకృష్ణతో తొలిసారి కలిసి పనిచేస్తున్నాను. గతంలో రెండు, మూడు సార్లు ఇద్దరం కలిసి పనిచేయాలనుకున్నాం కానీ కుదరలేదు. సి.కల్యాణ్, ఆయన తమ్ముడు వెంకటేశ్వరరావు చక్కని ప్లానింగ్‌లో నిర్మిస్తున్నతీరుతో సినిమా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకంతో వున్నాను' అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'బాలకృష్ణ 101వ సినిమా ఇదే కావాల్సింది. కానీ దర్శకుడు రవికుమార్ బిజీగా వుండటం, అదే సమయంలో బాలకృష్ణ దర్శకుడు పూరితో సినిమా అంగీకరించడంతో కుదరలేదు. కె.ఎస్.రవికుమార్ కెరీర్‌లో ఎన్ని బిగ్ హిట్‌లు వున్నాయో అందరికి తెలిసిందే. ఆయన చేసిన సినిమాల్లో 95 శాతం సక్సెస్ అయ్యాయి. తొలుత వేరే కథలు అనుకున్నాం. గుర్తుండిపోయే సినిమా చేయాలనే ఉద్దేశ్యంతో రచయిత రత్నం 15 నిమిషాల్లో చెప్పిన కథ ఓకే చేశాం. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుగుతుంది. వచ్చే నెల 6 నుంచి కుంభకోణంలో తదుపరి షెడ్యూల్ వుంటుంది. ఆ తరువాత వైజాగ్, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరుపుతాం. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో ఇద్దరు కథానాయికలు నటిస్తారు. వారు ఎవరనేది త్వరలో తెలియజేస్తాం' అన్నారు. మురళీమోహన్, బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్‌రాణా, ప్రభాకర్, శివపార్వతి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సి.రామ్‌ప్రసాద్.

బాహుబలి భాషా హద్దుల్ని చెరిపివేసింది



అమీర్‌ఖాన్

'బాహుబలి-2' అఖండ విజయంపై బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్ స్పందించారు. తన తాజా చిత్రం 'సీక్రెట్ సూపర్‌స్టార్' ప్రమోషన్‌లో పాల్గొంటున్న ఆయన 'బాహుబలి' సినిమాను ప్రశంసలతో ముంచెత్తారు. భారతీయ సినీ చరిత్రలో 'బాహుబలి-2' సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని కొనియాడారు. వృత్తిపరమైన పనులతో బిజీగా వుండటం వల్ల తానింకా సినిమా చూడలేదని...త్వరలో చూస్తానని చెప్పారు. 'నా దృష్టిలో సినిమాకు భాషా పరిధులు వుండవు. కథ, పాత్రలతో కనెక్ట్ అయితే ఏ భాషా చిత్రానికైనా ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారు. భారతీయ సినిమా సత్తా ఏమిటో 'బాహుబలి-2' చాటిచెప్పింది. చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు' అన్నారు.


కొత్త వాళ్లతో సినిమాలు తీసి బోర్‌కొట్టింది



సురేష్‌బాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, అనూప్ రూబెన్స్, తేజ, కాజల్ అగర్వాల్, రానా, కేథరిన్

'సినిమాల పరంగా, వ్యక్తిగతంగా నందమూరి తారకరామారావు నాకు దేవుడితో సమానం. ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల ఫిలాసఫీ జోగేంద్ర పాత్రలో కనిపిస్తుంది. అందుకే ఈ సినిమా చేశాను. ఈ చిత్రం నాకు చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయింది. సినిమా విషయంలో నేను చాలా గర్వంగా వున్నాను' అన్నారు రానా. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. తేజ దర్శకత్వం వహిస్తున్నారు. డి.సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్‌రెడ్డి, సి.భరత్‌చౌదరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 'జోగేంద్ర యువగర్జన' పేరుతో చిత్ర బృందం ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని మా తాతయ్య చూడలేకపోయారనే లోటు వుంది. ఈ రోజు ఈ వేదికపై ఉన్నామంటే అది ఆయన వల్లే. ఆయనతో సినిమా చేయలేకపోయానే అనే బాధ కూడా నన్ను వెంటాడుతున్నది. మా నాన్నతో కలిసి పనిచేసిన తొలి చిత్రమిది. ఆయన మంచి నిర్మాత. జోగేంద్ర కథ నేపథ్యంలో తేజ రాసుకున్న సినిమా ఇది. ఎంతో అవగాహన వుంటే తప్ప ఇలాంటి కథ రాయలేరు. వెంకటేష్‌గారి అభిమానులు నాకు సహకారాన్ని అందిస్తున్నారు కాబట్టే నేను కొత్త తరహా చిత్రాలు చేయగలుగుతున్నాను. వారి సహకారాన్ని ఇలాగే కొనసాగిస్తే హాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తాను. త్వరలోనే యువత కోసం ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలనుకుంటున్నాం. చిత్రాన్ని ఈ నెల 11న విడుదల చేస్తాం' అన్నారు. తేజ మాట్లాడుతూ 'రానాకు కథ నచ్చడంతో కలిసి సినిమా చేశాం. ఆయనకు తగ్గ కథానాయిక కావాలని కాజల్‌ను ఎంచుకున్నాం. స్టైలిష్ క్యారెక్టర్ కోసం కేథరిన్‌ని ఎంపిక చేసుకున్నాం. కొత్త వాళ్లతో సినిమాలు తీసి బోర్‌కొట్టింది. అందుకే పాతవాళ్లతో ఈ సినిమా తీశాను' అన్నారు. డి.సురేష్‌బాబు మాట్లాడుతూ ''బాహుబలి' తరువాత రానా అంగీకరించిన చిత్రమిది. కథలంటే నేను సాధారణంగా భయపడుతుంటాను. నా కుమారుడు రానాతో సినిమా అంటే మరింత భయం. రానా ఈ కథ విన్నప్పుడే తనకు సూటవుతుందన్నాడు. అయితే ఇందులో తను నటించగలడా? లేదా? అనే సందేహం కలిగింది. రషెస్ చూసిన తరువాత కిరణ్ బాగుందని చెప్పాడు. పాత్రల నేపథ్యంలో సాగే పొలిటికల్ డ్రామా ఇది. కాజల్, రానా, కేథరిన్ బాగా నటించారు. దర్శకుడు తేజ అద్భుతంగా వారి నుంచి తనకు కావాల్సిన నటనను రాబట్టుకున్నారు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజల్ అగర్వాల్, కేథరిన్, నవదీప్, ఎం.వి.కిరణ్‌రెడ్డి, సి.భరత్‌చౌదరి పాల్గొన్నారు.

మళ్లీరావా చెలియా..



ఆకాంక్షసింగ్

సుమంత్, ఆకాంక్షసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ రావా'. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్క నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'పదమూడేళ్ల తర్వాత తన ప్రియురాలిని కలుసుకున్న ఓ ప్రేమికుడి కథ ఇది. వారిద్దరు దూరమవ్వడానికి కారణమేమిటి? ఆమె అతడిని గుర్తుపట్టిందా? లేదా? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. పాటల రికార్డింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సుమంత్ నటన సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది' అని అన్నారు. నిర్మాతగా తన తొలి చిత్రమిదని, రాజోలు, భీమవరం, హైదరాబాద్, బెంగళూరులలో చిత్రీకరణ జరిపామని, నిర్మాణానంతర కార్యక్రమాల్ని పూర్తిచేసి త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకువస్తామని నిర్మాత చెప్పారు. అన్నపూర్ణ, కాదంబరి కిరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, కెమెరా: సతీష్ ముత్యాల.